సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+12 వెల: ₹ 5.00

సంపుటి: 12
సంచిక: 274


బుధవారం 25-12-2019

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | NIZAMABAD | WARANGAL | KHAMMAM | KARIMNAGAR | MAHABOOBNAGAR | MUMBAI | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KURNOOL | MANGALAGIRI | NELLORE | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM



'నేను కలలుగన్న మరో ప్రపంచానికి మహిళలే మూలస్తంభాలు'




# అవును.. ఎన్నార్సీపై చర్చించలేదు

## ప్రధాని చెప్పింది నిజమే: అమిత్ షా

**న్యూఢిల్లీ:** దేశవ్యాప్త జాతీయ పౌర పట్టిక(ఎన్నార్సీ)ను రూపొందించే విషయంపై ఇంతవరకు చర్చ జరగలేదని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా కూడా స్పష్టం చేశారు. ఈ విషయంలో ఇటీవల ఢిల్లీలో జరిగిన బహిరంగ సభలో ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్య వాస్తవమేనన్నారు. '2014లో మేము అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కేబినెట్లో కానీ, పార్లమెంట్లో కానీ దేశవ్యాప్త ఎన్నార్సీపై చర్చ జరగలేదు' అని ఆదివారం ఓ బహిరంగ సభలో మోదీ వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. తాజాగా, మంగళవారం ఏఎన్‌ఐ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అమిత్ షా కూడా అదే విషయాన్ని ధ్రువీకరించారు. పౌరసత్వ సవరణ చట్టానికి, ఎన్నార్సీకి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా తీవ్ర స్థాయిలో ఆందోళనలు జరుగుతుండటంపై స్పందిస్తూ.. 'ఈ విషయంలో ప్రజలకు అవగాహన కల్పించడంలో ప్రభుత్వ వైఫల్యం కొంత ఉందని ఒప్పుకుంటాను. కొంత సమాచార లోపం కనిపిస్తోంది. అయితే, ఏ ఒక్క మైనారిటీ వ్యక్తి కూడా తన పౌరసత్వాన్ని కోల్పోడు అని పార్లమెంట్లోనే నేను స్పష్టంగా చెప్పాను' అని షా వివరించారు.




## సర్వాంగసుందరంగా...

క్రిస్మస్ వేడుకలకు మెదక్ జిల్లా కేంద్రంలోని ప్రసిద్ధ సీఎస్‌ఐ చర్చి అందంగా ముస్తాబైంది. మంగళవారం రాత్రి విద్యుత్ వెలుగులతో ఇలా మెరిసిపోయింది. వివిధ రాష్ట్రాల నుంచి బుధవారం దాదాపు 10 లక్షల మంది భక్తులు చర్చిని సందర్శిస్తారని అధికారులు అంచనా వేశారు.

# మేలో 'సెట్'ల పండుగ

## మే 5, 6, 7 తేదీల్లో ఇంజనీరింగ్ ఎంసెట్

- 9, 11 తేదీల్లో అగ్రికల్చర్ ఎంసెట్, మే 2న ఈసెట్.. సెట్స్ తేదీలు ఖరారు చేసిన ఉన్నత విద్యామండలి
- వికలాంగులకు సెట్స్ పరీక్ష ఫీజు తగ్గించే యోచన.. గతంలో నిర్వహించిన వర్సిటీలకే మళ్లీ బాధ్యతలు
- త్వరలోనే సెట్స్ కన్వీనర్లు ఖరారు, ఆన్‌లైన్‌లో పరీక్షలు
- యథాతథంగా నిమిషం నిబంధన
- ఉన్నత విద్యా మండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి



**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో ఇంజనీరింగ్‌లో (బీఈ/బీటెక్‌లో) ప్రవేశాల కోసం 2020 మే 5, 6, 7 తేదీల్లో ఇంజనీరింగ్ ఎంసెట్‌ను నిర్వహించనున్నట్లు ఉన్నత విద్యా మండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి తెలిపారు. రాష్ట్రంలోని వివిధ వృత్తి, సాంకేతిక విద్యా సంస్థల్లో వచ్చే విద్యా సంవత్సరంలో (2020–21) ప్రవేశాల కోసం నిర్వహించనున్న ఉమ్మడి ప్రవేశ పరీక్షల (సెట్స్) తేదీలను మంగళవారం ఉన్నత విద్యామండలి ఖరారు చేసింది. అనంతరం ఆ వివరాలను మండలి వైస్ చైర్మన్లు ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి, ప్రొఫెసర్ వెంకటరమణతో కలసి చైర్మన్ పాపిరెడ్డి వెల్లడించారు. ఈసెట్, ఎంసెట్, పీఈసెట్, ఐసెట్, ఎడ్‌సెట్, లాసెట్, పీజీలాసెట్, పీజీఈసెట్ నిర్వహణ తేదీలను కూడా ప్రకటించారు. మే 2వ తేదీన ఈసెట్‌తో ప్రవేశ పరీక్షలు ప్రారంభం అవుతాయని, అదే నెలలో అన్ని కోర్సులకు సంబంధించిన ప్రవేశ పరీక్షలను పూర్తి చేస్తామని తెలిపారు. జూలై నెలాఖరులోగా అన్ని కోర్సులకు కౌన్సెలింగ్ నిర్వహించి ప్రవేశాలను పూర్తి చేస్తామని, ఆగస్టు 1 నుంచి తరగతులు మిగతా 2వ పేజీలో ▶

## జనవరి 6 నుంచి నేషనల్ ఎంట్రన్స్‌లు

- 6 నుంచి 11 వరకు మొదటి విడత జేఈఈ మెయిన్
- ఏప్రిల్ 3 – 9 వరకు రెండో విడత జేఈఈ మెయిన్
- ఏప్రిల్ 13–19 వరకు విట్, 29, 30 తేదీల్లో కేసెట్
- మే 3న నీట్, ఆలిండియా లా ఎంట్రన్స్
- 17న జేఈఈ అడ్వాన్స్‌డ్

**సాక్షి, హైదరాబాద్:** జనవరి 6 నుంచి ఒక్కొక్కటిగా పరీక్షలు ప్రారంభం కానున్నాయి. వచ్చే విద్యా సంవత్సరంలో (2020–21) వివిధ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్షల (సెట్స్) తేదీలను జాతీయ సంస్థలు ఇప్పటికే ప్రకటించగా వివిధ రాష్ట్రాల విద్యా శాఖలు తేదీలను ఖరారు చేస్తున్నాయి. వాటిల్లో ఇప్పటికే కేరళ, కర్ణాటక, ఒడిశా రాష్ట్రాలు ప్రవేశ పరీక్షల తేదీలను ఖరారు చేసి ప్రకటించాయి. జనవరి 6 నుంచి 11 వరకు దేశవ్యాప్తంగా ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశాలకు జేఈఈ మెయిన్ (మొదటి విడత) పరీక్షలు నిర్వహించేందుకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) చర్యలు చేపట్టింది. అలాగే జాతీయ స్థాయి మిగతా 2వ పేజీలో ▶

## 29న జార్ఖండ్ సీఎంగా హేమంత్ ప్రమాణం



జార్ఖండ్ ముక్తిమోర్చా(జేఎంఎం) నేత హేమంత్ సోరెన్(44) ఈ నెల 29వ తేదీన జార్ఖండ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. మంగళవారం సాయంత్రం హేమంత్ సోరెన్, సంకీర్ణంలోని కాంగ్రెస్, రాష్ట్రీయ జనతాదళ్(ఆర్జేడీ) తదితర పార్టీల నేతలతో కలిసి రాజ్‌భవన్‌లో గవర్నర్ ద్రౌపది ముర్మును కలిశారు.

- వివరాలు 5లో

## 'ఎన్‌పీఆర్'కు కేంద్ర కేబినెట్ ఓకే



- జనగణనకు రూ. 8.754 కోట్లు, ఎన్‌పీఆర్‌కు రూ. 3,941 కోట్లు
- ఎన్‌పీఆర్ నమోదు ప్రక్రియ కొత్తది కాదు ఎన్నార్సీతో సంబంధం లేదు
- కేంద్ర సమాచార మంత్రి ప్రకాశ్ జవదేకర్

- వివరాలు 5లో

## చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్‌కు లైన్ క్లియర్



రక్షణ వ్యవహారాల్లో కేంద్ర ప్రభుత్వానికి సలహాలివ్వనున్న 'చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్(సీడీఎస్)' పదవి ఏర్పాటుకు భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ ఓకే చెప్పింది. కార్గిల్ రివ్యూ కమిటీ 1999లో ఇచ్చిన సూచన మేరకు సీడీఎస్ నియామకాన్ని చేపట్టనున్నట్లు కేంద్ర సమాచార, ప్రసార శాఖల మంత్రి ప్రకాశ్ జవదేకర్ తెలిపారు.

- వివరాలు 5లో

## ఆర్టీసీ ప్రక్షాళన!

- డిపోల సిబ్బంది సర్దుబాటు
- అనుబంధ విభాగాల్లో అక్కర్లేనివి తొలగింపు.. దిద్దుబాటు చర్యలకు ప్రభుత్వం శ్రీకారం
- ఆర్టీసీ ఈడీలతో ఇన్‌చార్జి ఎండీ భేటీ
- సంస్థలోని సమస్యలపై నివేదిక సమర్పణకు ఆదేశం
- వచ్చే నెల్లో సరుకు రవాణా విభాగం ప్రారంభం

- వివరాలు 2లో

## రాహుల్, ప్రియాంకలను ఆపేశారు

- వివరాలు 5లో









# ఇక్కడా ఈడబ్ల్యూఎస్ కోటా!

## రాష్ట్రంలోని ఉన్నత విద్యాసంస్థల్లో వచ్చే ఏడాది నుంచి అమలు

### చర్యలు చేపట్టిన ఉన్నత విద్యామండలి

### 10% సీట్లు పెంచి కోటా అమలు చేయాలని నిర్ణయం

### ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం: మండలి చైర్మన్ పాపిరెడ్డి

సాక్షి, హైదరాబాద్

రాష్ట్రంలోని ఉన్నత విద్యాసంస్థల్లో వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఎకనామికల్లీ వీకర్ సెక్షన్ (ఈడబ్ల్యూఎస్) కోటా అమలు చేయడానికి ఉన్నత విద్యా మండలి చర్యలు చేపట్టింది. ఆయా సంస్థల్లో 10 శాతం సీట్లను పెంచి ఈ కోటాను అమలు చేయాలని నిర్ణయించింది. కేంద్ర విద్యా సంస్థల్లో గతేడాది నుంచి ఈడబ్ల్యూఎస్ కోటాను అమలు చేస్తున్న కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ (ఎంహెచ్‌ఆర్‌డీ).. వచ్చే విద్యా సంవత్సరం నుంచి (2020–21) అన్ని రాష్ట్రాల్లోని విద్యా సంస్థల్లో ఈ కోటా అమలు చేయాలని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని విద్యాసంస్థల్లో ఈడబ్ల్యూఎస్ కోటాను అమలు చేయడానికి అనుమతి ఇవ్వాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినట్లు ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ తుమ్మల పాపిరెడ్డి తెలిపారు.

**ప్రభుత్వ కాలేజీలకు ప్రయోజనం**


ఈడబ్ల్యూఎస్ కోటా అమల్లోకి వస్తే రాష్ట్రంలోని వృత్తి, సాంకేతిక విద్యా సంస్థల్లో సీట్లు పెరగనున్నాయి. ముఖ్యంగా ప్రభుత్వ ఇంజనీరింగ్, ఫార్మసీ, బీఈడీ, లా, పీజీ కాలేజీల్లో సీట్లు పెరుగుతాయి. 15 ఏళ్లుగా ఒక్క సీటు కూడా పెరగని ప్రభుత్వ కాలేజీల్లో 10 శాతం సీట్లు కొత్తగా అందుబాటులోకి వస్తే ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన ప్రతిభావంతులకు మరింత ప్రయోజనం చేకూరనుంది. జేఎన్‌టీయూ, ఉస్మానియా, కాకతీయ యూనివర్సిటీల పరిధిలోని ఇంజనీరింగ్ కాలేజీల్లో 300కు పైగా సీట్లు అదనంగా లభిస్తాయి. ప్రస్తుతం రాష్ట్రంలోని 14 ఇంజనీరింగ్ కాలేజీల్లో 3,071 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

**ప్రైవేటు కాలేజీల్లోనూ భారీ పెరుగుదల**

కోటా అమలుతో ప్రైవేటులోనూ భారీగా సీట్లు పెరగొచ్చు. అయితే ఆ నిబంధనను ప్రైవేటు సంస్థల్లో అమలు చేయడంపై సర్కారు తేల్చాల్సి ఉంది. ప్రస్తుతం ఉన్నత విద్యా కోర్సుల్లో 6,52,178 సీట్లు అందుబాటులో ఉన్నాయి. అందులో డిగ్రీలోనే 4,43,269 సీట్లు ఉండగా వృత్తి, సాంకేతిక విద్యా కోర్సుల్లో 2,08,909 సీట్లు ఉన్నాయి. కానీ డిగ్రీ సీట్లలో సగం కూడా భర్తీ అవట్లేదు. ఈ నేపథ్యంలో డిగ్రీలో సీట్ల పెంపు అక్కర్లేదని ప్రభుత్వం భావిస్తోంది. ఇక వృత్తి విద్యా కోర్సుల్లో 10% సీట్లను పెంచితే అదనంగా 20,890 సీట్లు అందుబాటులోకి వస్తాయి.

# కొత్త సీఎస్ ఎవరు?

- నెలాఖరులో ఎస్‌కే జోషి ఉద్యోగ విరమణ
- రేసులో అజయ్ మిశ్రా, సోమేశ్ కుమార్



అజయ్ మిశ్రా



సోమేశ్ కుమార్

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) శైలేంద్ర కుమార్ జోషి ఈ నెలాఖరులో ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఆయన పదవీ కాలం మరో వారం రోజులే మిగిలి ఉండటంతో కొత్త సీఎస్ ఎంపికపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. సీనియారిటీ, సమర్థత, స్వభావాన్ని పరిగణనలోకి తీసుకుని కొత్త సీఎస్ ఎంపికపై సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకోనున్నారు. సీఎస్ పదవి రేసులో ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ మిశ్రా పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఆయనతో పాటు రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ పేరు సైతం ప్రభుత్వ పరిశీలనలో ఉంది. వీరిద్దరిలో ఒకరిని సీఎస్‌గా నియమించే అవకాశాలున్నాయని సచివాలయ అధికారవర్గాలు పేర్కొంటున్నాయి.

**సీనియర్లు చాలా మందే..**

సీనియారిటీపరంగా సీఎస్ రేసులో తెలంగాణ కేడర్‌కు చెందిన 1983 బ్యాచ్ అధికారులు బీపీ ఆచార్య, బినయ్‌కుమార్, 1984 బ్యాచ్ అధికారి అజయ్ మిశ్రా, 1985 బ్యాచ్ అధికారిణి పుష్పా సుబ్రమణ్యం, 1986 బ్యాచ్ అధికారులు సురేశ్ చందా, చిత్రా రామచంద్రన్, హీరాలాల్ సమారియా, రాజేశ్వర్ తివారీ, 1987 బ్యాచ్ మిగతా 2వ పేజీలో ▶



# క్రిస్మస్ గ్రీటింగ్స్






రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఏసు ప్రభువు జన్మ దినాన్ని ఆనందంతో జరుపుకోవాల్సిన సందర్భమిది అని అన్నారు. జీసస్ బోధనల అనుసారం కరుణ, ప్రేమకు పునరంకితం కావాలని తన సందేశంలో పేర్కొన్నారు.



రాష్ట్ర ప్రజలకు సీఎం కేసీఆర్ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రేమ, కరుణను ప్రబోధించిన ఏసుక్రీస్తు జన్మదినాన్ని ప్రపంచవ్యాప్తంగా ఆనందోత్సాహాలతో జరుపుకుంటారని సీఎం తన సందేశంలో తెలిపారు. ప్రజలు సుఖసంతోషాలతో క్రిస్మస్ పర్వదినాన్ని జరుపుకోవాలని ఆకాంక్షించారు.



క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని క్రైస్తవులందరికీ ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలియజేశారు. సాటి మనుషుల పట్ల ప్రేమ, నిస్సహాయుల పట్ల కరుణ, ఆకాశమంతటి సహనం, అవధులు లేని త్యాగం, శాంతియుత సహజీవనం, శత్రువుల పట్ల క్షమా గుణం.. ఇవన్నీ తన జీవితం ద్వారా మానవాళికి క్రీస్తు ఇచ్చిన మహోన్నత సందేశాలని, క్రీస్తు బోధనలు ఎప్పటికీ మనుషులందరినీ సన్మార్గంలో నడిపిస్తాయని ఆయనీ సందర్భంగా పేర్కొన్నారు.



రాష్ట్ర ప్రజలు, క్రైస్తవ సోదరులకు టీపీసీసీ అధ్యక్షుడు, ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఏసు బోధనలు, సందేశాలు ప్రపంచవ్యాప్తంగా ఆచరణీయమైనవని, ప్రేమ, శాంతి సందేశాలు, ఆదర్శాలు ఎంతో ఉన్నతమైనవని పేర్కొన్నారు. ప్రస్తుతం దేశంలో ఉన్న పరిస్థితుల్లో ఏసు సందేశాలను ఆచరించాలని, ఆయన ఆశయాలను పాటించడమే నిజమైన భక్తి అని చెప్పారు.



శాంతి, దయ, కరుణ, ప్రేమలతో కూడిన జీవనాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన జీసస్ క్రీస్తు జన్మ దినాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రజలకు అటవీ, దేవాదాయ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రపంచానికి శాంతి సందేశాన్ని అందించిన గొప్ప మానవతావాది ఏసు ప్రభువని తన సందేశంలో పేర్కొన్నారు. ప్రభువు కృపతో సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం మరింత పురోభివృద్ధి సాధించాలని అభిలషించారు.

## 'నిమ్జ్'గా ముచ్చర్ల ఫార్మాసిటీ

### కేంద్రం ప్రకటించిందన్న చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి

**సాక్షి, రంగారెడ్డి జిల్లా:** కందుకూరు మండలం ముచ్చర్లలో ఏర్పాటు చేస్తున్న హైదరాబాద్ ఫార్మాసిటీని కేంద్ర ప్రభుత్వం జాతీయ పెట్టుబడులు, ఉత్పత్తి కేంద్రం (నిమ్జ్)గా ప్రకటించిందని చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి తెలిపారు. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల ఆయన హర్షం వ్యక్తంచేశారు. ఇటీవల జరిగిన పార్లమెంట్ సమావేశాల్లో ఫార్మాసిటీ ప్రాధాన్యత, ప్రత్యేకతను, దీని ఏర్పాటులో రాష్ట్ర ప్రభుత్వం చూపుతున్న చొరవను వివరించామని, ఈ నేపథ్యంలో ఫార్మాసిటీని నిమ్జ్‌గా ప్రకటించాలని కేంద్రాన్ని కోరినట్లు చెప్పారు. అలాగే కేంద్ర రైల్వే, పరిశ్రమల, వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్‌ను ప్రత్యేకంగా కలిసి విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. ఫార్మాసిటీని నిమ్జ్‌గా ప్రకటించినట్లు తనకు పీయూష్ గోయల్ లేఖ రాసినట్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం ద్వారా పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని, జిల్లా మరింత అభివృద్ధి సాధిస్తుందని సంతోషం వ్యక్తం చేశారు.

## 'బాలామృతం'లో అవకతవకలు లేవు

### స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కమిషనర్

**సాక్షి, హైదరాబాద్:** అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం బాలామృతం పంపిణీలో ఎలాంటి అవకతవకలు జరగడం లేదని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. 'బ్లాక్ మార్కెట్‌కు బాలామృతం'శీర్షికతో గత ఆదివారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో ఓ రైతు బాలామృతాన్ని పశువులకు దాణాగా వేసి ఖాళీ ప్యాకెట్లను తన వ్యవసాయ క్షేత్రంలో పడేసినట్లు ఈ కథనంలో పేర్కొనడంలో వాస్తవం లేదని స్పష్టంచేశారు. బాలామృతం ఖాళీ ప్యాకెట్లను చెత్తకుప్పలో పడేస్తే, మరోలా రాశారని పేర్కొన్నారు.

## సామర్థ్యం లేకే పొరుగుపాల కొనుగోలు

**సాక్షి, హైదరాబాద్:** అంగన్‌వాడీలకు సరిపడా పాలను సరఫరా చేసే సామర్థ్యం తెలంగాణ విజయ డెయిరీకి లేనందువల్లే కర్ణాటకకు చెందిన నందిని పాలను కొనుగోలు చేసినట్లు హాకా మేనేజింగ్ డైరెక్టర్ భాస్కరాచారి తెలిపారు. సోమవారం 'సాక్షి'లో పొరుగుపాలకు రుచెక్కువ అనే శీర్షికతో ప్రచురితమైన వార్తపై ఆయన స్పందించారు. మన రాష్ట్రానికి మాత్రమే ఆర్డర్ ఇవ్వాలని ఉన్నప్పటికీ విధిలేని పరిస్థితిలో పొరుగు పాలను కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. కరీంనగర్, నల్లగొండ, రంగారెడ్డి డెయిరీలు టెట్రా పాలని తయారు చేయడం లేదని తెలిపారు. యూహెచ్‌టీ టెట్రా పాల నిల్వ సామర్థ్యం 90 రోజుల నుంచి 180 రోజుల వరకు ఉంటుందని, ఇలాంటి పాలను విజయ డెయిరీ 2 లక్షల లీటర్ల నుంచి 3 లక్షల (టెట్రాపాక్) లీటర్ల వరకు మాత్రమే సరఫరా చేసే సామర్థ్యం ఉందన్నారు.

## కాళోజీ వర్సిటీలో పోస్టుల నోటిఫికేషన్

### ఈనెల 30 నుంచి వచ్చేనెల 20 వరకు దరఖాస్తుల స్వీకరణ

**సాక్షి, హైదరాబాద్:** కాళోజీ నారాయణరావు వరంగల్ హెల్త్ సైన్స్ యూనివర్సిటీలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ (04), స్టాటిస్టికల్ ఆఫీసర్ (01) పోస్టుల భర్తీకి టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్ జారీచేసింది. అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 30 నుంచి వచ్చేనెల 20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, అభ్యర్థుల వయసు 21 నుంచి 34 సంవత్సరాల మధ్య ఉండాలని పేర్కొంది. అసిస్టెంట్ రిజిస్ట్రార్ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు డిగ్రీలో కంప్యూటర్ ఒక సబ్జెక్టుగా ఉండి, దాంతో పాటు పీజీలో సంబంధిత స్పెషలైజేషన్‌లో సెకండ్‌గ్రేడ్‌లో పీజీ ఉత్తీర్ణులై ఉండాలని లేదా కంప్యూటర్స్‌లో పీజీ సెకండ్ క్లాస్‌లో ఉత్తీర్ణులై ఉండాలని తెలిపింది. స్టాటిస్టికల్ ఆఫీసర్ పోస్టులకు... స్టాటిస్టిక్స్‌లో పీజీ ఉండి, దాంతో పాటు తెలంగాణ/ఏపీ రాష్ట్రాల సాంకేతిక విద్యా శిక్షణ బోర్డు (ఎస్‌బీటీఈటీ) ద్వారా డిప్లొమాఇన్ కంప్యూటర్స్ ఉత్తీర్ణులై ఉండాలని టీఎస్‌పీఎస్సీ వెల్లడించింది. వివరాలకు www. tspsc. gov. in వెబ్‌సైట్‌ను సందర్శించాలని తెలిపింది.

## 30న హెల్త్ అసిస్టెంట్ ధ్రువపత్రాల పరిశీలన

**సాక్షి, హైదరాబాద్:** పురపాలక, పట్టణాభివృద్ధి శాఖలో హెల్త్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి సంబంధించి మూడో విడత సర్టిఫికెట్ల పరిశీలన ఈ నెల 30న జరగనుంది. ఈ మేరకు నాంపల్లిలోని తమ కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 గంటలకు ధ్రువపత్రాల పరిశీలన నిర్వహించనున్నట్లు టీఎస్‌పీఎస్సీ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. వివరాలకు www. tspsc. gov. in ను సందర్శించాలని సూచించింది.

# ఆర్టీసీ ప్రక్షాళన!

- డిపోల స్థాయిలో సిబ్బంది సర్దుబాటు
- అనుబంధ విభాగాల్లో అక్కర్లేనివి తొలగింపు
- దిద్దుబాటు చర్యలకు ప్రభుత్వం శ్రీకారం
- ఆర్టీసీ ఈడీలతో ఇన్‌చార్జి ఎండీ భేటీ
- సంస్థలోని సమస్యలపై నివేదిక సమర్పణకు ఆదేశం
- వచ్చే నెల్లో సరుకు రవాణా విభాగం ప్రారంభించాలని స్పష్టీకరణ

**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్ఆర్టీసీ) ప్రక్షాళనకు కసరత్తు మొదలైంది. ఎవరెక్కడ పనిచేస్తున్నారో, వారికిచ్చే వేతనానికి తగ్గ పని జరుగుతోందో లేదో, ఏ విభాగంలో ఎందరున్నారో వంటి విషయాలపై ఇప్పటివరకు లోపించిన జవాబుదారీతనాన్ని తిరిగి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఆర్టీసీ సమ్మె అనంతరం టికెట్ ధరల పెంపుతో ఇప్పటికే సంస్థ ఆదాయం పెరగ్గా మరిన్ని చర్యలతో సంస్థకు మరింత ఊపు తెప్పించనుంది. కొన్ని విభాగాల్లో సిబ్బందికి సరైన పనే లేదు. కొన్ని చోట్ల తీవ్ర పని ఒత్తిడి ఉంది. ఇప్పుడు దాదాపు 800 బస్సులను తగ్గించడం, కొత్తగా సరుకు రవాణా విభాగాన్ని ప్రారంభిస్తుండటం, త్వరలో 1,334 అద్దె బస్సులు కొత్తగా ఆర్టీసీలోకి వస్తుండటం.. వెరసి మొత్తం సంస్థను ప్రక్షాళన చేయాలని నిర్ణయించింది. దీన్ని దశలవారీగా అమలు చేయనుంది. తొలుత డిపో స్థాయిలో సిబ్బందిని సర్దుబాటు చేయడంతో ప్రారంభించి అనంతరం ఆర్టీసీలో అనుబంధంగా ఉన్న విభాగాల్లో అవసరం లేని వాటిని తొలగించనుంది.



**సిబ్బంది పంపకాలు...**

రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం ఆర్టీసీకి 97 డిపోలు ఉండగా వాటిల్లో కొన్ని డిపోలకు అవసరానికి మించి ఎక్కువ బస్సులు కేటాయించారు. దీంతో అవి నష్టాల్లో ఉన్నాయి. ఇప్పుడు దాదాపు 800 బస్సులను సంస్థ తగ్గిస్తోంది. తొలుత వెయ్యి బస్సులు అనుకున్నా ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని వాటిని 800కు తగ్గించాలని భావిస్తోంది. బస్సుల సంఖ్య తగ్గడంతోపాటు కండిషన్‌లో లేని దాదాపు మరో 400 డొక్కు బస్సులను తొలగించనుంది. అప్పుడు డిపోల్లో సిబ్బంది అవసరం కూడా తగ్గుతుంది. ఎక్కువ డిమాండ్ ఉన్న డిపోలకు ఎక్కువ బస్సులు కేటాయించి తక్కువ డిమాండ్ ఉన్న డిపోలకు తక్కువ బస్సులు ఉండేలా అధికారులు హేతుబద్ధీకరించనున్నారు. అంతగా పనిలేని సిబ్బందిని వేరే చోటకు పంపనున్నారు. మరో 15 రోజుల్లో 1,334 అద్దె బస్సులు కొత్తగా రాబోతున్నాయి. వాటి డ్రైవర్లు, మెకానిక్‌లను వాటి యజమానులే ఏర్పాటు చేసుకోవాల్సి ఉన్నందున ఆర్టీసీపై అంతమేర భారం తగ్గనుంది. గతంలో ఇలా మిగిలిపోయే సిబ్బందిని సర్దుబాటు చేయకపోవడంతో వారు పనిలేకుండా డిపోల్లో మిగిలిపోయారు. అలా ఉన్న పాత వారితోపాటు ఇప్పుడు కొత్తగా పని తగ్గే వారిని వేరే డిపోలకు సర్దుబాటు చేయనున్నారు. అప్పటికీ సిబ్బంది మిగిలితే సరుకు రవాణా విభాగం లాంటి వాటికి పంపనున్నారు.

**ప్రక్షాళన అవసరం...**

ఆర్టీసీలో ఉన్న గందరగోళాన్ని వెంటనే నివారించేందుకు వీలుగా దిద్దుబాటు చర్యలు అవసరమని ఆర్టీసీ ఇన్‌చార్జి ఎండీ సునీల్‌శర్మ అభిప్రాయపడ్డారు. మంగళవారం ఆయన సంస్థ ఈడీలతో భేటీ అయ్యారు. డిపోలవారీగా ఉన్న సిబ్బంది, వారిపై ఉన్న పని ఒత్తిడిని గుర్తించి వెంటనే హేతుబద్ధీకరించాలని ఆదేశించారు. ఇతర అనుబంధ యూనిట్ల అవసరం, వాటిని తొలగిస్తే ఎదురయ్యే సమస్యలపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి హామీల అమల్లో నిర్లక్ష్యం వద్దని సూచించారు. జనవరి మొదటి వారంలో అందుబాటులో ఉన్న వాహనాలతో సరుకు రవాణా విభాగాన్ని ప్రారంభించాల్సిందేనని స్పష్టం చేశారు.

### బస్ బాడీ యూనిట్ ఉండదా?

ప్రస్తుతం ఆర్టీసీకి సొంతంగా మియాపూర్‌లో బస్ బాడీ వర్క్‌షాప్ ఉంది. అందులోనే బస్సుల నిర్మాణం జరుగుతోంది. అయితే ఈ వర్క్‌షాప్ వల్ల ఉపయోగం కన్నా ఖర్చే ఎక్కువగా ఉంటోందని ఆర్టీసీ గుర్తించింది. దాని బదులు ప్రైవేటు కంపెనీలకు వర్క్‌షాప్ అప్పగిస్తే ఖర్చు తక్కువగా ఉంటుందని గుర్తించింది. దీంతో క్రమంగా బస్‌బాడీ వర్క్‌షాపును వదిలించుకునే ఆలోచనలో ఉంది. అలాగే హైదరాబాద్ శివార్లలోని హకీంపేట, వరంగల్‌లో ఆర్టీసీకి సొంత శిక్షణ కేంద్రాలు ఉండగా వాటి అవసరం లేదని సంస్థ భావిస్తోంది. వరంగల్‌లోని కేంద్రాన్ని మూసేస్తే ఎలా ఉంటుందన్న యోచనలో ఉంది.

## సీనియర్ మేట్లకు ఫీల్డ్ అసిస్టెంట్లుగా అవకాశం

**సాక్షి, హైదరాబాద్:** గ్రామీణ ఉపాధి హామీ క్షేత్ర సహాయకులు (ఫీల్డ్ అసిస్టెంట్లు)గా సీనియర్ మేట్లకు అవకాశం ఇవ్వాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ నిర్ణయించింది. జాబ్‌కార్డులు కలిగిన కూలీలకు ఎక్కువ పనిదినాలు కల్పించిన మేట్లను పరిగణనలోకి తీసుకోనుంది. కనిష్టంగా 25 పనిదినాలు పూర్తి చేసిన వారికి అవకాశం ఇవ్వనుంది. ఇందులోనూ అత్యధిక పనిదినాలు పూర్తిచేసిన వారికి ప్రాధాన్యతనిస్తారు. ఒకవేళ మేట్లు అందుబాటులో లేకపోతే, క్లస్టర్ పరిధిలో ఎక్కువ పనిచేసిన 50 మంది కూలీల జాబితాను తయారు చేయాలని, ఇందులో కనీసం 25 రోజులు పనిచేసిన అనుభవం ఉండాలని స్పష్టం చేసింది. ఈ నిబంధనలకు అర్హులైన వారిని ఫీల్డ్ అసిస్టెంట్లుగా నియమించనున్నట్లు పేర్కొంది.

**ఉపాధి చూపనివారికి ఉద్వాసన**

ఇదిలావుండగా, యాక్టివ్ జాబ్‌కార్డులు కలిగియున్న కూలీలకు పనిచూపని క్షేత్ర సహాయకులపై వేటు వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కనిష్టంగా 10 రోజులలోపు కూడా పని దినాలు కల్పించని వారికి ఉద్వాసన పలకనుంది. 2018 జూలై 1 నుంచి గత జూన్ 30వ తేదీ వరకు పనితీరును మదింపు చేస్తున్న పీఆర్‌శాఖ, విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించేవారిని సాగనంపాలని నిర్ణయించింది. సగటున 40 రోజులపైన పనిదినాలు చూపిన కాంట్రాక్టును కొనసాగిస్తామని, 10–39 పనిదినాలు కల్పిస్తే పనితీరులో వెనుకబడ్డవారీగా పరిగణించి వేతనంలో కోత పెట్టనున్నట్లు ప్రకటించింది. వీరిని సీనియర్ మేట్లుగా హోదా తగ్గించనుంది.

## అత్యాచారాల్ని కులంతో ముడిపెట్టొద్దు

- 'దిశ'కో న్యాయం... ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళలకో న్యాయమా..?
- మహాదీక్షలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

**హైదరాబాద్:** మహిళలపై జరిగే అత్యాచారాలు, హత్యలను కులంకోణంతో చూడొద్దని, కేవలం మానవ దృక్పథంతోనే చూడాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పేర్కొన్నారు. మహిళలపై అత్యాచారాలు, హత్యలు జరిగినప్పుడు కులమతాలతో సంబంధం లేకుండా బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని గొంతెత్తుతున్న చరిత్ర తమదని ఆయన స్పష్టం చేశారు. దిశ ఘటనకు మూడ్రోజుల ముందు మూడు ఘటనలు జరిగినప్పటికీ వాటిపై చర్యలు చేపట్టకుండా దిశ ఘటనపై మాత్రమే ఓ సామాజికవర్గం ఒత్తిడికి ప్రభుత్వం తలొగ్గిందని, అందుకే పోలీసులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన నిందితులను ఎన్‌కౌంటర్ చేశారని ఆయన ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టిన చలో ఇందిరాపార్క్ మహాదీక్షకు వివిధ కుల, ప్రజా, విద్యార్థి సంఘాలు హాజరయ్యాయి. ఈ సందర్భంగా మందకృష్ణ మాట్లాడుతూ.. దేశాన్ని కుదిపేసిన గాంధీ, ఇందిరా, రాజీవ్ గాంధీలను హత్యచేసిన నిందితులను చట్టపరంగానే శిక్షించారే తప్ప ఎన్‌కౌంటర్ చేయలేదని గుర్తుచేశారు. ఉగ్రవాది కసబ్ సజీవంగా దొరికినా కాల్చి చంపలేదెందుకని ప్రశ్నించారు. దేశంలో 15 ఏళ్లలో 3 లక్షల 41 వేలమంది మహిళలపై అత్యాచారాలు జరిగితే అప్పుడు లేని ఎన్‌కౌంటర్‌లు దిశా నిందితుల విషయంలో మాత్రమే ఎందుకని ఆయన ప్రశ్నించారు. ఒకే సామాజికవర్గానికి చెందిన ప్రజాప్రతినిధులు దిశ ఘటనలో ఉత్తమ్ కుమార్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు కానీ అంతకుముందు జరిగిన టేకు లక్ష్మి, మానస కుటుంబాలను ఎందుకు పరామర్శించలేదని ప్రశ్నించారు.

**త్వరలో చలో హైదరాబాద్:** నెలరోజుల పాటు 119 నియోజకవర్గాల్లో అత్యాచార ఘటనలపై జరుగుతున్న వివక్ష న్యాయాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లి చైతన్యపరచాలన్నారు. దీనిపై త్వరలోనే 'చలో హైదరాబాద్'కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జేబీ రాజు అధ్యక్షతన జరిగిన మహాదీక్షలో ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, గుజ్జ కృష్ణ, దాసు సురేశ్, ప్రొఫెసర్ గాలి వినోద్, చెన్నయ్య పాల్గొన్నారు.



తెలంగాణ సంస్కృతి ఇతివృత్తంగా తయారైన శకటం నమూనా

## గణతంత్ర పరేడ్‌కు తెలంగాణ శకటం ఎంపిక

### అధికారికంగా వెల్లడించిన రక్షణ మంత్రిత్వ శాఖ

**సాక్షి, న్యూఢిల్లీ:** వచ్చే ఏడాది ఢిల్లీలో జరిగే గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో పాల్గొనడానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ శకటాలను ఎంపిక చేసింది. ఈమేరకు రక్షణ మంత్రిత్వ శాఖ మంగళవారం అధికారికంగా వెల్లడించింది. రాష్ట్రపతిభవన్ వద్దనున్న రాయ్‌సీనా హిల్స్ నుంచి మొదలై రాజ్‌పథ్, ఇండియాగేట్ మీదుగా ఎర్రకోట వరకు జరిగే పరేడ్‌లో ఈ శకటాలు పాల్గొంటాయి. ఈ శకటాలన్నీ ఆయా రాష్ట్రాల సాంస్కృతిక, చారిత్రక, కళావైభవాన్ని ప్రదర్శించేలా ఉంటాయి. తెలంగాణ శకటాన్ని ఆ రాష్ట్ర సంస్కృతికి ప్రతీకలైన బతుకమ్మ, మేడారం సమ్మక్క సారక్క జాతర, వేయిస్తంభాల గుడి ఇతివృత్తంతో రూపొందిస్తారు.

**ఆంధ్రప్రదేశ్ శకటం కూడా...**

ఆంధ్రప్రదేశ్ శకటాన్ని కూచిపూడి నృత్యం, కొండపల్లి అంబారీ, దశావతారాల బొమ్మలు, కలంకారీ హస్తకళలతో తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల వైభవం ప్రతిబింబించేలా రూపొందిస్తారు. తెలుగు రాష్ట్రాలతో పాటు అస్సాం, ఛత్తీస్‌గఢ్, గోవా, హిమాచల్‌ప్రదేశ్, జమ్మూ కశ్మీర్, కర్ణాటక, మధ్యప్రదేశ్, మేఘాలయ, ఒడిశా, పంజాబ్, రాజస్తాన్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల శకటాలను రక్షణ శాఖ ఎంపిక చేసింది. ఈ శకటాల తయారీ ఢిల్లీలో రాష్ట్రీయ రంగస్థల శిబిరంలో జరుగుతుంది. జనవరి 19 వరకు వీటిని రూపొందిస్తారు. జనవరి 23న పరేడ్ ఫుల్‌డ్రెస్ రిహార్సల్ తర్వాత ఇవి పరేడ్‌లో పాల్గొంటాయి.

## కొత్త సీఎస్ ఎవరు?

▶ మొదటి పేజీ తరువాయి

అధికారులు రాజీవ్ రంజన్ మిశ్రా, వసుధా మిశ్రా, 1988 బ్యాచ్ అధికారులు శాలిని మిశ్రా, అధర్ సిన్హా, 1989 బ్యాచ్ అధికారులు సోమేశ్‌కుమార్, శాంతికుమారి ఉన్నారు. వీరిలో బీపీ ఆచార్య, సురేశ్ చందా, రాజేశ్వర్ తివారి సమర్థులైన అధికారులుగా పేరున్నా, ప్రభుత్వంతో ఉన్న సంబంధాల రీత్యా సీఎస్ రేసులో వీరి పేర్లు వినిపించడం లేదు. బినయ్‌కుమార్, పుష్పాసుబ్రమణ్యం, హీరాలాల్ సమారియా, రాజీవ్ రంజన్, వసుధ మిశ్రాలు కేంద్ర సర్వీసుల్లో ఉన్నారు. ఇక మిగిలిన వారిలో అజయ్‌మిశ్రా, సోమేశ్‌కుమార్ వైపే ప్రభుత్వం మొగ్గు చూపే అవకాశాలున్నట్టు చర్చ జరుగుతోంది. అయితే అజయ్ మిశ్రా 2020 జూన్‌లో ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఆయనకు సీఎస్‌గా అవకాశం కల్పిస్తే ఆరు నెలలు ఆ పదవిలో కొనసాగుతారు. సోమేశ్ కుమార్ 2023 డిసెంబర్ నెలాఖరులో ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఆయనకు అవకాశం కల్పిస్తే నాలుగేళ్ల పాటు సీఎస్ పదవిలో కొనసాగనున్నారు. మళ్లీ అసెంబ్లీ ఎన్నికల వరకు సీఎస్‌గా ఒకే అధికారిని కొనసాగించాలని ముఖ్యమంత్రి భావిస్తే సోమేశ్‌కుమార్‌కు సీఎస్ పదవి వరించే అవకాశాలున్నాయి. అజయ్ మిశ్రా రిటైరైన తర్వాత సోమేశ్‌కు అవకాశం కల్పించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు చర్చ జరుగుతోంది.

# మేలో 'సెట్'ల పండుగ

▶ మొదటి పేజీ తరువాయి

ప్రారంభించేలా చర్యలు చేపడతామని వివరించారు. ఆయా కోర్సుల్లో విద్యార్థులు చేరేందుకు అవసరమైన ఇంటర్మీడియట్ ఫలితాలు సకాలంలోనే వస్తుండగా, డిగ్రీ కోర్సుల పరీక్షలను వీలైనంత త్వరగా నిర్వహించి, ఫలితాలు వెల్లడించేలా చర్యలు చేపట్టాలని యూనివర్సిటీలకు లేఖలు రాస్తామని వివరించారు. గతంలో న్యాయ విద్య కోర్సుల్లో ప్రవేశాలు (లాసెట్ ద్వారా) ఆలస్యం కాగా, న్యాయ విద్య కాలేజీలకు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మూడేళ్లకు అనుబంధ గుర్తింపు నేపథ్యంలో ఈసారి వాటిని కూడా సకాలంలోనే నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

**అభ్యర్థులను బట్టి సెషన్స్**

ప్రవేశ పరీక్షలకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల సంఖ్యను బట్టి సెషన్ల సంఖ్య ఉంటుందని పాపిరెడ్డి తెలిపారు. ప్రతిరోజు ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో పరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తామన్నారు. ఇంజనీరింగ్ ఎంసెట్‌ను 5 సెషన్లలో నిర్వహిస్తామని, ఒక్కో సెషన్‌లో 50 వేల మందికి పరీక్ష రాసేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. గతేడాది ఇంజనీరింగ్ ఎంసెట్‌కు 1,42,210 మంది దరఖాస్తు చేసుకున్నారని, దాన్ని బట్టి ఈసారి 1.5 లక్షల్లోపు దరఖాస్తులు వస్తే 6 సెషన్లలో ఇంజనీరింగ్ ఎంసెట్ నిర్వహిస్తామని చెప్పారు. అగ్రికల్చర్ కోర్సుల్లో ప్రవేశాల కోసం మే 9, 11 తేదీల్లో అగ్రికల్చర్ ఎంసెట్‌ను అభ్యర్థుల సంఖ్యను బట్టి 3 లేదా 4 సెషన్లలో నిర్వహిస్తామన్నారు. ఎడ్‌సెట్‌కు దరఖాస్తులు 50 వేలు దాటితే 23తోపాటు 24న కూడా నిర్వహిస్తామని చెప్పారు. గతేడాది ఈ సెట్స్ నిర్వహించిన యూనివర్సిటీలకే ఈసారి కూడా బాధ్యతలు అప్పగించినట్లు పేర్కొన్నారు. సెట్స్ కన్వీనర్లను త్వరలోనే నియమిస్తామన్నారు.

### 2020 మేలో నిర్వహించే సెట్స్ తేదీలు

| తేదీ | సెట్ | నిర్వహణ యూనివర్సిటీ |
|---|---|---|
| 2 | ఈసెట్ | జేఎన్టీయూ(హెచ్) |
| 5 ,6, 7 | ఎంసెట్ | జేఎన్టీయూ(హెచ్)(ఇంజనీరింగ్) |
| 9, 11 | ఎంసెట్ | జేఎన్టీయూ(హెచ్) (అగ్రికల్చర్) |
| 13 నుంచి | పీఈసెట్ | మహాత్మాగాంధీ యూనివర్సిటీ |
| 20, 21 | ఐసెట్ | కాకతీయ యూనివర్సిటీ |
| 23 | ఎడ్‌సెట్ | ఉస్మానియా యూనివర్సిటీ |
| 25 | లాసెట్ | ఉస్మానియా యూనివర్సిటీ |
| 25 | పీజీ లాసెట్ | ఉస్మానియా యూనివర్సిటీ |
| 27-30 | పీజీఈసెట్ | ఉస్మానియా యూనివర్సిటీ |

**నిమిషం నిబంధన యథాతథం..**

ఎంసెట్ తదితర సెట్స్ నిర్వహణలో నిమిషం నిబంధన యథావిధిగా ఉంటుందని ఉన్నత విద్యామండలి చైర్మన్ పాపిరెడ్డి చెప్పారు. ఎంసెట్ అనేది విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన పరీక్ష కాబట్టి విద్యార్థులు పరీక్ష సమయం కంటే గంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. వికలాంగులకు పరీక్ష ఫీజు తగ్గింపు అంశాన్ని ఆయా సెట్స్ కమిటీ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. మార్చిలో సెట్స్ నోటిఫికేషన్స్ విడుదల చేస్తామని తెలిపారు.

**ఈసారి నేషనల్ పూల్ లేదు..**

ఇంజనీరింగ్‌లో ప్రవేశాలను జాతీయ స్థాయి పరీక్ష ద్వారానే చేపట్టాలన్న నిబంధన ఈసారి లేదన్నారు. రాష్ట్ర సెట్స్ ద్వారానే ప్రవేశాలు చేపడతామన్నారు. ఒకవేళ కేంద్రం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నిర్వహించే జేఈఈ మెయిన్ ద్వారానే అన్ని రాష్ట్రాల్లో ప్రవేశాలు చేపట్టాలని తప్పనిసరి చేస్తే దాన్ని అమలు చేస్తామన్నారు. అయితే ఏడాది ముందుగానే ఆ విషయం తెలియజేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

**చట్ట సవరణతోనే విదేశీ వర్సిటీలు**

ప్రస్తుతం ఉన్న పార్లమెంటు చట్టం ప్రకారం విదేశీ యూనివర్సిటీలు దేశంలో యూనివర్సిటీ లేదా ఆఫ్ క్యాంపస్ ఏర్పాటు చేయడానికి వీల్లేదన్నారు. ప్రస్తుతం కేంద్రం తెస్తున్న నూతన విద్యా విధానంలో ఆ అంశంపై చర్చిస్తోందని, అందులో ఓకే చెబితే విదేశీ యూనివర్సిటీలు వచ్చే అవకాశం ఉందన్నారు.

# ...నేషనల్ ఎంట్రన్స్‌లు

▶ మొదటి పేజీ తరువాయి

మేనేజ్‌మెంట్ విద్యా సంస్థల్లో ప్రవేశాల కోసం కామన్ మేనేజ్‌మెంట్ అడ్మిషన్ టెస్టు (సీమ్యాట్)ను వచ్చే ఏడాది జనవరి 28న నిర్వహించేందుకు ఏఐసీటీఈ చర్యలు చేపట్టింది. అదేరోజు జాతీయ స్థాయి ఫార్మసీ విద్యాసంస్థల్లో ఎంఫార్మసీ ప్రవేశాల కోసం జీప్యాట్ నిర్వహించేందుకు ఎన్‌టీఏ ఏర్పాట్లు చేస్తోంది. మరోవైపు జేఈఈ మెయిన్ రెండో విడత పరీక్షలను ఏప్రిల్ 3 నుంచి 9 వరకు ఆన్‌లైన్‌లో నిర్వహించేందుకు ఎన్‌టీఏ చర్యలు చేపట్టింది. వీటితోపాటు ఇతర రాష్ట్రాల్లో ప్రముఖ ప్రైవేటు విద్యా సంస్థలు కూడా ప్రవేశాలకు ఎంట్రన్స్ టెస్టుల నిర్వహణకు షెడ్యూలు జారీ చేశాయి.

### ఇవీ జాతీయ, ఇతర రాష్ట్రాల ప్రవేశ పరీక్షలు..

| పరీక్ష తేదీ | సెట్/ పరీక్ష |
|---|---|
| 06-01-2020 నుంచి 11-1-2020 వరకు | జేఈఈ మెయిన్ (మొదటి విడత) |
| 28-01-2020 | సీమాట్-2020 |
| 28-01-2020 | జీప్యాట్ - 2020 |
| 03-04-2020 నుంచి 09-04-2020 వరకు | జేఈఈ మెయిన్ (రెండో విడత) జేఈఈ ఆధారంగా ఇండియన్ స్కూల్ ఆఫ్ మైన్స్, దన్‌బాద్ (www.ismdanbad.ac.in) |
| 12 ఏప్రిల్ నుంచి 20 వరకు | ఎస్ఆర్ఎంఈఈ (ఎస్ఆర్ఎం యూనివర్సిటీ) |
| 13 ఏప్రిల్ నుంచి 19 వరకు | వీఐటీఈఈఈ (వెల్లూర్ ఇన్‌స్టిట్యూట్) |
| 25-04-2020 | ఎన్‌సీహెచ్ఎంసీటీ జేఈఈ-2020 (హోటల్ మేనేజ్‌మెంట్) |
| 29, 30 ఏప్రిల్-2020 | కేసెట్ (కర్ణాటక) |
| ఏప్రిల్ మూడో వారంలో | ఒడిశా జేఈఈ (ఓజేఈఈ-2020) |
| 20, 21- ఏప్రిల్-2020 | కేఈఏఎం-2020 (కేరళ) |
| 3 మే | నీట్ |
| 3 మే | ఆలిండియా లా ఎంట్రన్స్ టెస్టు (ఏఐఎల్ఈటీ) |
| 10-5-2020 | క్లాట్ (ఆలిండియా లా) నీట్ ఆధారంగా వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీవీఎస్‌సీ, ఏహెచ్ కోర్సులు) |
| 10-05-2020 | ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ (కోల్‌కతా) ఎంట్రన్స్ |
| 17-05-2020 | జేఈఈ అడ్వాన్స్‌డ్ |
| 17-05-2020 | ఐఐఎస్‌టీ (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్) |
| 31-05-2020 | యూపీఎస్సీ ప్రిలిమ్స్ |

## జాబితా లేకుండా నోటిఫికేషనా?: జగ్గారెడ్డి



సాక్షి, హైదరాబాద్ : ఓటర్ల జాబితా ప్రకటించకుండా మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ ఎలా ఇస్తారని కాంగ్రెస్ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ప్రశ్నించారు. ఎన్నికల కమిషన్ షెడ్యూల్ జారీ చేయడానికి ముందే టీఆర్ఎస్ కార్యకర్తల ఫేస్ బుక్ ఖాతాలోకి అది ఎలా వచ్చిందని ఆయన నిలదీశారు. గాంధీభవన్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ నాగిరెడ్డి ఎన్నికల అధికారా లేక టీఆర్ఎస్ కార్యకర్తా అని ప్రశ్నించారు. నాగిరెడ్డిపై కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయాలని పీసీసీని కోరుతానన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే నాగిరెడ్డి మాదిరిగా వ్యవహరించే అధికారులు మూల్యం చెల్లించుకుంటారని హెచ్చరించారు. ఈ ఎన్నికల్లో టీఆర్ఎస్ నాయకులు గెలిస్తే సీఎం దగ్గర గులాంగిరీ చేస్తారని, అందువల్ల ప్రజల తరఫున పోరాడే కాంగ్రెస్ నాయకులను మున్సిపల్ చైర్మన్‌లుగా గెలిపించుకోవాలని కోరారు.

* * *

## హైకోర్టుకు చెప్పిందేమిటి చేసిందేమిటి ?



పొన్నం ప్రభాకర్

సాక్షి, హైదరాబాద్: హైకోర్టుకు రాష్ట్ర ఎన్నికల సంఘం చెప్పిందేమిటి చేస్తున్నదేమిటని కమిషనర్ వి.నాగిరెడ్డిని ప్రశ్నిస్తున్నామని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పొన్నం ప్రభాకర్ అన్నారు. మున్సిపల్ ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ భయపడదని, కోర్టులకు వెళ్లి ఎన్నికలను ఆపే దౌర్భాగ్య స్థితిలో పార్టీ లేదన్నారు. గాంధీ భవన్‌లో మంగళవారం టీపీసీసీ మున్సిపల్ ఎన్నికల కమిటీ సమావేశమైంది. అనంతరం పార్టీనేతలు సంపత్ కుమార్, గూడూరు నారాయణరెడ్డి, జి. నిరంజన్, వంశీచందర్‌రెడ్డిలతో కలసి పొన్నం మీడియాతో మాట్లాడారు. నిబంధనల మేరకు నోటిఫికేషన్ ఇవ్వాలన్నదే కాంగ్రెస్ విధానమని స్పష్టంచేశారు. ప్రభుత్వమే చట్టాన్ని అతిక్రమించి వార్డుల విభజన చేసిందన్నారు. ఐదేళ్లలో బీజేపీ తెలంగాణ కోసం ఏం చేసిందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వార్డుల విభజన, రిజర్వేషన్లు పూర్తి అయ్యాకే ఎన్నికల షెడ్యూల్ ఇవ్వాలని కోర్టు చెప్పినా ఎన్నికల కమిషన్ ఇవేమీ చేయకుండానే షెడ్యూల్ ఇచ్చి హైకోర్టు ఆదేశాలను ఉల్లంఘించిందని సంపత్ విమర్శించారు.

* * *

## టీఆర్ఎస్‌కు ఓట్లడిగే హక్కు లేదు: శ్రవణ్



సాక్షి, హైదరాబాద్: మున్సిపల్ ఎన్నికల్లో ఓట్లు అడిగే హక్కు టీఆర్ఎస్‌కు లేదని ఏఐసీసీ అధికార ప్రతినిధి దాసోజు శ్రవణ్ విమర్శించారు. మంగళవారం గాంధీ భవన్‌లో ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ శాఖకు కేటాయింపులు రూ. వేల కోట్లు దాటాయని, మంజూరు మాత్రం రూ. వందల కోట్లు కూడా లేవని మండిపడ్డారు. టీఆర్ఎస్ బెల్లం లేని బూరెలు చేస్తోందని, నిధులు ఇవ్వకుండా మాటల గారడీ చేస్తోందని దుయ్యబట్టారు. టీఆర్ఎస్–బీజేపీ రెండు సర్కార్‌లు నిధులు విడుదల చేయడం లేదని విమర్శించారు. స్మార్ట్ సిటీలు అని చెప్పిన బీజేపీ.. వరంగల్‌కు నిధులు ఇవ్వలేదని దుయ్యబట్టారు. పురపాలక ఎన్నికల్లో ప్రజలు విజ్ఞతతో ఆలోచించి ఓటేయాలని కోరారు.

* * *

## తక్షణమే 'టెట్' నిర్వహించండి: టి.జీవన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయ పోస్టుల నియామక అర్హత పరీక్ష (టెట్)ను నిర్వహించేందుకు వెంటనే అవసరమైన చర్యలు తీసుకోవాలని సీఎం కేసీఆర్‌కు కాంగ్రెస్ ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కేసీఆర్‌కు ఆయన ఓ లేఖ రాశారు. వచ్చే విద్యా సంవత్సరంలోపు ప్రభుత్వ స్కూళ్లలోని ఖాళీలతోపాటు గురుకుల ఆశ్రమ పాఠశాలల్లో నియామకాలు చేపట్టాలని లేఖలో జీవన్‌రెడ్డి కోరారు. ప్రైవేట్ స్కూళ్లలో ఉపాధి పొందేందుకు టెట్ పరీక్ష అవసరమైనందున ఈ విషయంలో తగిన చర్యలు చేపట్టాలని ఆయన పేర్కొన్నారు. శాసన మండలి సమావేశాల సందర్భంగా ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించి టెట్ పరీక్ష నిర్వహణ ఆవశ్యకతను సర్కార్ దృష్టికి తాను తీసుకెళ్లినట్టు గుర్తు చేశారు.

* * *

## వారిని దగ్గరకు రానీయొద్దు: శ్రీనివాస్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఉద్యమం, రాష్ట్ర పునర్నిర్మాణంలో ఉద్యోగులు ఎంతో కృషి చేశారని అబ్కారీ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో భాగ్యనగర్ టీఎన్జీవో అసోసియేషన్, గచ్చిబౌలి హౌసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంత్రి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు త్వరలోనే పరిష్కారం అవుతాయని, సీఎం కేసీఆర్ ఎప్పుడూ ఉద్యోగులకు అండగా ఉంటారన్నారు. గచ్చిబౌలి హౌసింగ్ సొసైటీలోని సభ్యులందరికీ ఇళ్ల స్థలాలు వస్తాయన్నారు. ఏపీ ఎన్జీవో ఉద్యోగుల కుట్రతో కోట్ల రూపాయలు నష్టపోయామని ఆరోపించారు. రాజకీయం ముసుగులో ఉద్యోగ సంఘాల నేతలను బద్నాం చేసే రీతిలో కొందరు వదంతులు సృష్టిస్తున్నారన్నారు. ప్రభుత్వంపై బురద జల్లే వారిని దగ్గరకు రానీయొద్దని సూచించారు. కార్యక్రమంలో బేవరేజ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్, టీఎన్జీవో అధ్యక్షురాలు మమత, టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మామిళ్ల రాజేందర్, భాగ్యనగర్ టీఎన్జీవో అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్, ప్రధాన కార్యదర్శి మల్లారెడ్డి, ఉద్యోగ సంఘాల నేతలు పాల్గొన్నారు.

* * *

## పురపోరుకు పోలీసు సిద్ధం!

### ఎస్పీలు, కమిషనర్లతో మాట్లాడిన డీజీపీ

సాక్షి, హైదరాబాద్: మున్సిపల్ ఎన్నికలకు పోలీసులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో 120 మున్సిపాలిటీలు, 10 కార్పొరేషన్లకు ఎన్నికల నగారా మోగిన నేపథ్యంలో మంగళవారం డీజీపీ మహేందర్‌రెడ్డి అన్ని జిల్లాల్లో ఎస్పీలు, కమిషనర్లతో మాట్లాడారు. సున్నిత, సమస్యాత్మక ప్రాంతాల్లో నిఘా పెంచాలని సూచించారని సమాచారం. అలాగే అవలంబించాల్సిన కార్యాచరణ, బందోబస్తు తదితర విషయాలపైనా చర్చించారు. నాలుగు కార్పొరేషన్లలో అత్యంత సమస్యాత్మక ప్రాంతాల్లో అవసరమైతే అదనపు బలగాలు తరలింపునకు డీజీపీ అనుమతించారు. డబ్బు సరఫరా, మద్యం విక్రయాలు, బైండోవర్లు, లైసెన్స్‌డ్ తుపాకుల డిపాజిట్ తదితర విషయాల్లో కఠినంగా వ్యవహరించాలని స్పష్టంచేశారు. సివిల్ పోలీసులతోపాటు, ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ (ఏఆర్), తెలంగాణ స్టేట్ స్పెషల్ పోలీస్ (టీఎస్ఎస్పీ)లను కూడా వినియోగించనున్నారు.

* * *

## 29న మర్రి చెన్నారెడ్డి శతజయంతి వేడుకలు



మర్రి చెన్నారెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఈ నెల 29న హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో మర్రి చెన్నారెడ్డి శతజయంతి వేడుకలను నిర్వహించనున్నారు. ఈ వేడుకల్లో ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, తెలంగాణ, హిమాచల్‌ప్రదేశ్‌ల గవర్నర్లు, ఇతర ప్రముఖులు పాల్గొంటారని మర్రి శశిధర్‌రెడ్డి తెలిపారు. చెన్నారెడ్డి నేషనల్ అవార్డ్ ఫర్ సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ అవార్డులను ఏటా అందజేస్తున్నట్లు తెలిపారు. శజజయంతి వేడుకలు పురస్కరించుకుని మంగళవారం ఫతే మైదాన్ క్లబ్‌లో జరిగిన మీడియా సమావేశంలో మాజీ గవర్నర్ కె.రోశయ్య మాట్లాడుతూ మహా మేధావి చెన్నారెడ్డితో కలిసి పనిచేసే అవకాశం తనకు దక్కిందని, ఆయనతో పనిచేసిన సమయంలో నిత్యం యుద్ధానికి వెళ్లినట్లే ఉండేదని గుర్తుచేసుకున్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర అవసరాన్ని మొదటగా గుర్తించిన నాయకుడు చెన్నారెడ్డి అని, గొప్ప పాలనాదక్షుడైన ఆయన్ను ఈతరం నాయకులు ఆదర్శంగా తీసుకోవాలని మాజీ పీసీసీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య అన్నారు. చెన్నారెడ్డి కారణ జన్ముడని, నక్సలైట్లపై నిషేధం ఎత్తేసి జనజీవన స్రవంతిలో కలిపారని మాజీ మంత్రి జె.గీతారెడ్డి తెలిపారు. చెన్నారెడ్డి వల్లనే సినిమా పరిశ్రమ హైదరాబాద్ వచ్చిందని, సినిమా ఇండస్ట్రీ ఆయన పేరుమీద కార్యక్రమం నిర్వహించాలని సీనియర్ నేత వీహెచ్ అన్నారు.





## జలగాటం!

జానెడు పొట్ట కోసం చేస్తున్న బతుకు పోరాటం.. ప్రాణాలను పణంగా పెట్టి చేస్తున్న సాహసం.. ప్రమాదం అని తెలిసినా ప్రాణాలతో చెలగాటం. ములుగు జిల్లా ఎస్ఎస్.తాడ్వాయి మండలంలోని మేడారం జంపన్న వాగులో మంగళవారం ఒళ్లు జలదరించేలా కనిపించిన దృశ్యాలివి. మహాజాతరలో భాగంగా జంపన్న వాగులో 45 ఇన్‌ఫిల్టరేషన్ బావుల్లో పూడిక తీసే పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఒక్కో బావిలో ముగ్గురు నుంచి నలుగురు కార్మికులు పూడిక తీస్తున్నారు. బావి 15 నుంచి 20 ఫీట్ల లోతు ఉండగా.. 10 నుంచి 15 కిలోల చొప్పున ఇసుకను బుట్టలో ఎత్తి పైకి పంపిస్తున్నారు. ఇందు కోసం 10 నిమిషాల పాటు నీట మునిగి ఊపిరి బిగ పట్టాల్సి ఉంటుంది. రోజుకు ఎనిమిది గంటల పాటు నీట మునుగుతూ కార్మికులు పడుతున్న శ్రమను చూసి అక్కడున్న వారు చలించిపోతున్నారు.

\- ఎస్.ఎస్. తాడ్వాయి

# ప్రైవేటు వర్సిటీల్లో రిలయన్స్ లేనట్టే?

**ముంబైలో ఏర్పాటు చేసినందున తెలంగాణకు కష్టం**

- టెక్ మహీంద్ర మినహా ముందుకు రాని పారిశ్రామిక సంస్థలు
- రాష్ట్రంలో ఏడెనిమిది ప్రైవేటు వర్సిటీలు ఏర్పాటయ్యే అవకాశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రిలయన్స్ ప్రైవేటు యూనివర్సిటీ ఏర్పాటు ఇక లేనట్టేనని ఉన్నత విద్యా శాఖ వర్గాలు భావిస్తున్నాయి. 2015లో రిలయన్స్ సంస్థ ఆసక్తితోనే రాష్ట్రంలో ప్రైవేటు యూనివర్సిటీల ఏర్పాటు అంశానికి బీజం పడింది. అప్పట్లోనే తాము తెలంగాణలో ప్రైవేటు వర్సిటీని ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా, కార్యాచరణ ఆలస్యం కావడంతో ఆ సంస్థ ముంబైలో తమ యూనివర్సిటీని ఏర్పాటు చేసుకుంది. దీంతో తెలంగాణలో రిలయన్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసే అంశం మరుగున పడింది. మరోవైపు హోండా వంటి కంపెనీలు కూడా వర్సిటీ ఏర్పాటుకు ఆసక్తిని ప్రదర్శించినా ఇప్పుడు ముందుకు రావడం లేదు. ఒక్క టెక్ మహీంద్ర మినహా పారిశ్రామిక రంగం వైపు నుంచి రాష్ట్రంలో ప్రైవేటు యూనివర్సిటీల ఏర్పాటుకు సంస్థలు ముందుకు రావడం లేదు.

**అన్నీ విద్యా సంస్థలే..**

జాతీయ స్థాయి విద్యా సంస్థలతోపాటు రాష్ట్రంలోని విద్యా సంస్థలు ప్రైవేటు వర్సిటీల ఏర్పాటుకు ముందుకొచ్చాయి. దీంతో ఇప్పటివరకు యూనివర్సిటీల ఏర్పాటుకు 12 సంస్థలు ముందుకు రాగా వాటిల్లో ఏడెనిమిది యూనివర్సిటీలు ఏర్పాటయ్యే అవకాశం ఉందని ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ పాపిరెడ్డి పేర్కొన్నారు. యూనివర్సిటీల ఏర్పాటు కమిటీ 10 వర్సిటీలకు సంబంధించిన స్థలాలు, భవనాలు, మౌలిక సదుపాయాలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదికను కూడా పంపించింది. త్వరలో మరో 2 యూనివర్సిటీలు సంబంధించిన నివేదికలను ప్రభుత్వానికి పంపించేందుకు సిద్ధమైంది. ఇప్పటివరకు యూనివర్సిటీల ఏర్పాటుకు ముందుకు వచ్చిన వాటిల్లో ర్యాడిక్లిఫ్, శ్రీనిధి, అమిటీ, మల్లారెడ్డి (మహిళా యూనివర్సిటీ), వాగ్దేవి, నిక్‌మర్ వంటి సంస్థలు కొత్త యూనివర్సిటీలను (గ్రీన్ ఫీల్డ్) ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చాయి. ఇక ఎంఎన్ఆర్ (హెల్త్ యూనివర్సిటీ), టెక్ మహీంద్ర(మహీంద్ర ఏకోల్), వోక్సన్, అనురాగ్, గురునానక్, ఎస్ఆర్ వంటివి తమ పాత విద్యా సంస్థలనే వర్సిటీలుగా మార్చు చేసేందుకు (బ్రౌన్ ఫీల్డ్) ముందుకు వచ్చాయి.

**పాత విద్యా సంస్థల్లో పాత ఫీజులే..**

రాష్ట్రంలో తమకు ఉన్న విద్యా సంస్థలను యూనివర్సిటీలుగా మార్పు చేసేందుకు ముందుకు వచ్చిన విద్యా సంస్థల్లో ప్రస్తుతం ఉన్న ఫీజులను కొనసాగించాల్సి ఉంటుందని మండలి చైర్మన్ పాపిరెడ్డి పేర్కొన్నారు. ప్రైవేటు యూనివర్సిటీల చట్టంలో పేర్కొన్న ప్రకారం కాలేజీ నుంచి యూనివర్సిటీగా మారే విద్యా సంస్థల్లో ఇప్పుడున్న సీట్లలో రాష్ట్ర ప్రవేశాలు, ఫీజుల నియంత్రణ కమిటీ (ఏఎఫ్ఆర్సీ) ఖరారు చేసిన ఫీజులే అమలు చేయాల్సి ఉంటుందని, ఆయా సీట్ల భర్తీలో రిజర్వేషన్లను యథావిధిగా అమలు చేయాల్సి ఉంటుందని వెల్లడించారు. ఆయా యూనివర్సిటీలు అదనంగా ఇన్‌టేక్ పెంచుకుంటే కనుక ఆయా సీట్లలో యాజమాన్యాల ఇష్టానుసారమే ప్రవేశాలు ఉంటాయని వివరించారు. వర్సిటీల సంఖ్య విషయంలో ఎలాంటి సీలింగ్ లేదని, నిబంధనల ప్రకారం ఉంటే ప్రభుత్వం నుంచి అనుమతి వస్తుందన్నారు. ప్రత్యేక లా యూనివర్సిటీ ఏర్పాటుకు దరఖాస్తులు రాలేదన్నారు. యాజమాన్యాల బ్రాండ్ ఆధారంగానే వాటి మనుగడ ఉంటుందన్నారు.



# మున్సిపల్ ఉద్యోగులకు సెలవుల్లేవు

**పురపాలక శాఖకు ఎస్ఈసీ ఆదేశం**

- సెలవుల్లో ఉన్నవారిని వెనక్కి పిలిపించాలని సూచన
- ఒకట్రెండు రోజుల్లో టీ–పోల్ యాప్
- అమల్లోకి ఎన్నికల ప్రవర్తనా నియమావళి
- ఎన్నికలకు సన్నద్ధతపై ఎన్నికల కమిషనర్ వి.నాగిరెడ్డి సమీక్ష

సాక్షి, హైదరాబాద్: పురపోరు ముగిసేవరకు మున్సిపల్ ఉద్యోగులకు సెలవుల్లేవని, ఇప్పటికే సెలవులో వెళ్తే తక్షణమే వెనక్కి పిలిపించాలని పురపాలక శాఖను రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఈసీ) ఆదేశించింది. సగటున ఒక్కో పోలింగ్‌స్టేషన్‌లో 800 ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని, ఆ పరిధి దాటితే కచ్చితంగా రెండో పోలింగ్ బూత్ ఏర్పాటు చేయాలని పేర్కొంది. అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ స్టేషన్లనే పుర పాలక సంస్థల ఎన్నికలకూ వినియోగించుకోవాలని స్పష్టం చేసింది. ఇద్దరు పిల్లలకు మించి సంతానం ఉంటే పోటీకి అనర్హులన్న నిబంధన ఇప్పుడు లేదని స్పష్టం చేసింది. 2019 జనవరి 1 నాటికి కనీసం 18 ఏళ్ల వయసు నిండి, ఓటర్ల జాబితాలో పేరున్న వారు ఓటేసేందుకు అర్హులని, ఆ మేరకు జాబితాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించింది. ఓటర్ల జాబితాల్లో తప్పులు దొర్లకుండా జాగ్రత్తలు పడాలని, వార్డు ఓటర్లు అదే వార్డులో వచ్చేలా రెండురోజుల్లో ఓటర్ల జాబితాలను సిద్ధం చేయాలని ఆదేశించింది. టీ–పోల్ యాప్‌ను ఒకట్రెండు రోజుల్లో అప్‌డేట్ చేయనున్నట్లు పేర్కొంది. నోటిఫికేషన్ వెలువడిన తర్వాత అభ్యర్థుల వ్యయం పరిగణనలోకి తీసుకోనున్నట్లు తెలిపింది. వచ్చే నెల 7న ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనున్న నేపథ్యంలో మంగళవారం ఎస్ఈసీ కార్యాలయంలో మున్సిపల్ ఎన్నికల సన్నద్ధత, ఏర్పాట్లపై కమిషనర్లతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వి.నాగిరెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో మున్సిపల్ శాఖ డైరెక్టర్ టీకే శ్రీదేవి, ఎస్ఈసీ కార్యదర్శి ఎం.అశోక్‌కుమార్, జిల్లాల కమిషనర్లు పాల్గొన్నారు.

**చకచకా ఏర్పాట్లు..**

రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలకు ఏర్పాట్లు చకచకా జరిగిపోతున్నాయి. ఇప్పటికే ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయగా, జనవరి 7న ఎస్ఈసీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుండటంతో మిగిలిన ప్రక్రియను పూర్తి చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. గతంలో పోలిస్తే మున్సిపల్ ఓటర్ల సంఖ్య ఈసారి భారీగా పెరగ్గా, ఒకే దశలో ఎన్నికల ప్రక్రియ పూర్తి చేసేలా రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేస్తోంది. వార్డుల విభజన, ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాల గుర్తింపు ప్రక్రియ పూర్తికావస్తోంది. వార్డుల రిజర్వేషన్ ప్రక్రియను జిల్లా కలెక్టర్లు చేపట్టనున్నారు. మున్సిపల్ చైర్మన్లు, కార్పొరేషన్ల మేయర్ల రిజర్వేషన్లను రాష్ట్ర స్థాయిలో చేపడతారు.

**ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనవద్దు..**

ఒక పోలింగ్ స్టేషన్‌లో 800 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునే ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఎన్నికల కమిషనర్ నాగిరెడ్డి సూచించారు. మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లోకి వచ్చిందని తెలిపారు. క్రిస్మస్ పండుగ నేపథ్యంలో అధికారులు రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొనొద్దని, ప్రభుత్వం తరఫున ఎలాంటి బ్యానర్లు పెట్టొద్దని సూచించారు. ఎన్నికల ఏర్పాట్లపై ఈనెల 27న కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్, 28న రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

## ఆర్టీసీ 'సమ్మె' ఉద్యోగులకు వేతన బకాయి చెల్లింపు

సాక్షి, హైదరాబాద్: సమ్మెలో పాల్గొన్న ఆర్టీసీ ఉద్యోగులకు బకాయి ఉన్న 18 రోజుల వేతనాన్ని ఆర్టీసీ చెల్లించింది. ఈ మేరకు వారి ఖాతాలకు ఆ మొత్తాన్ని మంగళవారం జమ చేసింది. అక్టోబర్ 5 నుంచి ఉద్యోగులు సమ్మె ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వారికి సెప్టెంబర్ నెల వేతనాలను అధికారులు పెండింగులో పెట్టారు. సమ్మె ముగిసిన తర్వాత వేతన క్యాలెండర్ ప్రకారం సెప్టెంబర్ 16 వరకు పనిచేసిన కాలానికి సంబంధించిన వేతనాన్ని ఇప్పటికే యాజమాన్యం చెల్లించింది. ఉద్యోగులతో సీఎం కేసీఆర్ ఆత్మీయ సమావేశం నిర్వహించిన రోజున ప్రభుత్వం రూ.100 కోట్లు విడుదల చేసింది. వాటికి మరో రూ.20 కోట్లు కలిపి చెల్లించారు. సెప్టెంబర్ 17 నుంచి సమ్మె ప్రారంభించిన అక్టోబర్ 5 వరకు ఉన్న బకాయి మొత్తాన్ని తాజాగా చెల్లించారు. సమ్మె కాలానికి సంబంధించిన వేతనాల చెల్లింపుపై ప్రభుత్వం నుంచి అధికారికంగా అనుమతి వచ్చాక చెల్లించనున్నారు.

## ఫాస్టాగ్.. విక్రయాలు స్లో

**ఇప్పటికీ 76,646 మాత్రమే అమ్మకం**

సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చిన ఫాస్టాగ్ విధానంపై వాహనదారుల్లో ఇంకా అవగాహన రావడం లేదు. టోల్‌ప్లాజాల్లో నగదు చెల్లింపు మార్గాల్లో భారీ క్యూలు ఏర్పడుతున్నా.. ఫాస్టాగ్ కొనుగోలులో మాత్రం వేగం పుంజుకోవడం లేదు. మంగళవారం వరకు రాష్ట్రంలో 76,646 ట్యాగ్‌లు మాత్రమే అమ్ముడయ్యాయి. దీంతో నగదు చెల్లింపు లేన్ల నుంచి వెళ్లే వాహనాల సంఖ్య తగ్గుముఖం పట్టడం లేదు. ఇప్పటికీ దాదాపు 43.50 శాతం టోల్ రుసుము నగదు చెల్లింపు కౌంటర్ల నుంచే వసూలవుతోంది. ఈ కొత్త విధానం ప్రారంభమవడానికి ఐదారు రోజుల ముందు సగటున రోజుకు 3 వేల ట్యాగ్‌లు అమ్ముడయ్యాయి. కానీ ఇప్పుడా సంఖ్య సగానికి పడిపోయింది. ఆదివారం 1,580 ట్యాగ్‌లు, సోమవారం 1,509 ట్యాగ్‌లు మాత్రమే అమ్ముడయ్యాయి. మంగళవారం 56.37 శాతం టోల్ ఆదాయం ఫాస్టాగ్ కౌంటర్ల నుంచి వసూలు అయినట్టు ఎన్‌హెచ్ఏఐ ప్రాంతీయ అధికారి కృష్ణప్రసాద్ పేర్కొన్నారు.

## విద్యార్థినిపై అసిస్టెంట్ ప్రొఫెసర్ లైంగిక దాడి

హైదరాబాద్: నగర శివారులోని ఇంజనీరింగ్ కాలేజీలో పనిచేస్తున్న ఓ అసిస్టెంట్ ప్రొఫెసర్ కీచక పర్వానికి తెరలేపాడు. విద్యా బుద్ధులు చెప్పాల్సిన సదరు ప్రొఫెసర్ ఓ విద్యార్థినిని ల్యాబ్‌కు పిలిపించి లైంగిక దాడికి పాల్పడ్డాడు. మల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఈ ఘటన చోటుచేసుకోవడం తీవ్ర కలకలం రేపింది. వివరాలు.. మైసమ్మగూడలోని మల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థినిని సోమవారం సాయంత్రం 4 గంటల సమయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ వెంకటయ్య ల్యాబ్‌కు పిలిపించి ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని బాధితురాలు కరీంనగర్‌లో ఉన్న తన తల్లిదండ్రులకు చెప్పడంతో వారు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు వెంకటయ్యను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

## బాలింత స్వాతి డిశ్చార్జి

హైదరాబాద్: అచ్చంపేటలో వైద్యుల నిర్లక్ష్యం కారణంగా పేట్లబురుజు ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో తల లేని శిశువుకు జన్మనిచ్చిన బాలింత స్వాతి మంగళవారం డిశ్చార్జి అయ్యింది. వైద్యులు ఆమెకు పూర్తి వైద్య చికిత్సలు నిర్వహించి 108 వాహనం ద్వారా ఆస్పత్రికి చెందిన ఇద్దరు గార్డులను ఇచ్చి అచ్చంపేటకు పంపించారు. బాధితురాలు స్వాతి, బంధువు అంజమ్మలు మాట్లాడుతూ.. ఎన్నో కలలు కని మొదటి కాన్పు కోసం వెళ్తే వైద్యుల నిర్లక్ష్యం వల్ల శిశువు మృతి చెందిందన్నారు. తమకు ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తలలేని శిశువు మృతదేహాన్ని ఆస్పత్రి మూడో బ్లాక్‌లో భద్రపరచగా.. సోమవారం సాయంత్రం అచ్చంపేట పోలీసులు విచారణ నిమిత్తం శిశువు మృతదేహాన్ని తీసుకెళ్లారు. స్వాతి నుంచి ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు.

## ఎస్ఈసీకి కాంగ్రెస్ అభ్యంతరం

- ఓటర్ల జాబితా, రిజర్వేషన్లు ఖరారు కాకుండానే షెడ్యూల్
- సంక్రాంతి సమయంలో ఎన్నికల నిర్వహణ సరికాదు

సాక్షి, హైదరాబాద్: వార్డుల వారీగా ఓటర్ల జాబితాలు ప్రకటించకుండానే, రిజర్వేషన్లు ఖరారు చేయకుండానే మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేయడం పట్ల ఎస్ఈసీకి కాంగ్రెస్ నాయకులు అభ్యంతరం తెలిపారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు సహకరించాలని, పండగలప్పుడు ఇవి నిర్వహించకుండా చూడాలని, ఈ మేరకు ఎన్నికల తేదీల్లో మార్పులు చేయాలని సూచించారు. వార్డుల వారీగా ఓటర్ల జాబితా లేకుండా, రిజర్వేషన్లు ఖరారు కాకుండా ఎన్నికల షెడ్యూల్‌ను ఎస్ఈసీ విడుదల చేస్తున్న తీరును మొదటిసారి చూస్తున్నామని పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ముందస్తు సమాచారం ఇచ్చామని, రిజర్వేషన్లు ఖరారయ్యాకే ఎన్నికల నోటిఫికేషన్ ఇస్తామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వి.నాగిరెడ్డి చెప్పారని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. అదేవిధంగా సంక్రాంతి పండుగ సందర్భంగా ఎన్నికల ప్రక్రియను కొనసాగించడం సరికాదని, తేదీలు మార్చాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు విజ్ఞప్తి చేశామన్నారు. పండుగ సమయంలో నామినేషన్ల ప్రక్రియ కొనసాగిస్తే ఊళ్లకు వెళ్లినవారు తిరిగి రావడంలో, చివరివరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు వెల్లడికాక పోటీచేసే అభ్యర్థులు తక్కువ సమయంలో ఎమ్మార్వోల నుంచి సంబంధిత ధ్రువపత్రాలు తెచ్చుకోవడం కష్టమవుతుందని ఎస్ఈసీ దృష్టికి తీసుకొచ్చినట్టు తెలియజేశారు. ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సమ్మతించిందని కమిషనర్ చెబుతూ, తాము ప్రస్తావించిన అంశాలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారని కాంగ్రెస్ ఎన్నికల కమిటీ కన్వీనర్ జి.నిరంజన్ మీడియాకు తెలిపారు. మంగళవారం ఎస్ఈసీ కార్యాలయంలో కమిషనర్‌తో పార్టీ నాయకులు పొన్నం ప్రభాకర్, సంపత్‌కుమార్, మర్రి శశిధర్‌రెడ్డి, ఎం.కోదండరెడ్డి, శ్యాంమోహన్, కౌశిక్‌రెడ్డి సమావేశమై ఆయా అంశాలపై తమ అభ్యంతరాలు తెలియజేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ, 'కోర్టు సూచనల మేరకు డీలిమిటేషన్ జరిగింది. జనాభాకు సంబంధించిన అన్ని వివరాలు ప్రభుత్వం దగ్గర ఉన్నాయి. అయినా కావాలని ప్రకటించడం లేదు. షెడ్యూల్ విషయంలో అధికార పార్టీ అధికార దుర్వినియోగానికి పాల్పడింది. సంక్రాంతి పండుగ తరువాత నోటిఫికేషన్ ఇవ్వాలని మేము ఈసీని కోరాం. షెడ్యూల్ మార్చడానికి అవకాశం ఉంది. రిజర్వేషన్ ప్రక్రియను తొందరగా పూర్తి చేయాలని కోరాం'అని తెలిపారు.

## నౌహీరాషేక్‌కు బెయిల్

- షరతులతో హైకోర్టు అనుమతి
- కేసులన్నీ ఎస్ఎఫ్ఐఏకు బదిలీ



సాక్షి, హైదరాబాద్: హీరా గోల్డ్ ఎగ్జిమ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి చెందిన నౌహీరా షేక్‌కు తెలంగాణ హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. అంతేకాకుండా, హీరా గ్రూప్ ఆఫ్ కంపెనీ భారీ స్థాయిలో కోట్లాది రూపాయల మోసాలకు పాల్పడిందని దాఖలైన అన్ని కేసులను 2013 కంపెనీస్ యాక్ట్ కింద సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీకి (ఎస్ఎఫ్ఐఏ) బదిలీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్లలో తనపైన, సంస్థపైన నమోదైన ఎఫ్ఐఆర్‌లలో తదుపరి చర్యలను నిలిపివేయాలని కోరుతూ నౌహీరా షేక్ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గండికోట శ్రీదేవి మంగళవారం విచారించి పైఉత్తర్వులు జారీ చేశారు. అధిక వడ్డీలతో ప్రతి నెలా చెల్లింపులు చేస్తామని నమ్మించి పెద్ద సంఖ్యలో డిపాజిటర్లను మోసం చేశారని, వేల కోట్ల రూపాయలను వసూలు చేసి తిరిగి చెల్లించకుండా మోసానికి పాల్పడ్డారని ఆమెపై కేసులు నమోదయ్యాయి. దేశవ్యాప్తంగా ఆమెపై కేసులు ఉన్నాయని, తెలంగాణలో పది కేసులు ఉన్నాయని ప్రభుత్వ న్యాయవాది చెప్పారు. నౌహీరా షేక్‌కు బెయిల్ ఇవ్వాలని, వేరువేరు కేసుల్లో అరెస్టు చేయడం అన్యాయమని పిటిషనర్ న్యాయవాది చెప్పారు. కంపెనీల చట్టం కింద అన్నింటినీ ఎస్ఎఫ్ఐఏకు బదిలీ చేయాలన్నారు. వాదనల అనంతరం హైకోర్టు, మిగిలిన కేసుల్లో పిటిషనర్ రూ.5 కోట్లు డిపాజిట్ చేయాలని, రెండు పూచీకత్తులు సమర్పించాలని, కోర్టు అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లరాదని షరతులు విధిస్తూ బెయిల్ మంజూరు చేసింది.

## విపత్తుల నిర్వహణ, అగ్నిమాపక శాఖకు ఆర్టీసీ డ్రైవర్లు

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీలో పని చేస్తున్న డ్రైవర్లలో 41 మందిని రాష్ట్ర విపత్తుల నిర్వహణ, అగ్నిమాపక శాఖకు డిప్యుటేషన్‌పై పంపారు. ఈ మేరకు ఆర్టీసీ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర విపత్తుల నిర్వహణ, అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ విజ్ఞప్తి మేరకు డ్రైవర్లను పంపిస్తున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. ఫారిన్ సర్వీసెస్ కింద వారు ఏడాది పాటు ఆ శాఖలో డిప్యుటేషన్‌పై పని చేయాలని తెలిపింది.

# హక్కుల పట్ల అవగాహన అవసరం

**వినియోగదారుల దినోత్సవంలో పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్**

సాక్షి, హైదరాబాద్: వినియోగదారులకు తమ హక్కులు, చట్టాల పట్ల మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. చట్టాల పట్ల అవగాహన లేకపోవడం వల్ల వినియోగదారులు సరైన న్యాయం పొందలేకపోతున్నారని, వారిలో చట్టాల పట్ల చైతన్యం పెంచితే మోసాలకు అడ్డుకట్ట వేయొచ్చన్నారు. మంగళవారం పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో రంగారెడ్డి జెడ్పీ కార్యాలయంలో నిర్వహించిన వినియోగదారుల దినోత్సవానికి మంత్రి గంగులతో పాటు పౌరసరఫరాల సంస్థ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర వినియోగదారుల వివాదాల, పరిష్కారాల కమిషన్ ప్రెసిడెంట్ ఎం.ఎస్.కె. జైస్వాల్, శాఖ కమిషనర్ పి.సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు. వినియోగదారుల హక్కులు, చట్టాలపై అవగాహన కల్పిస్తూ రూపొందించిన వాల్‌పోస్టర్‌ను ఈ సందర్భంగా గంగుల ఆవిష్కరించారు. మంత్రి మాట్లాడుతూ, ఆన్‌లైన్ అమ్మకాలు, టెలీషాపింగ్, మల్టీ మార్కెటింగ్, ప్రత్యక్ష అమ్మకం లాంటివన్నీ చట్టం పరిధిలోకి వస్తాయన్నారు. వినియోగదారులకు నష్టం జరిగినప్పుడు జవాబుదారులను, కారకులను జరిమానాలతోనే సరిపెట్టకుండా కఠిన శిక్షలు, జైలుకు పంపడానికి కూడా వెనుకాడని విధంగా వినియోగదారుల కొత్త చట్టం ఉందని తెలిపారు. పౌరసరఫరాల సంస్థ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ, కేవలం హక్కులు కల్పించడంతోనే వినియోగదారుల ప్రయోజనాలను కాపాడినట్టు కాదనీ, ఆ హక్కులను పరిరక్షించినప్పుడు, చట్టాలను అమలు చేసినప్పుడే వారికి నిజమైన న్యాయం జరుగుతుందని, ఆ దిశగా వినియోగదారుడికి అండగా నిలబడాలన్నారు. రాష్ట్ర వినియోగదారుల వివాదాల, పరిష్కారాల కమిషన్ ప్రెసిడెంట్ జస్టిస్ ఎం.ఎస్.కె.జైస్వాల్ మాట్లాడుతూ, వినియోగదారులకు సత్వర న్యాయం అందించడమే తమ కమిషన్ లక్ష్యమన్నారు.



మంగళవారం వినియోగదారుల దినోత్సవం సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి గంగుల కమలాకర్. చిత్రంలో మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, జైస్వాల్, సత్యనారాయణరెడ్డి తదితరులు

# టీఆర్‌ఎస్ జెండా ఎగరేస్తాం: కర్నె

**ఉత్తమ్ వ్యాఖ్యలతో గాంధీభవన్‌కు తాళం ఖాయం**



**సాక్షి, హైదరాబాద్:** మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసి 120 మున్సిపాలిటీలు, పది కార్పొరేషన్లలో టీఆర్‌ఎస్ జెండా ఎగురవేస్తామని మండలిలో ప్రభుత్వ విప్ కర్నె ప్రభాకర్ అన్నారు. పార్టీ ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు, ఎం.ఎస్.ప్రభాకర్‌తో కలసి మంగళవారం శాసనసభ ఆవరణలోని టీఆర్‌ఎస్ ఎల్పీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. మున్సిపల్ ఎన్నికల షెడ్యూలు ప్రకటనపై కోర్టును ఆశ్రయిస్తామంటూ టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కర్నె ప్రభాకర్ మండిపడ్డారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ బండారం బయటపడుతోందన్న భయంతో ఆ పార్టీ ఉందన్నారు. ఉత్తమ్ వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల ఆశలపై నీళ్లు చల్లేలా ఉన్నాయని, పార్టీ బీ ఫారం తీసుకునేందుకు కూడా ఎవరూ ముందుకు వచ్చే పరిస్థితి లేదని ఎద్దేవా చేశారు. ఎన్నికలకు ముందే చేతులెత్తేసిన పరిస్థితి కాంగ్రెస్‌దని, గాంధీభవన్‌కు తాళం వేసే పరిస్థితిని ఉత్తమ్ సృష్టిస్తున్నారని విమర్శించారు. టీఆర్‌ఎస్ పార్టీ ప్రజలను నమ్ముకుంటే, కాంగ్రెస్ మాత్రం కోర్టులను నమ్ముకుంటోందని ఎద్దేవా చేశారు.

**అడ్డుకోవడం దివాలాకోరుతనం**

అభివృద్ధి కుంటుపడకూడదని రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే, కాంగ్రెస్ మాత్రం పంచాయతీ, స్థానిక సంస్థల తరహాలో మున్సిపల్ ఎన్నికలను అడ్డుకునేందుకు ప్రయత్నించడం ఆ పార్టీ దివాలాకోరుతనానికి నిదర్శనమని కర్నె విమర్శించారు. ఎన్నికల్లో ఓడితే రాజకీయ సన్యాసం తీసుకుంటానన్న ఉత్తమ్ తన మాట మీద ఎన్నడూ నిలబడలేదని, ఎన్నికలకు కాంగ్రెస్ సిద్ధంగా లేదనే విషయం ఆయన వ్యాఖ్యలతో స్పష్టమైందని చెప్పారు. ఉత్తమ్ తన కంచుకోటగా చెప్పుకునే హుజూర్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో జరిగిన ఉపఎన్నికలో టీఆర్‌ఎస్ అభ్యర్థి విజయం సాధించిన విషయాన్ని గుర్తు చేశారు. హుజూర్‌నగర్ ఎన్నికల్లో వచ్చిన ఫలితమే మున్సిపల్ ఎన్నికల్లోనూ బీజేపీకి వస్తుందన్నారు. కాంగ్రెస్ నాయకత్వ లేమితో ప్రతి చిన్న అంశానికి కోర్టును ఆశ్రయిస్తోందని ఎమ్మెల్సీ ఎం.ఎస్. ప్రభాకర్ అన్నారు.

# 'తెలుగు వికీ'లో తెలంగాణ

- వికీపీడియాలో రాష్ట్ర సమాచారం పొందుపర్చడంపై ఐటీ శాఖ దృష్టి
- కేంద్ర ఐటీ శాఖ, హైదరాబాద్ ట్రిపుల్ ఐటీతో రాష్ట్ర ఐటీశాఖ ఒప్పందం
- రాష్ట్ర భౌగోళిక, చారిత్రక, పర్యాటక, ప్రముఖుల సమాచారం అందుబాటులోకి..
- సహకారం కోసం వివిధ రంగాల నిపుణులు, ఔత్సాహికులకు ప్రత్యేక శిక్షణ
- ప్రాజెక్టు తెలుగు వికీకి ప్రాచుర్యం కల్పించేందుకు బుక్‌ఫెయిర్‌లో స్టాల్..

**సాక్షి, హైదరాబాద్:** ఆన్‌లైన్ విజ్ఞాన సర్వస్వంగా పేర్కొనే 'వికీపీడియా'లో తెలంగాణ రాష్ట్ర సమాచారాన్ని తెలుగులో అందుబాటులోకి తెచ్చేందుకు రాష్ట్ర ఐటీ శాఖ ప్రణాళికలు రూపొందిస్తోంది. దేశంలో ఇంటర్నెట్ వినియోగంలోకి వచ్చే క్రమంలో తొలుత సమాచారమంతా ఇంగ్లిషులో అందుబాటులోకి వచ్చింది. అయితే ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లోనూ ఇంటర్నెట్ వినియోగం పెరుగుతుండటంతో రాష్ట్రంలోని వివిధ రంగాలు, అంశాలకు సంబంధించిన సమాచారాన్ని లోకలైజేషన్ (స్థానిక భాషలోకి మార్చే) బాధ్యతను ఐటీ శాఖ చేపట్టింది. మరోవైపు వికీపీడియాలోని సమాచారాన్ని భారతీయ భాషల్లో అందుబాటులోకి తెచ్చేందుకు హైదరాబాద్ ట్రిపుల్ ఐటీ భాగస్వామ్యంతో కేంద్ర ఐటీ శాఖ ప్రత్యేక ప్రాజెక్టును చేపట్టింది. ప్రస్తుతం ఈ ప్రాజెక్టులో తెలంగాణ ఐటీ శాఖ కూడా భాగస్వామిగా మారి రాష్ట్రానికి సంబంధించిన సమాచారాన్ని వికీపీడియా ద్వారా అందరికీ అందుబాటులోకి తేవాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా తెలుగులో వికీపీడియా సమాచార లభ్యత, సముదాయ అభివృద్ధి, శిక్షణ, అవగాహన, సాంకేతికత, పరిశోధన తదితర కోణాల్లో అనుసరించాల్సిన కార్యాచరణపై ఇటీవల సంబంధిత వ్యక్తులు, సంస్థలతో చర్చాగోష్టి నిర్వహించింది. రాష్ట్ర సమాచారాన్ని వికీపీడియా ద్వారా అందుబాటులోకి తెచ్చేందుకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తూ ఇటీవల ట్రిపుల్ ఐటీలో అధికారులు కార్యాలయాన్ని ప్రారంభించారు. కాగా వికీపీడియాలో తెలుగు సమాచారంపై అవగాహన కల్పించేందుకు ప్రస్తుతం జరుగుతున్న హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లోనూ ప్రత్యేక స్టాల్‌ను తెలంగాణ ఐటీ శాఖ ప్రారంభించింది.

**ఔత్సాహికులకు శిక్షణ..**

**గ్రామీణ ప్రాంతాలకు విస్తరణ**

ప్రస్తుతం కొద్దిమంది ఔత్సాహికులు వికీపీడియాలో రాష్ట్ర సమాచారాన్ని తెలుగులో పొందుపరుస్తుండగా, దీనిని మరింత విస్తృతం చేయాలని ఐటీ శాఖ నిర్ణయించింది. ఇప్పటికే గుర్తించిన కొందరు ఔత్సాహికులతో పాటు, వివిధ రంగాలకు చెందిన నిపుణులు, జర్నలిస్టులు, భాషాభిమానుల సహకారం తీసుకుంటారు. ఇంగ్లిషులో ఉన్న సమాచారాన్ని తెలుగులోకి తర్జుమా చేయడం, అందుబాటులో ఉన్న సమాచారాన్ని మరింత మెరుగుపర్చడం, కొత్త అంశాలకు సంబంధించిన విషయ సేకరణ జరిపి వ్యాసాల రూపంలో తెలుగు వికీపీడియాలో పొందుపరుస్తారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ ఔత్సాహికులను గుర్తించి తెలంగాణ రాష్ట్ర భౌగోళిక, చారిత్రక, పర్యాటక అంశాలకు సంబంధించిన సమాచారం, ప్రముఖుల జీవన విశేషాలు తదితరాలపై వ్యాసాలు రాసేలా శిక్షణ ఇస్తారు. మరోవైపు వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన సమాచారాన్ని తమ రచనల్లో ఉపయోగించుకునేందుకు కూడా వీలు కల్పిస్తామని ఐటీ శాఖ ప్రకటించింది. రాష్ట్ర అవతరణ తర్వాత భాషా, సాంస్కృతిక శాఖ ప్రచురించిన పుస్తకాల్లోని సమాచారాన్ని కూడా వికీపీడియాలో పొందుపరుస్తారు. తెలంగాణకు సంబంధించి ఆఫ్‌లైన్ (పుస్తక రూపం) లో ఉన్న సమాచారాన్ని కూడా వికీపీడియా ద్వారా తెలుగులో అందుబాటులోకి తెస్తారు.





**భారతీయ భాషల్లో సమాచారం అంతంతే..**

ప్రపంచవ్యాప్తంగా 438 కోట్ల మంది ఇంటర్నెట్‌ను వినియోగిస్తుండగా, దేశ జనాభాలో 40 శాతానికి పైగా (సుమారు 56 కోట్ల మంది) ఇంటర్నెట్ వినియోగదారులున్నారు. అయితే ప్రపంచవ్యాప్తంగా అత్యధికంగా మాట్లాడే 28 భాషల్లో 8 భారతీయ భాషలున్నా, వికీపీడియాలో భారతీయ భాషల్లో సమాచార లభ్యత అంతంత మాత్రంగానే ఉంది. భారతీయ భాషల్లో అత్యధికంగా హిందీ, తమిళం, బెంగాలీ భాషల్లో వికీ సమాచారం అందుబాటులో ఉండగా, తెలుగు తర్వాతి స్థానంలో ఉంది. ప్రపంచవ్యాప్తంగా నాణ్యమైన, విశ్వసనీయ సమాచారం కోసం ఆన్‌లైన్ ఎన్‌సైక్లోపీడియాగా పేర్కొనే వికీపీడియాను సెకనుకు 8 వేల మంది సందర్శిస్తున్నారు. వికీపీడియాలో లక్షల కొద్ది పేజీల సమాచారం అందుబాటులో ఉండగా, హిందీలో 1.34 లక్షల పేజీలు, తెలుగులో సుమారు 70 వేల పేజీల సమాచారం మాత్రమే అందుబాటులో ఉంది.

**తెలంగాణ సమాచారం అందుబాటులోకి..**

ప్రస్తుతం ఇంటర్నెట్ సేవలు మారుమూల ప్రాంతాలకు అందుబాటులోకి రావడంతో స్థానిక భాషలో సమాచారం కోసం డిమాండ్ పెరుగుతోంది. దీంతో తెలంగాణ చరిత్ర, సంస్కృతి, భౌగోళిక, పర్యాటక విశేషాలు, ప్రముఖులకు సంబంధించిన సమాచారాన్ని తెలుగులో అందుబాటులోకి తేవాలని నిర్ణయించాం. ట్రిపుల్ ఐటీ, కేంద్ర ఐటీ శాఖ భాగస్వామ్యంతో శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయబోతున్నాం. ప్రజలకు అర్థమయ్యే భాషలో సమాచారాన్ని అందుబాటులోకి తేవడం ద్వారా సామాజిక అంతరాలు తగ్గించాలనేదే ప్రభుత్వ ఉద్దేశం.

*– కొణతం దిలీప్, డైరెక్టర్, తెలంగాణ ఐటీ డిజిటల్ మీడియా వింగ్*



మంగళవారం జ్యోతి ప్రజ్వలన చేసి ఆర్‌ఎస్‌ఎస్ శిబిరాన్ని ప్రారంభిస్తున్న శ్యాంకుమార్

# హిందూ సమాజం శక్తిమంతం కావాలి

- ఆర్‌ఎస్‌ఎస్ దక్షిణ మధ్య క్షేత్ర ప్రచారక్ ఆలె శ్యాంకుమార్
- భారత్ కళాశాలలో ప్రారంభమైన విజయ సంకల్ప శిబిరం

**ఇబ్రహీంపట్నం రూరల్:** హిందూ సమాజం శక్తిమంతం కావాలని ఆర్‌ఎస్‌ఎస్ దక్షిణ మధ్య క్షేత్ర ప్రచారక్ ఆలె శ్యాంకుమార్ అన్నారు. హిందూ సమాజాన్ని జాగృతం చేయడానికి సేవక్‌లు పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) విజయ సంకల్ప శిబిరం మంగళవారం రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధిలోని మంగళ్‌పల్లి భారత్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రారంభమైంది. శిబిరానికి రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 8 వేల మంది ప్రతినిధులు హాజరయ్యారు. ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్యాంకుమార్ మాట్లాడుతూ.. హిందూ సమాజం వెయ్యి సంవత్సరాలు బానిసత్వంలో గడపడానికి ప్రధాన కారణం హిందువుల అనైక్యతే అన్నారు. ప్రతి హిందువు ఈ భూమిని రక్షిస్తూ.. ఇక్కడి నదులు, పర్వతాలను పవిత్రంగా భావించి సంస్కృతిని, ధర్మాన్ని కాపాడుకోవాలన్నారు. మత మార్పిడులను అరికట్టాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ అఖిల భారతీయ సహ్ కార్యవాహ్ ముకుందా, క్షేత్ర సహ సంఘ చాలక్ దూసి రామకృష్ణ, ప్రాంత సంఘ చాలక్ దక్షిణామూర్తి, ఎంపీలు బండి సంజయ్, ధర్మపురి అర్వింద్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్, ఎమ్మెల్యే రాజాసింగ్, మాజీ ఎంపీ వివేక్, మాజీ ఎమ్మెల్యే ఇంద్రసేనారెడ్డి, ఇనుగాల పెద్దిరెడ్డి, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

**ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ హాజరు**

ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ మంగళవారం సాయంత్రం శిబిరానికి హాజరయ్యారు. బుధవారం ఉదయం 5 గంటలకు స్వయం సేవక్‌ల పరిచయ కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. సాయంత్రం సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగే సభలో ఆయన ప్రసంగిస్తారని ఆర్‌ఎస్‌ఎస్ వర్గాలు తెలిపాయి.



శిబిరానికి హాజరైన స్వయం సేవక్ సంఘ్ కార్యకర్తలు

## 29న ఓయూలో నిరుద్యోగ విద్యార్థి సమరభేరి

**ఉస్మానియా యూనివర్సిటీ:** తెలంగాణ ఇంటి పార్టీ అనుబంధ విద్యార్థి సంఘం తెలంగాణ స్టూడెంట్స్ యూనియన్ (టీఎస్‌యూ) ఆధ్వర్యంలో ఈ నెల 29న ఉస్మానియా వర్సిటీలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. నిరుద్యోగ విద్యార్థి సమరభేరి పేరుతో జరిగే ఈ సభను విజయవంతం చేయాలని రూపొందించిన వాల్ పోస్టర్‌ను మంగళవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట టీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ మాదిగ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. టీఆర్‌ఎస్ అధికారం చేపట్టినప్పటి నుంచి నిరుద్యోగులపై అలసత్వాన్ని ప్రదర్శిస్తోందని మండిపడ్డారు. సభకు రాష్ట్రంలోని వివిధ వర్సిటీల విద్యార్థులు, వేలాది మం ది నిరుద్యోగులు హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వంగ భాస్కర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి ప్రజాపతి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ట్రైనీ ఐపీఎస్ మహేశ్వర్‌రెడ్డి సస్పెన్షన్ చెల్లదు

- కేంద్ర హోంశాఖ ఉత్తర్వులను కొట్టేసిన క్యాట్
- తిరిగి శిక్షణకు అనుమతించాలని ఆదేశం..
- కాపురంలో కలహాలు సహజం.. కౌన్సెలింగ్ ఇస్తే చాలని వ్యాఖ్య




**సాక్షి, హైదరాబాద్:** ట్రైనీ ఐపీఎస్ అధికారి మహేశ్వర్‌రెడ్డిని సస్పెండ్ చేస్తూ కేంద్ర హోంశాఖ జారీ చేసిన ఉత్తర్వులను హైదరాబాద్‌లోని కేంద్ర పరిపాలన ట్రిబ్యునల్ (క్యాట్) కొట్టేసింది. మహేశ్వర్‌రెడ్డిని ప్రొబేషనరీ శిక్షణకు అనుమతించాలని కేంద్రప్రభుత్వంతోపాటు జాతీయ పోలీస్ అకాడమీలను ఆదేశించింది. మహేశ్వర్‌రెడ్డి భార్య ఫిర్యాదుపై పోలీసులు ఎఫ్‌ఐఆర్ నమోదు చేయడాన్ని కారణంగా చూపించి ఐపీఎస్ శిక్షణ పొందుతున్న సమయంలో సస్పెండ్ చేయడాన్ని క్యాట్ తప్పుపట్టింది. చట్ట నిబంధనలకు వ్యతిరేకంగా తనను సస్పెండ్ చేశారని మహేశ్వర్‌రెడ్డి సవాల్ చేసిన పిటిషన్‌ను క్యాట్ చైర్మన్ జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డి, సభ్యుడు బీవీ సుధాకర్‌ల ధర్మాసనం మంగళవారం విచారించి ఉత్తర్వులు జారీ చేసింది. బీటెక్‌లో సహ విద్యార్థిని భావనను మహేశ్వర్‌రెడ్డి రిజిస్టర్ మ్యారేజ్ చేసుకున్నారని, ఐపీఎస్‌కు ఎంపిక కావడంతో విడాకులు ఇస్తారనే భయంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారని పిటిషనర్ న్యాయవాది కె.సుధాకర్‌రెడ్డి వాదించారు. ఐపీఎస్‌కు ఎంపిక అయ్యాక అధికారిక పత్రాల్లో కూడా వివాహం జరిగినట్లుగా రాశారని, భార్య పేరు భావన అనే రాశారని, అయితే కులాంతర వివాహం చేసుకోవడంతో తల్లిదండ్రులకు చెప్పలేదని వివరించారు. తల్లిదండ్రులు ఆత్మహత్య చేసుకుంటారనే భయంతో గోప్యంగా ఉంచారేగానీ భావన విషయంలో అన్యాయం చేయలేదన్నారు. శిక్షణ పొందుతుండగా ముస్సోరి శిక్షణా సంస్థ డైరెక్టర్‌కు ఆమె ఈ మెయిల్ ద్వారా ఫిర్యాదు చేస్తే దానికి మహేశ్వర్‌రెడ్డి ఇచ్చిన జవాబుతో డైరెక్టర్ సంతృప్తిని వ్యక్తపరిచారంటూ వాటి పత్రాలను ఆయన ధర్మాసనానికి నివేదించారు. కేంద్రం తరఫు న్యాయవాది వాదిస్తూ.. ఎఫ్‌ఐఆర్ నమోదయ్యాక సస్పెండ్ చేసే అధికారం కేంద్రానికి ఉందన్నారు.

**బెంగళూరు సగం ఖాళీ అవుతుంది..**

ఈ వాదనలపై జస్టిస్ నర్సింహారెడ్డి స్పందిస్తూ.. 'రికార్డుల్లో కూడా మహేశ్వర్‌రెడ్డి తన భార్య భావన అని చెప్పారు. ఆరోపణలకు ఇచ్చిన జవాబుతో ముస్సోరి అకాడమీ డైరెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. భార్యాభర్తల మధ్య గొడవ ఉంది. దానిపై ఎఫ్‌ఐఆర్ నమోదైంది. ఆరోపణల దశలో ఉండగానే ఏవిధంగా సస్పెండ్ చేస్తారు..'అని ప్రశ్నించారు. బెంగళూరులో అయితే పది ఫ్యామిలీ కోర్టులకు విడాకుల కోసం వచ్చే వారిలో అత్యధికులు ఉన్నత చదువులు చదివిన వారేనని, వాళ్లలో చాలా మందిపై ఎఫ్‌ఐఆర్‌లు నమోదయ్యాయని, వారందరినీ సస్పెండ్ చేస్తే బెంగళూరు సగం ఖాళీ అవుతుందని వ్యాఖ్యానించారు. భార్యాభర్తల మధ్య గొడవలు సహజమని, 60 ఏళ్ల దంపతులు కూడా కేసులు పెట్టుకుంటున్నారన్నారు. కాపురంలో కలహాలు సహజమని, కౌన్సెలింగ్ సరిగ్గా జరిగితే కాపురాలు నిలబడతాయని అభిప్రాయపడ్డారు. ప్రతిభ, నిరంతర కష్టానికి ఫలితంగా ఐపీఎస్‌గా ఎంపిక అవుతారని, ఇప్పుడు ఎఫ్‌ఐఆర్ ఉందని చెప్పి సస్పెండ్ చేయడం చట్ట వ్యతిరేకమని, ఫిర్యాదుపై విచారణ జరిగి తుది ఆదేశాలు వెలువడితే దానిని బట్టి స్పందిస్తే తప్పులేదని ధర్మాసనం అభిప్రాయపడింది.

# గోదారి పరుగుకు 'పునరావాసం' అడ్డు

- నాలుగు ముంపు గ్రామాలను ఖాళీ చేయిస్తేనే మిడ్‌మానేరు నుంచి కొండపోచమ్మ సాగర్‌కు నీరు
- నిర్వాసితుల తరలింపునకు చర్యలు చేపట్టిన రెవెన్యూ శాఖ
- మరో నెల రోజులుపైగా పట్టే అవకాశం
- ఇటీవలే రూ.50 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం

**సాక్షి, హైదరాబాద్:** కాళేశ్వరం ఎత్తిపోతల పథకం ద్వారా గోదావరి జలాలు మిడ్‌మానేరు దిగువకు వచ్చేందుకు పునరావాస ప్రక్రియ అడ్డుగోడగా మారింది. మిడ్‌మానేరు నుంచి కొండపోచమ్మసాగర్ వరకు గోదావరి జలాలను తరలించాలంటే నాలుగు గ్రామాలను ఖాళీ చేయాల్సి ఉండటం, అక్కడ పునరావాస ప్రక్రియ పూర్తయితే కానీ నీళ్లు దిగువకు పారే అవకాశం లేకపోవడం జాప్యానికి కారణమవుతోంది. ఈ ప్రక్రియ అనుకున్నంత వేగంగా సాగకపోవడంతో మరో నెలరోజులైతేకానీ మిడ్‌మానేరు నుంచి నీటిని ఎత్తిపోయడం సాధ్యమయ్యేలా లేదు.

**సంక్రాంతి తర్వాతే దిగువకు గోదావరి**

కాళేశ్వరం పథకం ద్వారా ఇప్పటికే మిడ్‌మానేరు వరకు నీటిని తరలించే ప్రక్రియ పూర్తయింది. అవసరాన్ని బట్టి మోటార్లను నడుపుతూ మేడిగడ్డ నుంచి నీటిని మిడ్‌మానేరుకు తరలిస్తున్నారు. మంగళవారం సైతం మిడ్‌మానేరులోకి 9,450 క్యూసెక్కుల మేర నీరు ఎగువ ప్యాకేజీ–6, 8ల ద్వారా పంపింగ్ చేశారు. 25.87 టీఎంసీ సామర్థ్యం



ఉన్న మిడ్‌మానేరులో ఇప్పటికే 23.09 టీఎంసీల నీటి నిల్వ ఉండటంతో ఇక్కడి నుంచి నీటిని లోయర్‌మానేరు డ్యామ్‌కు తరలిస్తున్నారు. నిజానికి మిడ్‌మానేరు నుంచి దిగువన ఉన్న కాళేశ్వరం ప్యాకేజీలు–10, 11, 12ల ద్వారా అనంతగిరి మీదుగా కొండపోచమ్మ వరకు తరలించాల్సి ఉన్నా పునరావాస ప్రక్రియ పూర్తిగాక, నిర్వాసితులు గ్రామాలు ఖాళీ చేయకపోవడంతో దిగువకు నీటి పంపింగ్ జరగడం లేదు. మిడ్‌మానేరు నుంచి నీటిని తోడే పంప్‌హౌస్‌లో 4 మోటార్లు సిద్ధంగా ఉన్నాయి. ఇక్కడ ఆసియాలోనే పెద్దదైన 0.2 టీఎంసీ నిల్వ సామర్థ్యం ఉన్న ఓపెన్ సర్జ్‌పూల్‌ను సైతం నీటితో నింపిపెట్టారు. అయితే మోటార్లు నడిపి అనంతగిరి రిజర్వాయర్‌లోకి నీళ్లు ఎత్తిపోసేందుకు మాత్రం పునరావాస ప్రక్రియ అడ్డు వస్తోంది. అనంతగిరి కింద ముంపు గ్రామంగా ఉన్న అనంతగిరి గ్రామం ఇంతవరకు ఖాళీ కాలేదు. ఇటీవలే నిర్వాసితుల పునరావాసానికి రూ.50 కోట్లు ఇవ్వడంతో ఇప్పుడిప్పుడే ఖాళీ చేయించే ప్రక్రియ కొనసాగుతోంది. దీంతో పాటే న్యాయపరమైన అంశాలు అడ్డుగా ఉన్నాయి. ఈ గ్రామాన్ని ఖాళీ చేసేవరకు పంపులు నడిపే ఆస్కారమే లేదు. ఈ గ్రామాన్ని ఖాళీ చేయించేందుకు మరో నెల రోజులైనా పడుతుందని రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి. ఇక ఇక్కడి నుంచి నీటిని తరలించి 15 టీఎంసీల సామర్థ్యం ఉన్న కొండపోచమ్మసాగర్‌లో నిల్వ చేయాలన్నా దీనికింద మూడు గ్రామాల పునరావాస ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంది. ఈ మూడు గ్రామాల్లోని 900లకు పైగా నిర్వాసిత కుటుంబాలకు తుంకిబొల్లారం పునరావాస కాలనీలో ఇళ్ల నిర్మాణం చేసిచ్చినా, వివిధ కారణాలతో నిర్వాసితులు అక్కడికి వెళ్లలేదు. నిర్వాసితులకు ఇవ్వాల్సిన పెండింగ్ పరిహారంలో ఇటీవలే రూ.50 కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది. ఆ నిధులను నిర్వాసితులకు చెల్లించే ప్రక్రియ ఇప్పుడిప్పుడే పుంజుకుంది. ఈ ప్రక్రియ పూర్తయి, నిర్వాసితులు ఖాళీ చేయాలన్నా నెల రోజులు పట్టడం ఖాయంగా ఉంది. దీంతో కొండపోచమ్మ సాగర్‌లో నీటిని నిల్వ చేయాలంటే సంక్రాంతి తర్వాత కానీ సాధ్యపడేలా లేదు.

# కృత్రిమ మేధో సంవత్సరంగా 2020

**జనవరి 2న అధికారికంగా ప్రకటించనున్న మంత్రి కేటీఆర్**

**సాక్షి, హైదరాబాద్:** నూతన ఐటీ సాంకేతికతలో శరవేగంగా దూసుకుపోతున్న తెలంగాణ రాష్ట్రం 2020ని 'కృత్రిమ మేధో సంవత్సరంగా'(ఇయర్ ఆఫ్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్సీ) ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఈ నెల 18న ఏఐ స్ట్రాటజీ ఫ్రేమ్‌వర్క్ దార్శనిక పత్రం రూపకల్పనకు సంబంధించి హైదరాబాద్‌లో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశానికి దేశం నలుమూలల నుంచి వచ్చిన ఏఐ నిపుణులు ఫ్రేమ్ వర్క్ రూపకల్పనకు సంబంధించి పలు సూచనలు చేశారు. ఇప్పటికే ఐటీ నూతన సాంకేతికత బ్లాక్‌చెయిన్, డ్రోన్ ఫ్రేమ్‌వర్క్ డాక్యుమెంట్‌ను రాష్ట్ర ప్రభుత్వం రూపొందించింది. ఏఐ, బిగ్ డేటా అనలిటిక్స్ ద్వారా 2021 నాటికి భారతదేశంలో 8 లక్షల ఉద్యోగాలు వస్తాయని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో 2020లో ఏఐ ప్రోగ్రాంను రూపొందించి, అమలు చేసే బాధ్యతను నాస్కామ్‌కు అప్పగిస్తున్నట్లు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి జయేశ్ రంజన్ ప్రకటించారు. 2020ని ఇయర్ ఆఫ్ ఏఐగా ప్రకటించిన నేపథ్యంలో ఏడాది పొడవునా నిర్వహించే కార్యక్రమాలకు సంబంధించిన వివరాలను జనవరి 2న హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమంలో మంత్రి కేటీఆర్ విడుదల చేస్తారు. కేంద్ర ఐటీ మంత్రిత్వ శాఖ కా ర్యదర్శి అజయ్ ప్రకాశ్ సాహ్నీ, నీతి ఆయోగ్ సీఈఓ అమితాబ్‌కాంత్ ఈ సమావేశంలో పాల్గొంటారు.

# జగన్ నిర్ణయం అభినందనీయం: ఒవైసీ

**సాక్షి, హైదరాబాద్:** జాతీయ పౌర రిజిస్టర్ (ఎన్‌ఆర్సీ)పై ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం అభినందనీయమని ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. మంగళవారం హైదరాబాద్ దారుస్సలాంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'వైఎస్ జగన్ నాకు మంచి మిత్రుడు. ఆయన ఎప్పుడూ మిత్రుడుగానే ఉంటారు. ఆయన ఒక రాష్ట్రాన్ని నడిపిస్తున్నారు. చాలా ఇబ్బందులుంటాయి. ఒక నిర్ణయం తీసుకోవడం అంత సులువు కాదు. ఆ రాష్ట్రాన్ని గత టీడీపీ ప్రభుత్వం భ్రష్టు పట్టించింది. అయినా ఆయన పార్టీ, ప్రభుత్వం ఎన్‌ఆర్సీకి వ్యతిరేకంగా నిర్ణయం తీసుకుంది. జగన్‌ది మంచి నిర్ణయం. ఇందుకు ఆయనకు కృతజ్ఞతలు. ఎన్‌ఆర్సీ కంటే ముందు ఎన్పీఆర్‌పై కూడా ఆయన దృష్టి సారించాలి. ఎన్పీఆర్, ఎన్‌ఆర్సీ రెండూ ఒక్కటే. ఎన్‌ఆర్సీ విషయంలో తెలంగాణ సీఎం కేసీఆర్ గట్టి నిర్ణయం తీసుకున్నారు. ఆయనకు కృతజ్ఞతల'ని అన్నారు.



**Telangana State Technology Services Ltd.**
HACA Bhavan, Hyderabad – 500004, Telangana

**TSTS/CS/TSPCB-CAAQMS/2019, Dated 24.12.2019**

TSTS on behalf of Telangana State Pollution Control Board (PCB) issues Open Competitive Tender call notice for Supply, Installation & Maintenance of Continuous Ambient Air Quality Monitoring System (CAAQMS) 07 Nos (Stationary) and Mobile Lab (01 No)

**Pre bid meeting Date:** 30.12.2019 @ 12:00 noon, O/o TSPCB, Sanathnagar, Hyderabad.

For further details please visit **www.tsts.telangana.gov.in https://tender.telangana.gov.in & https://tspcb.cgg.gov.in**

Sd/- Managing Director

**SOUTHERN POWER DISTRIBUTION COMPANY OF TELANGANA LTD.**
**E-Procurement Tender Notice - 06/19-20**

1st extension to Tender Specification No.: 12/2019-20 of CGM/OP/ Rural Zone/ TSSPDCL. 1) Bid download starts from: **25.12.2019 from 14.00 Hrs.,** 2) Bid download closing date & time online: **06.01.2020 upto 14.00 Hrs., 3)** Bid Submission Last date & time: **06.01.2020 upto 14.30 Hrs., 4)** Technical Bid & Price bid opening date & Time: **06.01.2020 at 15.00 Hrs. & 16.00 Hrs.** For further details regarding detailed notification, specification please visit **www.tender.telangana.gov.in. Ph.No.040-2343 1473.**

Sd/- Chief General Manager, Operation, Rural Zone, TSSPDCL, Mint Compound, Hyd.
Tender ID: SPDCLRURAL_ZNE01481

**తెలంగాణ ప్రభుత్వం**
**రహదారులు & భవనముల శాఖ**
**ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన**

NIT No.1415/KMNR-PR1 to PR26/DCE(R)/EE-R/DEE-3/AEE/2019, తేది: 23.12.2019

1. R&B డిపార్ట్‌మెంట్, కరీంనగర్ సర్కిల్‌లో ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫామ్ క్రింద కరీంనగర్ జిల్లాలో 05 నం.ల పనులు, రాజన్న సిరిసిల్లా జిల్లాలో 4 నం.ల పనులు, పెద్దపల్లి జిల్లాలో 08 నం.ల పనులు మరియు జగిత్యాల జిల్లాలో 9 నం.ల పనులు నాన్-ప్లాన్ స్కీమ్ క్రింద పీరియాడికల్ రెన్యువల్ పనుల (రోడ్లు) కోసం ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. టెండరుదారులు టెండరు షెడ్యూళ్ళను ఇ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్ అంటే https:// tender.telangana.gov.in నుండి 31.12.2019న సా.4.00 గం. నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. టెండర్ల స్వీకరణకు ఆఖరు తేది: 07.01.2020న లేదా ఆలోగా మ.3.30 గం. వరకు. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అంటే https://tender.telangana.gov.in లో చూడవచ్చును.

సం/- ఇంజినీర్-ఇన్-చీఫ్, (R&B) SR&CRN
DIPR Ro.No.2060-DP/CL/Advt/1/1/2019-20, Dt: 14.12.2019

**SBI ఇన్‌ఫ్రా మేనేజ్‌మెంట్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్**
(పూర్తిగా SBI సొంత అనుబంధ సంస్థ)
SBI, LHO ప్రెమిసెస్, కోఠి, హైదరాబాద్-95, ఫోన్: 040-23466310 / 23466346

**కేటరింగ్ సర్వీసుల కోసం ఇ-టెండరు ప్రకటన**

కేటరింగ్ సర్వీసుల కోసం స్టేట్ బ్యాంక్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ బ్యాంకింగ్ (SBIRB), లింగంపల్లి, హైదరాబాద్ తరఫున SBI ఇన్‌ఫ్రా మేనేజ్‌మెంట్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాద్ ఇ-టెండర్లు కోరుతోంది. తెలంగాణ రాష్ట్రంలో ఇదేతరహా పనులు నిర్వహించిన ఆసక్తిగల పార్టీలు బ్యాంక్ వెబ్‌సైట్ www.sbi.co.in దర్శించి 'procurement news' చూడగలరు. పూర్తిచేసిన టెండర్లను ఇ-టెండరింగ్ ప్రాసెస్ ద్వారా **15/01/2020**న లేదా ఆలోగా అప్‌లోడ్ చేయవలెను.

ప్రదేశం: హైదరాబాద్
తేది: 25/12/2019 వైస్ ప్రెసిడెంట్

**MSME-TOOL ROOM, HYDERABAD**
**(CENTRAL INSTITUTE OF TOOL DESIGN)**
(A Govt. of India Society) Ministry of MSME
Balanagar 'X' Roads, Hyderabad-500 037 (TS) INDIA. TEL. No. 040 - 23772749,
Visit us at: www.citdindia.org, E-Mail: citdcadcam@citdindia.org

**WALK-IN-INTERVIEW**

Central Institute of Tool Design is an ISO 9001:2015, ISO14001:2004, ISO 29990:2010 and ISO 50001:2011 certified premier Institute in India to provide specialized training in Tool Engineering, CAD/CAM/CAE, CIVIL Engineering Courses, Mechatronics, Robotics, VLSI & Embedded Systems. The Institute was established in the year 1968 by Govt. of India with the assistance of UNDP and ILO. CITD invites applications from the eligible candidates for the following posts, purely on consolidated payment and on contract basis, which is renewable based on yearly performance review.

**FACULTY-CIVIL**

**QUALIFICATION:** M.E/M.Tech, B.E/B.Tech in Civil Engineering or its equivalent.
**ESSENTIAL SKILLS:** Minimum 1 Year Experience in giving training on Autocad Civil, Staad Pro, Revit Architecture, Revit Structure and 3DS Max etc.

**FACULTY-ESDM**

**QUALIFICATION:** 1.M.Tech in Embedded systems 2. M.Tech in Power Electronics 3. M.Tech in Computer Science.
**EXPERIENCE:** 2 Years Experience in reputed Institutions or Industries preferred.
**SKILLS REQUIRED: (1)** To give training on Arduino, Raspberry Pi, ARM-9 and Python Programming. **(2)** To give training on Power Electronics, PID Drives and DSP. **(3)** To give training on Machine Learning and Data Analytics.

**Consultant - Entrepreneurship Development Cell (EDC)**

**Qualification:** MBA/PGDM in HR or its equivalent
**Experience :** Minimum 2 Years of Experience in EDC Cell.
**Skills Required:** Good communication skills, ability to interact with entrepreneurs and create mentorship scheme for student entrepreneurship.

Candidates fulfilling the eligibility criteria may step-in for walk-in interview to be held on **28.12.2019 (10.00 AM to 11.00 AM. Registration Time)** with one passport size photo, original documents & one self-attested photocopies of all certificates.
**NOTE :** Salary commensurate with qualification and experience.

Sd/-
PRINCIPAL DIRECTOR

# 'ఎన్పీఆర్'కు కేబినెట్ ఓకే

- జనగణనకు రూ. 8.754 కోట్లు, ఎన్పీఆర్‌కు రూ. 3,941 కోట్లు
- ఎన్పీఆర్ నమోదు ప్రక్రియ కొత్తది కాదు; ఎన్నార్సీతో సంబంధం లేదు
- కేంద్ర సమాచార మంత్రి జవదేకర్


కేబినెట్ నిర్ణయాలను మీడియాకు వెల్లడిస్తున్న మంత్రులు గోయల్, జవదేకర్

**సాక్షి, న్యూఢిల్లీ:** పౌరసత్వ సవరణ చట్టంపై ఒక వైపు తీవ్రస్థాయిలో ఆందోళనలు చెలరేగుతున్న తరుణంలోనే.. ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర కేబినెట్ మంగళవారం జాతీయ జనాభా పట్టిక (నేషనల్ పాపులేషన్ రిజిస్టర్– ఎన్పీఆర్)ను తాజాగా సవరించేందుకు(అప్‌డేట్) రూ. 3,941.35 కోట్లు కేటాయిస్తూ నిర్ణయం తీసుకుంది. 2020 ఏప్రిల్– సెప్టెంబర్ మధ్య జరిగే 'జనగణన – 2021' తొలి దశతో పాటు ఎన్పీఆర్‌ను అప్‌డేట్ చేసే ప్రక్రియ ప్రారంభమవుతుంది. దేశంలోని 'సాధారణ నివాసుల' వివరాలను ఈ ఎన్పీఆర్‌లో నమోదు చేస్తారు. ఆరు నెలలు లేదా అంతకన్నా ఎక్కువ కాలం పాటు ఒక చోట నివాసం ఉన్న వ్యక్తి లేదా కనీసం రానున్న ఆరునెలలు ఒక ప్రాంతంలో నివాసం ఉండాలని నిర్ణయించుకున్న వ్యక్తిని 'సాధారణ నివాసి'గా పరిగణిస్తారు. మొదట 2010లో జాతీయ జనాభా పట్టికను రూపొందించగా, 2015లో ఇంటింటి సర్వే ద్వారా దీన్ని అప్‌డేట్ చేశారు. 2021 జనాభా గణనకు రంగం సిద్ధమవుతున్న నేపథ్యంలో.. జనాభా పట్టికను సవరించేందుకు తాజాగా నిర్ణయం జరిగింది. అస్సాం మినహా మిగిలిన అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఈ కార్యక్రమం జరగనుంది.

### ఎన్నార్సీతో సంబంధం లేదు

ఎన్పీఆర్‌ను 2010లోనే రూపొందించారని కేంద్ర సమాచార ప్రసార శాఖ మంత్రి ప్రకాష్ జవదేకర్ తెలిపారు. యూపీఏ హయాంలో పౌరసత్వ చట్టం–1955 లోని నిబంధనల కింద 2010లోనే ఎన్పీఆర్ ప్రక్రియ ప్రారంభమైందని, 2015లో ఒకసారి అప్‌డేట్ అయిందని వివరించారు. అప్పుడు ఆధార్‌తో అనుసంధానం చేశారన్నారు. తాజాగా, ఆ జాబితాను అప్‌డేట్ చేస్తున్నామని వివరించారు. ఎన్పీఆర్ ఆధారంగానే ఎన్నార్సీ( జాతీయ పౌర పట్టిక) ప్రక్రియ చేపడ్తారన్న ఆందోళనలను ఆయన తోసిపుచ్చారు. ఎన్పీఆర్‌కు ఎన్నార్సీకి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో జరిగిన కేబినెట్ భేటీ నిర్ణయాలను మరో మంత్రి పియూష్ గోయల్‌తో కలిసి ఆయన వెల్లడించారు. 'ఎన్పీఆర్ ప్రక్రియలో ఎలాంటి ధ్రువీకరణలు సమర్పించాల్సిన అవసరం లేదు. అలాగే బయోమెట్రిక్ ముద్రలు కూడా అవసరం లేదు. ఇదొక స్వీయ ధ్రువీకరణ వంటిదే. కేంద్ర సంక్షేమ పథకాలను అవసరమైన వారందరికీ చేర్చే లక్ష్యంతో ఈ ఎన్పీఆర్ ప్రక్రియ ఉంటుంది. గతంలో మాదిరిగా పెద్ద దరఖాస్తు నింపాల్సిన పనేమీ లేదు. మొబైల్ యాప్ ద్వారా సులువుగా నింపే వెసులుబాటు ఉంటుంది' అని వెల్లడించారు. అయితే, జనగణన కమిషనర్ అధికారిక వెబ్‌సైట్లో మాత్రం ఎన్పీఆర్ కోసం బయోమెట్రిక్ వివరాలను కూడా సేకరిస్తామని ఉండటం గమనార్హం. గతంలో తమిళనాడు, పశ్చిమబెంగాల్, ఒడిశా తదితర రాష్ట్రాలు ఎన్పీఆర్ డేటాను సంక్షేమ పథకాల లబ్ధిదారులను గుర్తించేందుకు ఉపయోగించుకున్నాయని జవదేకర్ గుర్తు చేశారు. ఎన్పీఆర్ డేటాను ఆయుష్మాన్‌భారత్, ప్రధాన మంత్రి ఆవాస్‌యోజన, ఉజ్వల, సౌభాగ్య తదితర కేంద్ర పథకాల లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు ఉపయోగిస్తామన్నారు. పశ్చిమబెంగాల్, కేరళసహా కొన్ని బీజేపీ అధికారంలో లేని రాష్ట్రాలు ఎన్పీఆర్ కార్యక్రమంలో పాలు పంచుకోబోమని ప్రకటించిన విషయాన్ని గుర్తుచేయగా.. 'ఈ ప్రక్రియకు సంబంధించి అన్ని రాష్ట్రాలు నోటిఫికేషన్‌లను విడుదల చేశాయి. దీనికి సంబంధించి అధికారులకు శిక్షణనివ్వడం కూడా ప్రారంభించాయి' అని జవదేకర్ సమాధానమిచ్చారు.

### 'జనగణన'కు ఆమోదం

దేశ జనాభాను లెక్కించేందుకు ఉద్దేశించిన జనగణన– 2021 కార్యక్రమానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇందుకు రూ. 8,754.23 కోట్ల అంచనా వ్యయాన్ని ఆమోదించింది. ఇది దేశంలో జరిగే 16వ జనగణన. స్వాతంత్ర్యం వచ్చాక జరుగుతున్న 8వ జనగణన. ఈ జనగణన దేశమంతటా చేస్తారు. జనగణన రెండు విడతలుగా జరుగనుంది. తొలి దశలో 2020 ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు కుటుంబాల గణన, 2021 ఫిబ్రవరి 9 నుంచి 28 వరకు మొత్తం జనాభా గణన ఉంటుంది. మొబైల్ యాప్ ద్వారా డేటా సేకరిస్తుండడంతో జనగణన వివరాలను ప్రకటించే అవకాశముంది.

### ఎన్నార్సీకి ఎన్పీఆర్‌తో లింక్: కాంగ్రెస్

ఎన్నార్సీకి ఎన్పీఆర్‌తో లింక్ పెట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. ఈ చర్య రాజ్యాంగంలోని లౌకికభావనకు భంగకరమని కాంగ్రెస్ పేర్కొంది. ఎన్పీఆర్‌కు, ఎన్నార్సీకి ఏమాత్రం సంబంధం లేదంటూ హోం మంత్రి అమిత్‌షా చేస్తున్న ప్రకటన..ఎన్నార్సీపై పార్లమెంట్‌లో చర్చించలేదంటూ ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్య కంటే పెద్ద అబద్ధమని కాంగ్రెస్ నేత అజయ్ మాకెన్ విమర్శించారు. ఎన్నార్సీకి మొదటి మెట్టు ఎన్పీఆర్ అంటూ హోం శాఖ తన వార్షిక నివేదికలో తెలిపిందన్నారు. 2021లో జనగణనతోపాటుగా ఎన్పీఆర్ చేపట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు.

## ఎన్పీఆర్ వర్సెస్ సెన్సస్!



**సాక్షి, న్యూఢిల్లీ:** జనగణన–2021కి, జాతీయ జనాభా పట్టిక(ఎన్పీఆర్)కు రంగం సిద్ధమైంది. ఈ నేపథ్యంలో జనగణన(సెన్సస్)కు, ఎన్పీఆర్‌కు మధ్య కొన్ని తేడాలను గమనిస్తే...

**జాతీయ జనాభా పట్టిక (ఎన్పీఆర్)**
ఎన్పీఆర్ అంటే దేశంలోని సాధారణ నివాసుల వివరాలతో కూడిన ఒక రిజిస్టర్. పౌరసత్వం చట్టం–1955 పరిధిలో పౌరసత్వ నిబంధనలు, 2003 ఆధారంగా ఈ ఎన్పీఆర్‌ను రూపొందించనున్నారు. ప్రతి సాధారణ పౌరుడి వివరాల డేటాబేస్‌ను రూపొందిస్తారు. ఆరు నెలలు లేదా అంతకన్నా ఎక్కువ కాలం పాటు ఒక చోట నివాసం ఉన్న వ్యక్తి లేదా కనీసం రానున్న ఆరునెలలు ఒక ప్రాంతంలో నివాసం ఉండాలని నిర్ణయించుకున్న వ్యక్తిని 'సాధారణ నివాసి'గా పరిగణిస్తారు. స్థానిక(గ్రామ/మండల), తాలూకా, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ఎన్పీఆర్‌ను అప్‌డేట్ చేస్తారు. ఎన్పీఆర్‌లో వ్యక్తి పేరు, నివాస స్థితి, కుటుంబ యజమానితో గల బంధుత్వం, లింగ భేదం, పుట్టిన తేదీ, వైవాహిక స్థితి, విద్యార్హత, వృత్తి, తల్లిదండ్రులు లేదా భాగస్వాముల పేర్లు, జన్మస్థలం, జాతీయత, ప్రస్తుత చిరునామా, ఎంతకాలంగా ప్రస్తుత చిరునామాలో ఉంటున్నారు, శాశ్వత చిరునామా వంటి 14 అంశాలను పూరించాల్సి ఉంటుంది. ప్రతీ పౌరుడు ఈ పట్టికలో నమోదు కావాల్సిందే. వారికి జాతీయ గుర్తింపు కార్డును ఇస్తారు. సాధారణ నివాసుల సమగ్ర వివరాలున్న డేటాబేస్‌ను రూపొందించేందుకు ఎన్పీఆర్‌ను రూపకల్పన చేశారు. ఈ డేటాబేస్‌లో ఆ నివాసుల ఇతర, బయోమెట్రిక్ వివరాలుంటాయి.

**జనగణన (సెన్సస్):** ఎన్పీఆర్‌తో పోలిస్తే జనగణనలో మరిన్ని వివరాలను సేకరిస్తారు. వ్యక్తి గృహ వివరాలు, ఇంటి నిర్మాణం, కుటుంబ సభ్యుల పూర్తి వివరాలు, గృహోపకరణాల వివరాలు, పూర్తి ఆదాయ మార్గాలు, వ్యవసాయ– వ్యవసాయేతర వర్గాలు, సాగు, తాగు నీటి లభ్యత, వ్యవసాయ విధానం, వాణిజ్య వర్గాలు, ఎస్సీ, ఎస్టీ వివరాలు, భాష, మతం, దివ్యాంగత.. తదితర పూర్తి సమాచారాన్ని నమోదు చేస్తారు. జనగణన– 2021ని రెండు దశల్లో పూర్తి చేయనున్నారు. 2020 ఏప్రిల్– సెప్టెంబర్ మధ్య తొలి దశను పూర్తి చేస్తారు. ఈ దశలో కుటుంబ సమగ్ర వివరాలను నమోదు చేస్తారు. 2021 ఫిబ్రవరి 9 – 28 మధ్య రెండో దశ నమోదు జరుగుతుంది. ఆ దశలో వర్గాల వారీగా మొత్తం జనాభా సంఖ్యను గణిస్తారు.

### ఎన్నార్సీ అంటే..

చట్ట ప్రకారం భారతీయ పౌరులుగా నమోదైన వారి జాబితాయే జాతీయ పౌర పట్టిక(నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజన్స్, ఎన్నార్సీ). ఇందులో 1955 పౌరసత్వ చట్టం ప్రకారం..భారతీయ పౌరులుగా అర్హత పొందిన వారి పేర్లతోపాటు వారికి సంబంధించిన ఇతర వివరాలు కూడా పొందుపరచబడి ఉంటాయి. ఈ పట్టికను మొట్టమొదటిసారిగా 1951లో ప్రభుత్వం రూపొందించింది. ఇప్పటి వరకు దానిని మళ్లీ అప్‌గ్రేడ్ చేయలేదు. అయితే, ఇది అస్సాంలో మాత్రమే ఎప్పటికప్పుడు వివిధ కారణాలతో అప్‌గ్రేడ్ అవుతోంది.

**భారతీయ పౌరుడంటే ఎవరు?**
1955 పౌరసత్వ చట్టం ప్రకారం.. ఈ దేశంలో పుట్టిన ప్రతి వ్యక్తి భారతీయ పౌరుడే. దీని ప్రకారం.. ఎ) 1950 జనవరి 26వ తేదీన కానీ, అంతకుపూర్వం కానీ..1987 జూలై 1వ తేదీకి ముందు జన్మించిన వారు భారతీయ పౌరులు.

బి) 1987 జూలై 1వ తేదీన కానీ, అంతకు ముందు పుట్టిన వారు. అయితే.. 2003లో సవరించిన పౌరసత్వ నిబంధనలు అమల్లోకి రాకముందు జన్మించిన వారు; తల్లిదండ్రుల్లో ఏ ఒక్కరు ఆ సమయానికి భారత పౌరులై ఉన్నా..

సి) 2003లో సవరించిన పౌరసత్వ నిబంధనలు అమల్లోకి వచ్చిన తర్వాత జన్మించిన వారు; తల్లిదండ్రులిద్దరూ పౌరులై ఉన్నా లేక తల్లిదండ్రులిద్దరిలో ఒకరు అక్రమ వలసదారు కాకున్నా పౌరుడిగానే పరిగణింపబడతారు.

## క్లుప్తంగా...

### బస్సు లోయలో పడి 28 మంది మృతి

**పాలెంబాంగ్ (ఇండోనేసియా):** ఇండోనేసియాలోని సుమత్రా దీవిలో బస్సు లోయలో పడి 28 మంది మృత్యువాత పడ్డారు. దక్షిణ సుమత్రా ప్రావిన్స్‌లోని పగరాలం జిల్లాలో సోమవారం అర్ధరాత్రి బస్సు బ్రేకులు పనిచేయకపోవడంతో ఈ ప్రమాదం జరిగిందని అక్కడి పోలీసులు తెలిపారు. బస్సు అదుపు తప్పి 262 అడుగుల లోతున్న లోయలోని నదిలో పడిపోయిందని పోలీసులు చెప్పారు.

### నేడు వాజ్‌పేయి విగ్రహాన్ని ఆవిష్కరించనున్న మోదీ

**లక్నో:** మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతి సందర్భంగా లక్నోలోని లోక్ భవన్‌లో ఆయన విగ్రహాన్ని ప్రధాని మోదీ బుధవారం ఆవిష్కరించనున్నారు. వాజ్‌పేయి విగ్రహావిష్కరణ అనంతరం లక్నోలో కొత్తగా ఏర్పాటు కానున్న వాజ్‌పేయి వైద్య విశ్వవిద్యాలయానికి మోదీ శంకుస్థాపన చేయనున్నారు.

### కశ్మీర్ నుంచి బలగాలు వెనక్కి

**న్యూఢిల్లీ:** జమ్మూకశ్మీర్ నుంచి ఏడువేల మంది పారామిలటరీ బలగాలను ఉపసంహరించాలని కేంద్ర హోం శాఖ నిర్ణయించింది. తాజా పరిస్థితులను సమీక్షించిన తర్వాత తక్షణమే ఈ బలగాలను ఉపసంహరిస్తున్నట్లు మంగళవారం తెలిపింది.

### పైపైకి హిందూ సముద్ర మట్టం

**టొరంటో:** గత రెండు శతాబ్దాల్లో హిందూ మహాసముద్రం మధ్యప్రాంతాల్లోని మట్టాలు సుమారు ఒక మీటర్ వరకూ పెరిగినట్లు అంతర్జాతీయ అధ్యయనం ఒకటి స్పష్టం చేసింది. ఫలితంగా హిందూ మహా సముద్ర ప్రాంతంలోని తీర ప్రాంత నగరాలకు, ప్రజలకు తీవ్రమైన ముప్పు పొంచి ఉందని ఈ అధ్యయనం హెచ్చరిస్తోంది. సముద్ర మట్టాల పెరుగుదల ఇదే రీతిన మరో వందేళ్లపాటు కొనసాగితే హిందూ మహాసముద్రం మట్టం ఎన్నడూలేనంతటి అత్యధిక స్థాయి ఎత్తుకు చేరుతుందని శాస్త్రవేత్తలు హెచ్చరించారు. నేచర్ జియోసైన్సెస్ తాజా సంచికలో ప్రచురితమైన పరిశోధన పత్రం గతంలో సముద్రమట్టాల పెరుగుదల ఎలా ఉందన్న అంశంపై ఆసక్తికరమైన వివరాలను వెల్లడించింది.

### అఫ్గాన్‌లో వంద మంది ఉగ్రవాదుల హతం

**కాబూల్:** అఫ్గానిస్తాన్ ప్రభుత్వం ఉగ్రవాదుల వేట మొదలుపెట్టింది. గత 24 గంటలుగా దేశంలోని పలు ప్రాంతాలలో అఫ్గాన్ బలగాలు దాడులు కొనసాగిస్తున్నాయి. ఈ దాడుల్లో 100పైగా ఉగ్రవాదులు హతమయ్యారని, మరో 45 మంది తీవ్రంగా గాయపడ్డారని అఫ్గానిస్తాన్ రక్షణ శాఖ వెల్లడించింది. 15 ప్రాంతాలలో 18 ఆపరేషన్లు చేపట్టామని రక్షణ శాఖ ప్రకటించింది. అయితే మృతి చెందిన ఉగ్రవాదులు ఏ వర్గానికి చెందినదీ వెల్లడించలేదు. ఉత్తర అఫ్గానిస్తాన్‌లో మంగళవారం తెల్లవారుజామున జరిగిన ఉగ్రదాడిలో ఏడుగురు అఫ్గాన్ సైనికులు మరణించారని రక్షణ శాఖ తెలిపింది. బాల్ఖ్ ప్రావిన్స్ జిల్లా దౌలతాబాద్‌లో జరిగిన ఈ దాడిలో మరో ఆరుగురు భద్రతా సిబ్బంది తీవ్రంగా గాయపడ్డారని ప్రకటించింది.

# చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్‌కు లైన్ క్లియర్

- 'భద్రత' కేబినెట్ కమిటీ ఆమోదం
- తొలి సీడీఎస్‌గా బిపిన్ రావత్?



**న్యూఢిల్లీ:** రక్షణ వ్యవహారాల్లో కేంద్ర ప్రభుత్వానికి సలహాలివ్వనున్న 'చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్(సీడీఎస్)' పదవి ఏర్పాటుకు భద్రత వ్యవహారాల కేబినెట్ కమిటీ మంగళవారం ఓకే చెప్పింది. కార్గిల్ రివ్యూ కమిటీ 1999లో ఇచ్చిన సూచన మేరకు సీడీఎస్ నియామకాన్ని చేపట్టనున్నట్లు కేంద్ర సమాచార ప్రసార శాఖల మంత్రి ప్రకాశ్ జవదేకర్ తెలిపారు. సీడీఎస్‌గా నియమితులయ్యే వారు నాలుగు నక్షత్రాలతో కూడిన జనరల్ స్థాయి అధికారి అయి ఉంటారని, త్రివిధ దళాధిపతులతో సమానమైన వేతనాన్ని పొందుతారని మంత్రి తెలిపారు. సీడీఎస్ వ్యవస్థ మౌలిక సూత్రాలు, బాధ్యతలపై జాతీయ భద్రత సలహాదారు అజిత్ ధోవల్ నేతృత్వంలోని ఉన్నతస్థాయి కమిటీ ఇచ్చిన నివేదికనూ భద్రత వ్యవహారాల కేబినెట్ కమిటీ మంగళవారం ఆమోదించిందని అధికారులు తెలిపారు.

**తొలి సీడీఎస్‌గా బిపిన్ రావత్?**
దేశ రక్షణ రంగానికి తలమానికంగా చెప్పుకునే సీడీఎస్ పదవికి ఆర్మీ చీఫ్ బిపిన్ రావత్‌ను ఎంపిక చేసే అవకాశాలున్నాయి. ఈ నెల 31న రావత్ ఆర్మీ చీఫ్‌గా రిటైర్‌కానున్నారు. సీడీఎస్ హోదా త్రివిధ దళాల అధిపతులకు సమానంగా ఉంటుందని, ప్రోటోకాల్ ప్రకారం ఆయన త్రివిధ దళాల కంటే ఎక్కువ స్థాయిలో ఉంటారని అధికారులు వివరించారు. ఆర్మీ, వాయు, నావికాదళాలు కలిసికట్టుగా పనిచేసేలా చేయడం అందుకు తగిన ఏర్పాట్లు చేయడం సీడీఎస్ ప్రధాన బాధ్యత.

**రూ. 6 వేల కోట్లతో అటల్ భూజల్ యోజన**
ఐదేళ్లపాటు ఏడు రాష్ట్రాల్లో అమలయ్యే కేంద్ర ప్రాయోజిత పథకం అటల్ భూజల్ (అటల్ జల్) పథకాన్ని రూ. 6 వేల కోట్లతో అమలు చేసేందుకు కేబినెట్ ఓకే చెప్పింది. సామాజిక భాగస్వామ్యంతో భూగర్భ జలాల యాజమాన్యం కోసం ఈ పథకాన్ని రూపొందించారు. గుజరాత్, హరియాణా, కర్ణాటక, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో ఈ పథకాన్ని అమలు చేయనున్నారు.

**స్వదేశ్ దర్శన్ ప్రాజెక్టులకు నిధులు:** స్వదేశ్ దర్శన్ పథకంలో భాగంగా పలు ప్రాజెక్టులకు నిధులను మంజూరు చేసేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. 2019–20 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కొత్త ప్రాజెక్టులకు గాను అదనంగా రూ. 1854.67 కోట్లను మంజూరు చేసేందుకు అంగీకరించింది. దేశాన్ని అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా మార్చేందుకు వీలుగా పర్యాటక మౌలిక వసతుల స్థాపన ఈ పథకం ముఖ్య ఉద్దేశం. ఈ స్కీమ్‌లో మొత్తం 15 సర్క్యూట్లు ఉన్నాయి.

### రైల్వేలో సంస్థాగత మార్పులు

**సాక్షి, న్యూఢిల్లీ:** భారతీయ రైల్వే సంస్థాగత పునర్నిర్మాణానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. సంబంధిత వివరాలను రైల్వే మంత్రి పీయూష్ గోయల్ ఢిల్లీలో మీడియాకు చెప్పారు. సంస్థాగత పునర్నిర్మాణంలో భాగంగా రైల్వే విభాగానికి సంబంధించి ఎనిమిది గ్రూప్–ఏ సర్వీసులను ఏకీకృతం చేసి ఇండియన్ రైల్వే మేనేజ్‌మెంట్ సర్వీసెస్(ఐఆర్ఎంఎస్)గా పరిగణించాలని నిర్ణయించారు. రైల్వే బోర్డును పునర్ వ్యవస్థీకరించాలని నిర్ణయించారు. ఇకపై రైల్వే బోర్డు చైర్మన్ నేతృత్వంలో నలుగురు సభ్యులు, ఇద్దరు స్వతంత్ర సభ్యులు ఉంటారు. ఇండియన్ రైల్వే మెడికల్ సర్వీసెస్‌ను ఇండియన్ రైల్వే హెల్త్ సర్వీసెస్(ఐఆర్‌హెచ్ఎస్)గా మార్చనున్నారు.

### రూ. 237 కోట్ల రద్దైన నోట్లను మార్చిన శశికళ

**సాక్షి ప్రతినిధి, చెన్నై:** కేంద్ర ప్రభుత్వం పెద్దనోట్లను రద్దుచేసిన సమయంలో తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, దివంగత జయలలిత నెచ్చెలి శశికళ ఒక పారిశ్రామికవేత్తను బెదిరించి చెల్లనినోట్లను ఇచ్చి ఆస్తులను కొనుగోలుచేశారని వెల్లడైంది. ప్రభుత్వ పౌష్టికాహార కాంట్రాక్టర్‌ను బెదిరించి రూ. 237 కోట్ల రద్దైన నోట్లకు వడ్డీ సహా కొత్తనోట్లను చెల్లించేలా ఒప్పందం చేసుకున్న సంగతిని కోర్టుకు సమర్పించిన పత్రం ద్వారా ఐటీశాఖ బయటపెట్టింది. నోట్ల రద్దప్పుడు శశికళ ఒక పారిశ్రామికవేత్తను బెదిరించి రద్దైన నోట్లను అందజేసి రూ.1,674 కోట్ల ఆస్తులను కొన్నట్లు పేర్కొంది. 'రుణం కింద రూ.240 కోట్ల పాత నోట్లిస్తాం. బదులుగా ఏడాది తర్వాత 6 శాతం వడ్డీ సహా కొత్త నోట్లను చెల్లించాలని డీల్ కుమారస్వామి అనే వ్యాపారితో శశికళ ఒప్పందం కుదుర్చుకుంది' అని ఐటీశాఖ పేర్కొంది.

# 29న సీఎంగా హేమంత్ ప్రమాణం

**జేఎంఎం శాసనసభా పక్ష నేతగా ఎన్నికైన హేమంత్ సోరెన్**


ప్రభుత్వ ఏర్పాటును కోరుతూ గవర్నర్ ద్రౌపది ముర్ముకు లేఖ ఇస్తున్న హేమంత్

**రాంచీ/న్యూఢిల్లీ:** జార్ఖండ్ ముక్తిమోర్చా(జేఎంఎం) నేత హేమంత్ సోరెన్(44) ఈ నెల 29వ తేదీన జార్ఖండ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. మంగళవారం సాయంత్రం హేమంత్ సోరెన్, సంకీర్ణంలోని కాంగ్రెస్, రాష్ట్రీయ జనతాదళ్(ఆర్జేడీ) తదితర పార్టీల నేతలతో కలిసి రాజ్‌భవన్‌లో గవర్నర్ ద్రౌపది ముర్మును కలిశారు. తమకు ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు అవకాశం ఇవ్వాలని కోరగా గవర్నర్ అంగీకరించారని, ఈ నెల 29వ తేదీన మధ్యాహ్నం ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు అనంతరం హేమంత్ సోరెన్ తెలిపారు. పౌరసత్వ సవరణ చట్టంపై ఓ వార్తా సంస్థతో ఆయన మాట్లాడుతూ..ఈ చట్టం కారణంగా తమ రాష్ట్రంలోని ఏ ఒక్కరికి నష్టం జరిగే అవకాశమున్నా అమలు చేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. అంతకుముందు జేఎంఎం ఎమ్మెల్యేలు సమావేశమై పార్టీ వర్కింగ్‌గా ఉన్న ప్రెసిడెంట్ హేమంత్ సోరెన్‌ను పార్టీ శాసనసభా పక్ష నేతగా ఎన్నుకున్నారు. ఆ తర్వాత ఆయన కాంగ్రెస్, ఆర్జేడీ నేతలతోపాటు కూటమికి మద్దతు ప్రకటించిన జార్ఖండ్ వికాస్ మోర్చా(ప్రజాతాంత్రిక్) చీఫ్ బాబూలాల్ మరాండీతో కూడా సమావేశం అయ్యారు. ఎన్నికలకు ముందే ఏర్పాటైన జేఎంఎం– కాంగ్రెస్– ఆర్జేడీ కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థిగా హేమంత్ సోరెన్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. ఇటీవలి ఎన్నికల్లో శాసనసభలోని 81 స్థానాలకు గాను సంకీర్ణానికి 47 సీట్లు దక్కిన విషయం తెలిసిందే.

**బీజేపీ క్షీణతకు నిదర్శనం జార్ఖండ్:పవార్**
**ముంబై:** దేశవ్యాప్తంగా బీజేపీ ప్రాభవం తగ్గుతోందని జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలతో తేలిపోయిందని ఎన్సీపీ చీఫ్ శరద్ పవార్ వ్యాఖ్యానించారు. జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన జేఎంఎం నేత, జార్ఖండ్ కాబోయే ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌కు శరద్ పవార్ శుభాకాంక్షలు తెలిపారు. దీనిపై హేమంత్ ట్విట్టర్‌లో స్పందిస్తూ..మహారాష్ట్రలో పవార్ సాగించిన పోరాటం తమకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.



క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం ఒడిశాలోని పూరీ నగరంలోని సముద్ర తీరంలో కళాకారుడు సుదర్శన్ పట్నాయక్ చెక్కిన సైకత శిల్పమిది. 'పర్యావరణ మార్గంలో నడుద్దాం' అనే సందేశంతో ఈ సైకత శిల్పాన్ని రూపొందించారు.

# రాహుల్, ప్రియాంకలను ఆపేశారు

- 'పౌర' ఆందోళనల బాధితుల పరామర్శకు వెళ్తుండగా మీరట్‌లో అడ్డుకున్న పోలీసులు


రాహుల్, ప్రియాంకల వాహనాన్ని అడ్డుకున్న పోలీసులు

**న్యూఢిల్లీ/కోల్‌కతా/బిజ్నోర్/మీరట్:** ఉత్తర ప్రదేశ్‌లోని మీరట్‌లో గత వారం 'పౌర' ఆందోళనల్లో మృతుల కుటుంబాలను పరామర్శించేందుకు వచ్చిన కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్, ప్రియాంక గాంధీలను మీరట్ పోలీసులు అడ్డుకున్నారు. 'మీరట్‌లో పరిస్థితులు ఉద్రిక్తంగా ఉండటంతో నిషేధాజ్ఞలు విధించాం. అక్కడ ఎలాంటి అవాంఛనీయ ఘటన జరిగినా బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపాం. దీంతో వారే వెనక్కి వెళ్లిపోయారు' అని పోలీసులు తెలిపారు. 'సంబంధిత ఉత్తర్వులను చూపాలని పోలీసులను అడిగాం. అవేమీ చూపకుండా వారు మమ్మల్ని వెనక్కి వెళ్లాలన్నారు' అని రాహుల్, ప్రియాంక మీడియాతో అన్నారు.

**'పౌర' చట్టంపై ఏకమైన విద్యార్థి సంఘాలు**
పౌరసత్వ చట్ట సవరణతోపాటు, కేంద్రం చేపట్టదలచిన జాతీయ పౌర పట్టిక, జనాభా పట్టిక సవరణలకు వ్యతిరేకంగా ఉద్యమించేందుకు దేశ వ్యాప్తంగా ఉన్న 70 యువ, విద్యార్థి సంఘాలు ఏకమయ్యాయి. నేషనల్ యంగ్ ఇండియా కోఆర్డినేషన్ అండ్ కాంపెయిన్ (వైఐఎన్‌సీసీ) ఛత్రం కింద ఈ సంఘాలు మంగళవారం ఏకమయ్యాయి. 71వ గణతంత్ర దినోత్సవాలకు ముందుగానే కేంద్రం పౌరసత్వ సవరణ చట్టాన్ని వెనక్కు తీసుకోవాలని వైఐఎన్‌సీసీ సభ్యుడు సాయి బాలాజీ డిమాండ్ చేశారు.

**అతడు మా కాల్పుల్లోనే చనిపోయాడు**
'పౌర' ఆందోళనల సందర్భంగా ఒక యువకుడి మృతికి తామే కారణమని ఉత్తరప్రదేశ్‌లోని బిజ్నోర్ పోలీసులు అంగీకరించారు. బిజ్నోర్‌లోని నహ్‌తౌర్‌లో హింసాత్మకంగా మారిన ఆందోళనలను అదుపు చేసేందుకు కాల్పులు జరపాల్సి వచ్చిందని ఎస్పీ విశ్వజీత్ శ్రీవాస్తవ మంగళవారం వెల్లడించారు. కాగా, ఎన్నార్సీపై ప్రధాని నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా చేస్తున్న ప్రకటనలు పొంతనలేకుండా ఉన్నాయని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వ్యాఖ్యానించారు.

### బెంగాల్ గవర్నర్‌కు చుక్కెదురు

బెంగాల్ గవర్నర్ జగ్‌దీప్ ధంఖర్ మరోసారి భంగపాటుకు గురయ్యారు. కోల్‌కతాలో జాదవ్‌పూర్ వర్సిటీ స్నాతకోత్సవానికి హాజరయ్యేందుకు బయలుదేరిన ఆయన్ను ఆందోళనకారులు అడ్డుకున్నారు. ఎన్నార్సీకి వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న టీఎంసీ అనుబంధ విద్యార్థి సంఘం కార్యకర్తలు ఆయన వాహనం వర్సిటీలోకి ప్రవేశించకుండా మెయిన్ గేట్ వద్దే రోడ్డుపై బైఠాయించారు. గో బ్యాక్ అని నినాదాలు చేసుకుంటూ, నల్ల జెండాలు ప్రదర్శించారు. దీంతో యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ అయిన సురంజన్ దాస్‌కు గవర్నర్ ఫోన్ చేశారు. ఆందోళనకారులను శాంతింప జేయాలని సురంజన్‌ను కోరారు. ఫలితం లేకపోవడంతో గవర్నర్ వెనుదిరిగారు. ఈ సందర్భంగా ధంకర్ మమత ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని మండిపడ్డారు.

### 77 కేజీల బంగారు నగలు చోరీ

**బెంగళూరు ముత్తూట్ ఫైనాన్స్‌లో ఘటన**

**కృష్ణరాజపురం:** బెంగళూరులో అత్యంత భారీ చోరీ చోటుచేసుకుంది. ఏకంగా 77 కేజీల బంగారాన్ని దొంగలు ఎత్తుకెళ్లారు. బెంగళూరు పులకేశినగర్ పోలీసుస్టేషన్ పరిధిలోని బాణసవాడి–హెణ్ణూరు రోడ్‌లోని లింగరాజపురం బ్రిడ్జి దగ్గర్లో ముత్తూట్ ఫైనాన్స్ కార్యాలయం ఉంది. ఇందులో తమ వినియోగదారులకు వారి బంగారం కుదువ పెట్టుకుని నగదు ఇస్తుంటారు. ఈ కార్యాలయంలో భారీగా బంగారం ఉంటుందని భావించిన దుండగులు శనివారం రాత్రి గోడకు కన్నమేసి లోపలికి చొరబడ్డారు. బంగారం భద్రపరిచిన బీరువాలను గ్యాస్ కట్టర్‌లతో కత్తిరించారు. అందులోని 77 కేజీల బంగారు ఆభరణాలు దోచుకెళ్లారు. పోలీసులకు ఆధారాలు దొరక్కుండా ఉండేందుకు ముందుగా సీసీ కెమెరాలను తొలగించారు. పోలీసులు కేసు నమోదు చేసి ప్రత్యేక బృందంతో దర్యాప్తు చేపట్టారు. చోరీ జరిగిన తీరు చూసి తెలిసిన వ్యక్తుల పనిగా పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు.

సాక్షి
బుధవారం, డిసెంబర్, 25

# ఎన్‌పీఆర్‌కు పచ్చజెండా

ఒకపక్క వివిధ రాష్ట్రాల్లో జాతీయ పౌర నమోదు చిట్టా(ఎన్‌సీఆర్)కు వ్యతిరేకంగా నిరసనలు వెల్లువెత్తుతుండగా మంగళవారం జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశం జాతీయ జనాభా పట్టిక (ఎన్‌పీఆర్) ప్రక్రియ అమలు ప్రతిపాదనను ఆమోదించింది. ఇందుకోసం రూ. 3,941 కోట్లు కేటాయించింది. ఎన్‌సీఆర్ వ్యతిరేక ఆందోళనల నేపథ్యం కావొచ్చు... కేంద్ర మంత్రివర్గ నిర్ణయాలను ప్రకటిస్తూ ఎన్‌పీఆర్‌కూ, ఎన్ఆర్‌సీకీ సంబంధం ఉండబోదని కేంద్ర మంత్రులు ప్రకాష్ జావ్డేకర్, పీయూష్ గోయెల్ తెలిపారు. విధాన నిర్ణయాలకు ఉపయోగపడుతుందన్న ఉద్దేశంతోనే ఎన్‌పీఆర్ అమలు చేస్తున్నామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా ఒక ఇంటర్వ్యూలో వివరించారు. ఆయన కూడా ఎన్‌పీఆర్–ఎన్ఆర్‌సీల మధ్య ఏ సంబంధమూ ఉండబోదని హామీ ఇచ్చారు. ఎన్‌పీఆర్‌కు సంబంధించిన సమాచార సేకరణ వచ్చే ఏడాది ఏప్రిల్‌లో ప్రారంభమై సెప్టెంబర్‌లో ముగుస్తుంది. తొలిసారి దీన్ని 2010లో అప్పటి యూపీఏ ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. 2015లో ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని అమలు చేసి ఎన్‌డీఏ ప్రభుత్వం ఆ ఎన్‌పీఆర్‌ను నవీకరించింది. ఎన్‌పీఆర్ ప్రక్రియ పూర్తయ్యాక 2021లో జనాభా గణన ఉంటుంది. అదే సమయంలో ఆ ఎన్‌పీఆర్ డేటాను నవీకరిస్తారు.

భిన్న అవసరాల కోసం ప్రభుత్వాలు ప్రజలకు సంబంధించిన డేటా సేకరించడం ఎప్పటినుంచో రివాజుగా వస్తోంది. చరిత్ర తిరగేస్తే ఈ సంగతి తెలుస్తుంది. అంతక్రితం మాటెలా ఉన్నా మన దేశంలో మౌర్యుల కాలంలో జనగణన జరిగిందని కౌటిల్యుని అర్థశాస్త్రం చెబుతోంది. అప్పట్లో ఈ జనగణన జరపడానికి కారణం పన్నుల వసూలు విధానాన్ని పటిష్టపరచడమే. బ్రిటిష్ వలస పాలకులు తొలిసారి 1872లో జనగణన నిర్వహించారు. తొలి జనగణనగా దాన్నే పరిగణిస్తున్నారు. 2021లో జరగబోయే జనాభా లెక్కల సేకరణ ఆ ప్రకారం 16వ జనగణన అవుతుంది. ఈ జనగణన మాట అలావుంచి దేశంలో ఉండే పౌరులు, ఇతర నివాసుల వివరాలు ఆధారాలతోసహా సేకరించి అవసరమైనప్పుడల్లా ఆ వివరాలను భిన్న ప్రయోజనాల కోసం ఉపయోగించాలన్న ఆలోచనకు పెద్ద నేపథ్యమేవుంది. 1999లో కార్గిల్ ప్రాంతంలో పాకిస్తాన్ సైనికులు పౌర దుస్తుల్లో చొరబడి కొన్ని ప్రాంతాలను ఆక్రమించడం, మన సైనికులు దాన్ని తిప్పికొట్టి విజయం సాధించడం జరిగాక పౌరులకు గుర్తింపు కార్డు ఇవ్వాలన్న ఆలోచన పుట్టుకొచ్చింది. అప్పటి వాజపేయి ప్రభుత్వం నియమించిన కార్గిల్ సమీక్ష కమిటీ ఈ సూచన చేసింది. సరిహద్దు ప్రాంతాల్లోని వారికి ఈ కార్డులు అందజేయాలన్న ప్రతిపాదన కాస్తా ఆ తర్వాత దేశవ్యాప్తంగా అమలు చేయాలన్న నిర్ణయానికి దారి తీసింది. అందుకోసం 1955 నాటి పౌరసత్వ చట్టాన్ని సవరించి బహుళ ప్రయోజన గుర్తింపు కార్డు (ఎంఎన్ఐసీ) ప్రాజెక్టు, జాతీయ జనాభా పట్టిక(ఎన్‌పీఆర్)లకు చోటిచ్చారు. అయితే 2002లో ఈ రెండు ప్రాజెక్టుల మాటా ఏమైందని పార్లమెంటులో అడిగినప్పుడు అప్పటి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి విద్యాసాగరరావు ఎంఎన్ఐసీకి చట్టబద్ధత కల్పించడంతోసహా ఇందుకు సంబంధించిన అన్ని అంశాలనూ లోతుగా పరిశీలిస్తున్నామని తెలియజేశారు. ఈ ప్రతిపాదనల్లో ఆధార్ మూలాలున్నాయి. ఎంఎన్ఐసీపై ఆ తర్వాత చెప్పుకోదగ్గ అడుగులు పడలేదు. యూపీఏ హయాంలో ప్రణాళికా సంఘం ఆధ్వర్యంలో నందన్ నీలేకని చీఫ్‌గా భారత ప్రత్యేక గుర్తింపు వ్యవస్థ (యూఐడీఏఐ) ఏర్పడి, ఆధార్ కార్డుల జారీ ప్రక్రియ ప్రారంభమైంది. అయితే దాన్ని ప్రారంభించిన ఉద్దేశం పెద్దగా నెరవేరలేదు సరిగదా దానివల్ల పౌరుల వ్యక్తిగత వివరాలు బజార్నపడి అనేక సమస్యలు ఏర్పడ్డాయి. ఆ బృహత్తరమైన ప్రాజెక్టుకు చట్టబద్ధత తీసుకురావాలన్న స్పృహ, అది లీకైన పక్షంలో జవాబుదారీతనం ఎవరు వహించాలో నిర్ణయించాలన్న ఆలోచన కూడా యూపీఏ ప్రభుత్వానికి లేకుండా పోయింది. మరోపక్క కార్డు నమోదు ప్రక్రియకు అనుసరించిన విధానాలవల్ల ఎవరికి పడితే వారికి ఆ కార్డు సంపాదించడం సులభమైపోయింది.

వచ్చే ఏప్రిల్‌లో ప్రారంభం కాబోయే ఎన్‌పీఆర్‌లో 'సాధారణ నివాసుల' వివరాలను సేకరిస్తారు. ఈ నివాసులు మన దేశ పౌరులే అయివుండనవసరం లేదు. ఒక ప్రాంతంలో ఆర్నెల్లుగా నివసిస్తున్నవారు... లేదా వచ్చే ఆరునెలలూ అంతకన్నా ఎక్కువకాలం అక్కడ ఉండదల్చుకున్న ప్రతి ఒక్కరూ ఈ నిర్వచనం పరిధిలోకొస్తారు. వీరంతా ఎన్‌పీఆర్‌లో నమోదుకు అర్హులు. అది తప్పనిసరని నిబంధనలు చెబుతున్నాయి. ఎన్‌పీఆర్ కోసం పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్స్, ఆధార్ కార్డు, వారి తల్లిదండ్రుల జన్మస్థలం వివరాలు అందజేయాల్సివుంటుంది. ఇవన్నీ ఈసారి కొత్తగా పెట్టిన నిబంధనలు. అంతక్రితం పేరు, జెండర్, తల్లిదండ్రుల పేర్లు, కుటుంబ యజమానితో ఉండే సంబంధం, పుట్టిన తేదీ, జాతీయత, చేస్తున్న వృత్తి, చిరునామా వివరాలు మాత్రమే అడిగేవారు. ఏతావాతా గతంలో ఆధార్ కార్డు నమోదుకు అందజేసిన వివరాల్లో చాలా భాగం మళ్లీ ఎన్‌పీఆర్‌లో కూడా ఇవ్వకతప్పదు. అయితే ఈ రెండింటిలోని వివరాలూ సరిపోల్చడం అంత సులభమేమీ కాదు. వేర్వేరు ప్రాజెక్టుల కింద సేకరించే డేటానంతటినీ ఒకే డేటా బేస్‌లో ఉంచగలిగితే తప్ప ఇది సాధ్యం కాదు. ఇప్పుడు ఎన్ఆర్‌సీపై సాగుతున్న నిరసన ఉద్యమాల పర్యవసానంగా ఎన్‌పీఆర్‌కూ, దానికి సంబంధం లేదని, ఈ డేటాను దానికి వినియోగించబోమని అమిత్ షా చెబుతున్నారు. ఎన్‌పీఆర్ కింద నమోదు కానట్టయితే అలాంటివారు అనేక విధాల నష్టపోతారంటున్నారు. ఇన్ని రకాల డేటాను సేకరించడం, దాన్ని నిక్షిప్తం చేయడం, వినియోగించడం వంటివి ప్రభుత్వానికి అవసరమే. కానీ ఆ సేకరిస్తున్న డేటా లీక్ కాకుండా చూడటం, అలా అయినపక్షంలో జవాబుదారీతనం ఎవరిదో నిర్ణయించడం అవసరమని గుర్తించాలి. వ్యక్తిగత డేటా పరిరక్షణకు చట్టం తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వం కూడా సంకల్పించింది. అయితే ఎన్‌పీఆర్ ప్రారంభం కావడానికి ముందే అది సాకారం కావాలి.


## గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, తిథి బ.చతుర్దశి ఉ.11.23 వరకు తదుపరి అమావాస్య, నక్షత్రం జ్యేష్ఠ సా.5.10 వరకు తదుపరి మూల, వర్జ్యం రా.1.10 నుంచి 2.44 వరకు దుర్ముహూర్తం ప.11.36 నుంచి 12.20 వరకు అమృతఘడియలు... ఉ.8.26 నుంచి 10.01 వరకు.

**సూర్యోదయం :** 6.31
**సూర్యాస్తమయం:** 5.28
**రాహుకాలం :** ప. 12.00 నుంచి 1.30 వరకు
**యమగండం :** ఉ.7.30 నుంచి 9.00 వరకు

# పౌర గుర్తింపుల భాగోతం దేనికి?

**పౌరసత్వ నిరూపణకు దేశీయులకు ఒక్క 'ఆధార్' చాలదట, ఓటర్ కార్డు, పాస్‌పోర్టు, పుట్టిన తేదీ ధ్రువపత్రం, ఎస్ఎల్‌సీ సర్టిఫికెట్ వగైరా.. వగైరా కట్టగట్టి చూపాలట. కానీ, భారత 'ప్రజాస్వామ్య' వ్యవస్థ దురదృష్టమేమోగానీ సామాన్య పౌరులకు విధిస్తున్న సవాలక్ష షరతుల్లో కనీసం ఒక్కటంటే ఒక్కటి కూడా– దేశీయ సంపదను రెండు చేతులా దోచుకుని, దేశీయ పన్నుల చట్టాలను ఉల్లంఘించి కోట్లకు పడగలెత్తి, బ్యాంకులనుంచి పొందిన రుణాలను వేల, లక్షలాది కోట్లను ఎగ్గొట్టి పాలకుల లోపాయికారీ అనుమతితోనే అర్ధరాత్రి దేశం విడిచి రహస్యంగా విమానాలెక్కి విదేశాలకు ఉడాయించి వెక్కిరిస్తున్న బడా కోటీశ్వరులకు ఎందుకు వర్తింపజేయడం లేదు? ఈ విషయంలో కాంగ్రెస్, బీజేపీల వైఖరి దొందూదొందే.**


ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

*''జాతీయ పౌరచిట్టా (నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజన్స్) గురించి నా ప్రభుత్వం ఇంత వరకు కేంద్ర మంత్రిమండలిలో గానీ, పార్లమెంటులోగానీ చర్చించనేలేదు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకే అస్సాంలో ఎన్నార్సీని అమలు జరిపాం. అయితే దేశ పౌరసత్వ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ హింసాత్మక ఆందోళనలకు కారణమైన వారు కాంగ్రెస్ దాని మిత్రపక్షాలు, ఇతర విపక్షాలు, నగరాల్లోని (అర్బన్) నక్సలైట్లు. పాకిస్తాన్, బంగ్లాదేశ్ నుంచి శరణార్థులుగా వచ్చే హిందువులు, సిక్కులకు భారత పౌరసత్వం కల్పించాలని గాంధీయే చెప్పారు. అందుకని మూడు పొరుగు దేశాల్లో మతపరమైన వేధింపులకు గురై భారత్‌కు వచ్చేవారికి పౌరసత్వ హక్కులు కల్పించేందుకు ఉద్దేశించిన చట్టం ఇక్కడి వారి హక్కుల్ని గుంజేసుకునేది కాదు. శరణార్థులు వేరు, అక్రమ వలసదార్లు వేరు.''*

*– ప్రధాని నరేంద్రమోదీ: ఢిల్లీ బహిరంగ సభలో (22–12–2019)*


*''జాతీయ స్థాయిలో పౌరుల గుర్తింపు చిట్టా (నేషనల్ రిజిస్ట్రేషన్ ఆఫ్ సిటిజన్స్ – ఎన్నార్సీ) దేశమంతటా అమలులోకి వస్తుందనడంలో మాకు సందేహం లేదు. ఈ వాస్తవాన్ని అంగీకరించి తీరాలి''*

*– హోంమంత్రి అమిత్ షా (లోక్‌సభలో 09–12–2019)*

అంతే ముందు పౌరసత్వ బిల్లును పార్లమెంటు చట్టంగా రూపొందించిన దరిమిలా, దేశ వ్యాప్తంగా పౌరులకు సంబంధించిన జాతీయ స్థాయి రిజిస్టర్‌ను పార్లమెంటు ఆమోదించబోతుందన్న వాస్తవాన్ని బీజేపీ–ఆర్ఎస్ఎస్–ఎన్డీఏ సంకీర్ణ ప్రభుత్వం చెప్పక చెప్పినట్లయింది. దేశవ్యాప్తంగా విభిన్నమతాలు, భిన్న సంస్కృతులు, విభిన్న ఆచార వ్యవహారాలు, అనంతమైన సంఖ్యా బాహుళ్యం గల దళిత బహుజనులు, మైనారిటీలతో కూడిన సెక్యులర్ రిపబ్లిక్‌లో దేశ పౌరుల గుర్తింపునకు ఎన్నిరకాల ప్రమాణాలు కావాలి? దేశ జనాభాలో 92 శాతం పౌరులు ఇప్పటికే నమోదై ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నప్పుడు కొత్తగా నాలుగు రకాల ప్రమాణాలతో బీజేపీ పాలకులు ప్రజలలో గందరగోళ పరిస్థితిని పనిగట్టుకుని ఎందుకు సృష్టించాల్సి వచ్చింది? జాతీయ జనాభా రిజిస్టరు (ఎన్.పి.ఆర్), భారత పౌరుల జాతీయ రిజిస్టరు (ఎన్ఆర్ఐసి), పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ), వీటన్నిటికి తలమానికంగా జాతీయ స్థాయిలో, జనాభా లెక్కల (సెన్సెస్) దండకం–– ఇలా పలు దొంతర్ల అవసరం దేనికి వచ్చింది?

అంతే కాదు, పౌరుల రిజిస్ట్రేషన్, జాతీయ గుర్తింపు కార్డు (2003) ఉండాలని రూపొందించిన నిబంధనలూ (సిటిజన్‌షిప్ రూల్స్) ఉన్నాయి. దేశ పౌరులందరికీ ఎలాంటి మినహాయింపు లేకుండా 2003 నిబంధనలను పౌరులందరికీ వర్తింపచేశారు. కాగా, మళ్లీ జాతీయ స్థాయిలో వేరే గుర్తింపు (ఐడెంటిటీ) కార్డు ఎందుకు అనే అంశంపై బీజేపీ పాలకులు స్పష్టంగా వివరించారు. ఇక కాంగ్రెస్ నాయకులూ 'డిటో' డిటో! బీజేపీ పాలకులు ఎంతటి రహస్య ఎజెండాతో ప్రజాబాహుళ్యాన్ని బలవంతంగా శాసించడానికి అలవాటు పడ్డారో.. అమలులో ఉన్న జమ్మూ–కశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తిని (370 ప్రత్యేక నిబంధన) అర్ధరాత్రి రద్దు చేసిన తీరు బహిర్గతం చేసింది.

రెండో మాట



అలాంటి ప్రత్యేక ప్రతిపత్తితోనే, రాజ్యాంగ హామీలతోనే ఉసురు నిలుపుకుంటున్న ఈశాన్య రాష్ట్రాల ప్రజల్ని కూడా మోదీ–అమిత్ షాలు వంచించారు. దీంతో వారూ బీజేపీ ప్రభుత్వ పాలసీలను తీవ్రంగా శంకించాల్సి వచ్చింది. నిరంతర ఆందోళనతో ఉద్యమాలు సాగించుకోవలసి వచ్చింది. ఇప్పుడు మొత్తం కథ అంతా పని లేనివాడు పిల్లి తల గొరుగుతూ కాలక్షేపం చేయడానికి అలవాటు పడిన చందంగా పరిపాలన తయారైంది. కనుకనే మోదీ–అమిత్‌షాల మాటలు, చేతలు గమనిస్తున్నవారి దృష్టిలో నోళ్లు నవ్వాల్సిన చోట 'చెవులు నవ్వుతున్నాయన్న' సామెత పుట్టుకొస్తోంది. బహుశా చెవిలో పువ్వులు పెట్టడం అంటే ఇదేనేమో! జాతీయతకు, పౌరసత్వ నిరూపణకు ఉనికిలోకి వచ్చిన 'ఆధార్' కార్డు చాలదా? 70 ఏళ్ల తర్వాత కూడా సవాలక్ష సంకెళ్ల మధ్య భారత పౌరులు తమ పౌరసత్వాన్ని అడుగడుగునా పాలకులకు నిరూపించుకోవలసిన అవసరం ఉందా?

ప్రజా సమస్యలపై ఆందోళనలు దేశంలో తలెత్తినప్పుడల్లా పాలకపక్షాలు ఇరుగుపొరుగుతో 'సరిహద్దు ఘర్షణలు', ఉల్లంఘనలు, మెరుపుదాడులు (సర్జికల్ స్ట్రైక్స్) తీయటం, దేశ రక్షణకు అపురూపమైన సైనికులు ప్రాణాలు కోల్పోవడం కాంగ్రెస్, బీజేపీ పాలనా కాలంలో ఒక ప్రత్యేక నైపుణ్యంగా అమలు చేస్తూ వస్తున్నారు. వీటి ఆధారంగా ఎన్నికలలో విజయావకాశాలను మెరుగు పర్చుకోవడానికి ప్రయత్నించడం చాలా కాలంగా ఒక రివాజుగా మారింది. ఈ పరస్పర 'హరికిరి' బాగోతంలో చివరికి దేశ పౌరుడి బతుకును విలువ కోల్పోయిన, రూపు చెడిన రూపాయి కింద దిగ జార్చారు పాలకులు. పౌరసత్వ నిరూపణకు దేశీయులకు ఒక్క 'ఆధార్' చాలదట, ఓటర్ కార్డు, పాస్‌పోర్టు, పుట్టిన తేదీ ధ్రువపత్రం, ఎస్ఎల్‌సీ సర్టిఫికెట్ వగైరా.. వగైరా కట్టగట్టి చూపాలట. కానీ, భారత 'ప్రజాస్వామ్య' వ్యవస్థ దురదృష్టమేమోగానీ సామాన్య పౌరులకు విధిస్తున్న సవాలక్ష షరతుల్లో కనీసం ఒక్కటంటే ఒక్కటి కూడా బడాబాబులకు ఎందుకు వర్తించవు? దేశీయ సంపదను రెండు చేతులా దోచుకుని, దేశీయ పన్నుల చట్టాలను ఉల్లంఘించి కోట్లకు పడగలెత్తి, బ్యాంకులనుంచి పొందిన రుణాలను వేల, లక్షలాది కోట్లను ఎగ్గొట్టి పాలకుల లోపాయకారీ అనుమతితోనే అర్ధరాత్రి దేశం విడిచి విదేశాలకు ఉడాయిస్తున్నవారికి ఎందుకు వర్తించటం లేదు?

అలాంటి ప్రశ్నకు సమాధానాన్నే చికాగో సర్వమత సమ్మేళనంలో మహోత్తమ మానవతా సందేశాన్ని ధర్మాన్ని, ధార్మిక దార్శనికతను ప్రవచించి వివేకానందుడు ప్రపంచ దేశాలకు భారత ప్రజా బాహుళ్యానికీ బోధించాడు. కానీ ధార్మిక దృష్టికి భారతీయులు దూరమైనట్టు 'హిందూత్వ' అనే కొత్త చీలుబాట్లకు సావర్కార్, గోల్వాల్కర్ దారులు వేశారు. కాగా మతాతీతంగా అన్ని ధర్మాలకు సమాన పాయలో దివిటీలు పట్టి జీవితమంతా నిలిచిన కబీరు, రూమీ, గాంధీ, మౌలానా ఆజాద్, ఠాగూర్, నిజాముద్దీన్ అవులియా మనకు విద్యా బోధకులుగా, గాయపడిన మనస్సులకు ప్రేమానురాగాలతో ఓదార్పు కల్గించిన మహనీయులు. ఈ దృష్టితోనే వీరంతా సవాళ్లను ఎదిరించి నిలబడటమే జీవశక్తి. ఆ శక్తి నుంచే వీరు 'హిందూ' శబ్దానికి అర్థం 'ధర్మం' అనీ, ధర్మమే సాధనమనీ చాటారు. కాగా, 'హిందూత్వ' అనే శబ్దం ఒక ఇనుప గొలుసు అనీ, అదొక 'పంజరం' అనీ, ఈ పంజరాన్ని, ఈ గొలుసును బద్దలు కొట్టుకుని బయట పడగలవాడే అసలైన హిందువు అనీ, మూఢత్వాన్ని వదిలించుకున్నవాడే మానవుడనీ సోషియాలజీ ప్రొఫెసర్ అవిజిత్ పాఠక్ వివేచన. ఆ 'పంజరం'లోని తొలి పెద్ద చిలుకలు సావర్కార్, గోల్వాల్కర్‌లు.

భారతదేశంలో హిందూ–ముస్లిం ఐక్యతను పెంపొందించకుండా స్వరాజ్యం లేదన్నాడు గాంధీజీ. ఇందుకు నిదర్శనం భారత స్వాతంత్ర్యోద్యమం హిందూ, ముస్లిం సమైక్య పోరాటాల, త్యాగాల ఫలితమన్నాడు గాంధీ. ఎందుకంటే, ఆయనకు ఒకరు కాదు, పెక్కు మంది ముస్లిం యోధులు ఆయన సహచరులూ, అనుచరులూ. 1892 నుంచీ ఆ తర్వాత భారత స్వాతంత్ర్యోద్యమానికి లోకమాన్య తిలక్, గాంధీ నాయకత్వం వహించినప్పటి నుంచీ గాంధీకి మార్గదర్శకులుగా నేటాల్ ఇండియన్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా అబ్దుల్లా, కార్యదర్శిగా గాంధీ పనిచేసినవారే. ఇమాం సాహెబ్ అబూదీల్‌కాదిర్ బవాజీర్, గాంధీ తొలి ఉద్యమ స్థానం చంపారన్ సత్యాగ్రహానికి ఉద్దీపన కల్గించిన వినతిపత్రం రచయిత పీర్ మహ్మద్ అన్సారీ మునీస్. బ్రిటిష్ వైస్రాయ్ లార్డ్ ఇర్విన్, పర్యటనలో ఉన్న గాంధీజీని, ఆయన సహచరులను విందుకు పిలుస్తున్నామని చెప్పి, అతిథికి (గాంధీకి) అందించే ఆహారంలో విషం కలపమని తన వంట మనిషిగా ఉన్న బతక్‌మియా అన్సారీకి బాధ్యత పురమాయించాడు. ఆ దుర్మార్గం మనస్కరించని అన్సారీ. ఇర్విన్ తలపెట్టిన హత్యాయత్నం నుంచి గాంధీని రక్షించినవాడు. తొలి రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్ ఈ విషయం తెలిపేవరకు అన్సారీ చరిత్రా తెలియరాలేదు. ఇలా గాంధీజీ సహచరులు ఎందరెందరో ముస్లిం సోదరులు, సోదరీమణులూ ఉన్నారు. అయినా సరే గోల్వాల్కర్ భారతదేశంలోని 'హిందూయేతరులు హిందూ సంస్కృతికి, భాషకు అలవాటుపడాలి, హిందూ మతాన్ని అనుసరించితీరాలి, హిందూ జాతిని, సంస్కృతిని కీర్తించాలి. ముస్లింలు హిందూ జాతికి జీ హుకుం అనాలి, ఇంతకు తక్కువ ప్రవర్తన ఏదైనా వారు పౌర హక్కులకు అర్హులుకారు'' అని సిద్ధాంతీకరించాడు. ఈ సిద్ధాంతం పర్యవసానమే నేటి భారత రిపబ్లికన్ రాజ్యాంగానికి క్రమంగా పడుతున్న వరుస తూట్లు అని మరవరాదు.

abkprasad2006@yahoo.co.in

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



## సోషల్ మీడియా

### పికాసో



"దీపావళి బాణాసంచా వల్ల కాలుష్యం వస్తుంది. కానీ, కొత్త సంవత్సరం సందర్భంగా కాల్చే బాణాసంచా ఆక్సిజన్‌ను ఇవ్వడంతోపాటు, గాలిని శుభ్రపరుస్తుంది. దీపావళి బాణాసంచా వల్ల బ్రాంకైటీస్ వస్తుంది. కానీ, కొత్త సంవత్సర వేడుకల్లో బాణాసంచా మంచి ఉద్వేగాన్నిస్తుంది. దీపావళి బాణాసంచా మతపరమైనది. కొత్త సంవత్సరం రాక సందర్భంగా కాల్చే బాణాసంచా లౌకికమైనది. హిపోక్రసీ గనుక కళ అయినట్టయితే, బాలీవుడ్ సెలబ్రిటీలు అందులో పికాసోలు"

– నిషా ఝా, జర్నలిస్ట్

### కాంగ్రెస్‌దే



"జాతీయ పౌర పట్టిక అనేది కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే మొగ్గతొడిగింది. ఆధార్‌తో సంబంధం లేకుండా దీన్ని కొనసాగించాలని పి.చిదంబరం తీవ్రంగా యత్నించారు. కాబట్టి కాంగ్రెస్ చర్యనే ముందుకు తీసుకువెళుతున్నానని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరోసారి చెప్పుకోవచ్చు"

– ఆదిత్యా మీనన్, జర్నలిస్ట్


### కోరిక



"తనను తాను శాకాహారిగా ప్రకటించుకున్న రామచంద్ర గుహ బీజేపీ పాలిత గోవాలో బీఫ్ తినే స్వేచ్ఛ కావాలని కోరుకుంటారు. కానీ, పాకిస్తాన్‌లోని పేద హిందువులు, సిక్కులకు చనిపోయిన తమవారి మృతదేహాలను దహనం చేసుకునే స్వేచ్ఛ కూడా లేదని గుర్తించరు"

– షెఫాలీ వైద్య, రచయిత్రి

### వాళ్లు



"జాతీయ జనాభా నమోదు పట్టిక (ఎన్‌పీఆర్)ను తమ రాష్ట్రాల్లో అనుమతించేది లేదని ఇప్పటి వరకు కేవలం బెంగాల్, కేరళ మాత్రమే ఆదేశాలు జారీ చేశాయి. కాంగ్రెస్ పార్టీ మాత్రం దీనిపై మౌనంగా ఉంది. ఆ పార్టీ ముఖ్యమంత్రులు తమ రాష్ట్రాల్లో ఇటువంటి ఆదేశాలు ఎందుకు ఇవ్వలేదు"

– సుమంత్ రామన్, ప్రొఫెసర్

### కొత్త సంస్థ



"చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్(సీడీఎస్) పేరుతో ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం నెలకొల్పిన కొత్త వ్యవస్థకు స్వాగతం. రక్షణ మంత్రిత్వ శాఖను, సైనిక వ్యవహారాల నవీకరణ విభాగం(ఐడీఎంఏ)నూ విడగొట్టడం కీలక పరిణామం. ఐడీఎంఏను ఇకపై సీడీఎస్ స్వతంత్రంగా నిర్వహిస్తారు. పౌర, రాజకీయ, సైనిక సంబంధాల్లో పెను మార్పులు ఖాయం"

– శేఖర్ గుప్తా, జర్నలిస్ట్

### ప్రస్తుతం




"రాజకీయాలలో మిత్రులతో చర్చ సందర్భంగా దేశద్రోహం, విభజన, విద్వేషంతో ఒక నిర్ణయానికి రాలేమని చెప్పా. నేను, మేము కరుణ, మానవత్వాలను వదులుకోలేం. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో రెండూ ప్రమాదలో ఉన్నాయి"

– హరీందర్ బవేజా, జర్నలిస్ట్

ఇన్‌బాక్స్

## క్రీస్తు మార్గం

క్రీస్తు జీవించిన రోజుల్లో రాజే దైవాంశ సంభూతుడని పాలకులు ప్రచారం చేసేవారు. ప్రజలు కూడా దాన్ని నమ్మి ఆచరించే వారు. రాజుకే సర్వాధికారాలుండేవి. క్రీస్తు తన బోధనలద్వారా రాజుకూడా మానవ మాత్రుడేనని, ప్రజలెవరూ బానిసలుగా బతకనవసరం లేదని, ప్రేమ ద్వారానే సమాజంలో శాంతిని స్థాపించవచ్చని, మీ పొరుగింటివారిని కూడా మీలాగా ప్రేమించమని ప్రజలకు తెలియజేశారు. అన్ని గుణాలలో క్షమాగుణం గొప్పదని ఆయన వివరించారు. క్రీస్తుకు ప్రజలలో పెరుగుతున్న ఆదరణని చూసి ఇది తమ మనుగడకు ప్రమాదమని గ్రహించిన నాటి రోమన్ గవర్నర్ పొంటిస్ పైలేట్ క్రీస్తుకు శిలువ వేయించాడు. క్రీస్తు మరలా ఈ లోకానికి వస్తాడని, ఆయనని నమ్మినవారిని రక్షిస్తాడని క్రైస్తవులు విశ్వసిస్తారు. బుద్ధుడు, క్రీస్తు, మహ్మద్‌ప్రవక్త వంటి మహనీయులు తమ తమ ప్రాంతాలలో నెలకొన్న సాంఘిక దురాచారాలని రూపుమాపడానికి కృషిచేశారు. స్వేచ్ఛా, సమానత్వాన్ని ప్రజలకు అందించాలని బోధించారు.



రంగు రంగుల దీపాలతో, నక్షత్రాలతో క్రిస్మస్ ట్రీలతో ఇండ్లని అలంకరించుకొని ఘనంగా క్రిస్మస్‌ని జరుపుకుంటాం. క్రిస్మస్ జగమంతా జరుపుకునే పెద్ద పండుగ. క్రీస్తు బోధించిన దయాగుణాన్ని పాలకులు ఆచరించి ప్రజలకు మంచి పాలనని అందించాలి. మార్టిన్ లూథర్ కింగ్ వంటి వారు అమెరికాలో నల్లజాతీయుల హక్కులకోసం క్రీస్తు బోధనలనే స్ఫూర్తిగా తీసుకొని పోరాడారు. మన దేశంలో గాంధీజీ కూడా బుద్ధుడు, క్రీస్తు ప్రవచించిన శాంతి, అహింస మార్గాల ద్వారా స్వాతంత్ర్యం కోసం పోరాడారు. పాలకులు క్రీస్తు బోధనలని పాటించాలి. అప్పుడే సుపరిపాలన సాధ్యం.

(నేడు క్రీస్తు జయంతి)

యం. రాంప్రదీప్, జనవిజ్ఞాన వేదిక, తిరువూరు


# కమల దళంలో కలవరం!

సందర్భం


కొనగాల మహేష్

'బీజేపీ హఠావో– భారత్ బచావో' నినాదం రోజు రోజుకు బలపడుతోంది. జార్ఖండ్ ఎన్నికల ఫలితాలతో బీజేపీలో కలవరం మొదలైంది. జార్ఖండ్ ప్రజలు సరైన సమయంలో సరైన తీర్పునిచ్చారు. బీజేపీ కుట్ర రాజకీయాలకు వ్యతిరేకంగా కాంగ్రెస్–జే.ఎన్.ఏం కూటమిని గెలిపించారు. జార్ఖండ్ శాసనసభలో మొత్తం 81 స్థానాలుండగా, కాంగ్రెస్–జె.ఎన్.ఎం (యూపీఏ) కూటమి 48 స్థానాలలో గెలుపొంది ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనుంది. అధికార బీజేపీ 25 స్థానాలకు పరిమితం అయింది. మోదీ 9 ఎన్నికల సభల్లో ప్రసంగించగా కేవలం 3 చోట్ల మాత్రమే బీజేపీ గట్టెక్కింది. దీంతో ఏడాది కాలంలో వరుసగా 5 రాష్ట్రలలో బీజేపీ అధికారం కోల్పోయింది. మధ్యప్రదేశ్, రాజస్థాన్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ లలో ప్రజలు బీజేపీని ఇంటికి పంపించారు. జార్ఖండ్ ఎన్నికల ఫలితాలను, బీజేపీ దేశ ప్రజల మధ్య వైషమ్యాలు సృష్టించాలనే దురుద్దేశంతో తీసుకున్న ఎన్.ఆర్.సి. నిర్ణయానికి వ్యతిరేకిస్తూ ప్రజలు ఇచ్చిన రెఫరెండంగా చూడాలి. భారత రాజ్యాంగ పునాదులను, విలువలను పెకలించేలా, దేశ ప్రజలను మతం పేరుతో విభజించే కుట్రలో భాగంగా కేంద్ర ప్రభుత్వం, మోదీ–షా ద్వయం పౌరసత్వ సవరణ చట్టం (సి.ఏ.ఏ), జాతీయ పౌర పట్టిక (ఎన్.ఆర్.సి.) అమల్లోకి తెచ్చింది. ఈ చట్టంపై దేశ వ్యాప్తంగా ప్రజల నుంచి నిరసనలు వెల్లువెత్తుతున్నాయి.

కాంగ్రెస్ పార్టీని ఈ దేశంలో లేకుండా చేస్తామని కలలు కన్న బీజేపీ అధిష్టానానికి, ప్రజలు తమ పార్టీనే వరుసగా ఒక్కొక్క రాష్ట్రంలో సాగనంపుతుంటే తల బొప్పి కడుతోంది. 2019లో దేశ ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని దుర్వినియోగం చేస్తూ, మెజారిటీ ఉన్నది కాబట్టి ఏం చేసినా చెల్లుతుందనే ధోరణిలో బీజేపీ అనేక ప్రజావ్యతిరేక చట్టాలు



తెస్తోంది. కానీ తాము తీసుకున్న ప్రతీ నిర్ణయాన్ని ప్రజలు నిశితంగా పరిశీలిస్తున్నారని, సరైన సమయంలో, సరైన నిర్ణయం తీసుకుంటారనే ఆలోచనే బీజేపీకి లేదు. దేశ అభివృద్ధి, ఆర్థిక పరిస్థితి, ప్రజల సంక్షేమంపై దృష్టి పెట్టకుండా వివాదాస్పద నిర్ణయాలతో మోదీ–షాలు కాలం వెళ్లదీస్తున్నారు.

నోట్ల రద్దు నిర్ణయం, లోపభూయిష్ట జీఎస్టీ విధానం, కశ్మీర్ నిర్బంధం, సమాచార హక్కు చట్టానికి కోరలు పీకే సవరణలు లాంటి నిర్ణయాలు బీజేపీ అప్రజాస్వామిక పోకడలకు తార్కాణాలు. ఇపుడు, మైనార్టీ వర్గాలను ప్రత్యేకంగా ముస్లింలను టార్గెట్ చేస్తూ తెచ్చిన పౌరసత్వ సవరణ చట్టం (సి.ఏ.ఏ), జాతీయ పౌర పట్టిక (ఎన్.ఆర్.సి.) పట్ల సర్వత్రా నిరసన వ్యక్తమౌతుంది. ఈ చట్టం అమలు విషయమై మోదీ–అమిత్ షా ఇద్దరూ పరస్పరం విరుద్ధంగా మాట్లాడుతూ ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారు. ఈ చట్టాన్ని కాంగ్రెస్ పార్టీతో పాటు ప్రతిపక్ష పార్టీలన్నీ ముక్తకంఠంతో ఖండిస్తున్నాయి. రాజ్యాంగ మౌలిక సూత్రాలను కాలరాసే ఈ పౌర చట్టం అమలును నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ రాజ్‌ఘాట్ వేదికగా సత్యాగ్రహం చేపట్టింది. ఇప్పటికే మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సీఎంలు ఈ చట్టాన్ని అమలు చేయబోమని స్పష్టం చేశారు.

మోదీ–అమిత్ షా ద్వయానికి అసలు సవాల్ ముందుంది. ఢిల్లీ, బీహార్, పశ్చిమ బెంగాల్ ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ కమల దళంలో కలవరపాటు పెరుగుతోంది. ఇప్పటికే ఉత్తరప్రదేశ్ మినహా చెప్పుకోదగ్గ పెద్ద రాష్ట్రంలో ఎక్కడా అధికారంలో లేని బీజేపీకి ఈ ఎన్నికలు కత్తిమీద సాము లాంటివి. జార్ఖండ్ ఎన్నికల్లో లెక్కచేయని బీజేపీతో, బీహార్ ఎన్నికల్లో తాము కలిసి పోటీ చేసే విషయమై జేడీయూపార్టీ పునరాలోచనలో పడింది. బెంగాల్ రాష్ట్రంలో పాగా వేయటానికి బీజేపీ ఎన్ని అల్లర్లు సృష్టించినా అక్కడి ప్రజలు తిప్పికొడుతున్నారు. దీనికి తోడు పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు, నిరుద్యోగ సమస్య, ఆర్థిక వ్యవస్థ నిర్వీర్యమౌతున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. బీజేపీ ఇదే ఒంటెద్దు పోకడలు కొనసాగిస్తే, 2020 నాటికి 'బీజేపీ ముక్త్ భారత్' ఖాయంగా కనిపిస్తోంది.


వ్యాసకర్త జాతీయ సభ్యులు, ఏఐసీసీ
మొబైల్ : 98667 76999

## రాలిన పూలను దోసిట పట్టిన కవిత్వం


బుక్ ఫెయిర్

కవి ఏం చేస్తాడు? కవిత్వం రాస్తాడు అని చెప్పేంత సులువుగా ఉండదు ఈ ప్రశ్న. రాసేవాడికి కవిత్వ నిర్మాణం తెలిసుండాలి. ఒక ఘటననో, పోరాటాన్నో, వాక్యాన్నో పట్టుకుని కవిత్వం చేయగల నేర్పు ఉండాలి. అందుకే 'కవిత్వం కావాలి కవిత్వం' అని పలవరిస్తూ... 'లేదా, వాక్యమై తేలిపోతావ్' అని హెచ్చరించాడు త్రీశ్రీ. దేశరాజు అట్లా కవిత్వ నిర్మాణం తెలిసినవాడు.

మామూలై పోయిన చావుల కాలంలో, చీకటి రాజ్యంలో వెన్నెల విరగ్గాయాలని కలగంటున్న కవి దేశరాజు. 'దుర్గాపురం రోడ్... దుర్గాపురం రోడ్' అని ఎవరైనా అరుస్తారా... రైలాగుతుందో లేదో అని అనుమానిస్తూనే, 'దొరికినా దొరక్కపోయినా/ప్రేమ కోసం గాయపడాల్సిందే' అంటూ కుండ బద్దలుకొట్టేశాడు. ఇప్పుడున్న స్థితిని చెప్తూ 'గొంతెత్తి పాడలేమని మౌనంగా ఉండొద్దెప్పుడు' అంటూ మొదలెట్టి 'మంచుకరిగే సమయం వస్తుంది/అంతవరకూ మనలో రక్తప్రసరణ సాగాలి/మంది సంగతి సరే,/ముందు మనకై మనం మిగలాలి కదా' అని ముందు జాగ్రత్త చెప్తున్నాడు.



పరువు అనే అమూర్తభావన కోసం కూతుళ్ళనూ, వాళ్ళ ప్రేమికుల్ని చంపుతున్న నేలలో 'ఈ జన్మకిది చాలు,/ అవును, కూతుళ్ళున్న తండ్రులకిక చావు లేదు' అని ప్రకటించిన దేశరాజూ ఉన్నాడు అని ఛాతీ విరుచుకు మరీ చెప్పొచ్చు. ఒక్కటా, రెండా తాను చూసిన, అనుభవించిన, చెప్పాలనుకున్న వాటిని కవిత్వం చేసినవాడు దేశరాజు. ఒక్కమాటలో చెప్పాలంటే నగ్నముని అన్నట్లు 'కటువైన నిజాన్ని సైతం నెమ్మదిగా, మంద్రస్థాయిలో చెబుతాడు'.

(నేటి సాయంత్రం హైదరాబాద్ స్టడీ సర్కిల్‌లో 'దుర్గాపురం రోడ్' పరిచయ సభ)

– అరుణాంక్ లత

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 425 9899

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
బుధవారం ॥ 25-12-2019

నేడు క్రిస్మస్



# దివ్యలోకపు ప్రేమధార

**మనుషుల్ని చూడండి. మీద ఏదో ఒక బరువు. చదువుల బరువు. ఉద్యోగాల బరువు. ఇంటి పోషణ బరువు. బంధువుల మాటపట్టింపు బరువు. స్నేహితుల ముఖంచాటు బరువు. దగ్గరివాళ్లెవరి మనసునో నొప్పించిన బరువు. అంత బరువులోనూ సాటి మనిషి తల మీది బరువును రెండు చేతులతో చేపల గంపను కిందికి దింపినట్లుగా.. 'కష్టాన్ని పంచుకునే బరువు'నూ పైకెత్తుకుంటారు! మనిషి ఎంత బరువును మోస్తున్నా.. మనిషి లోపల పంచుకోవడం అనే ఆ 'ప్రేమ నక్షత్రం' వెలుగుతున్నంత కాలం లోకం ప్రేమమయమే. కాంతిమయమే.**



## తాతకు తోడుగా..!



క్రిస్మస్ తాత నివాసం దక్షిణధ్రువంలో ఉంటుందని ప్రపంచం అంతా భావిస్తుంటే.. నెదర్లాండ్స్ ప్రజలు మాత్రం ఆయన స్పెయిన్ దేశంలో ఉంటాడని నమ్ముతారు. క్రిస్మస్ తాతను ఇంగ్లిషులో శాంటాక్లాస్ అంటాం కదా. శాంటా క్లాస్ అన్నది నెదర్లాండ్స్ వాళ్లు మాట్లాడే డచ్ భాషా పదం. వాళ్ల దేశం నుంచి శాంటాక్లాస్ అనే మాట వచ్చింది కాబట్టి, శాంటాక్లాస్‌ది స్పెయిన్ అని చెబుతున్న డచ్‌వాళ్ల మాటను మనం పూర్తిగా కాదనేందుకు లేదు. డచ్ వాళ్లకు ఇంకో నమ్మకం కూడా ఉంది. క్రిస్మస్ గిఫ్టులు ఇవ్వడానికి శాంటాక్లాజ్ ఒక్కడే వస్తాడని మనం అనుకుంటాం. కానీ కాదట. ఆయన పక్కన ఆయనకు సహాయకులుగా కొన్ని 'పిల్ల శాంటాలు' ఉంటారట. వాళ్లేం చేస్తారంటే.. గిఫ్టులు ఇవ్వడానికి క్రిస్మస్‌తాతతో పాటు ఇళ్లకు వెళ్లినప్పుడు అక్కడ పిల్లలెవరైనా తుంటరి పనులు చేస్తే వాళ్లను అమాంతం ఎత్తుకుని తెచ్చేసి స్పెయిన్‌లో వదిలేస్తారట! అంతకుమించిన శిక్ష ఉండదని నెదర్లాండ్స్ వాళ్లు అంటారు!

## బాల యేసుకు దుప్పటి



రాత్రి పెట్టిన క్రిస్మస్ చెట్టు మీద తెల్లారే సాలెగూడు కనిపిస్తే ఏదో అదృష్టం వరించబోతోందని జర్మనీ, పోలండ్, ఉక్రెయిన్ దేశాలలో ఒక విశ్వాసం ఉంది. బేబీ జీసెస్ కోసం ఆ సాలె పురుగు దుప్పటి నేస్తూ ఉంటుందని కొందరి నమ్మకం. ఆ సాలెగూడు ఉదయాన్నే సూర్య కిరణాలు సోకి బంగారు, వెండి సాలెగూడుగా మారిపోతుందని మరికొందరి నమ్మకం. మన దగ్గర మార్కెట్ నుంచి కొని తెచ్చుకున్న రెడీమేడ్ క్రిస్మస్ ట్రీలో ఏ మూలో సాలెగూడు కూడా ఉండటానికి ఇదే కారణం అయి ఉండొచ్చు. ఈ నమ్మకం గురించి తెలిసినవాళ్లు క్రిస్మస్ చెట్టుకు తప్పనిసరిగా ఒక ప్లాస్టిక్ సాలెగూడును సంపాదించి తగిలిస్తారు. అలా కూడా అదృష్టం కలసి వస్తుందని కొందరు విశ్వసిస్తారు.

## పసి మనసులు



కొన్ని పాశ్చాత్య దేశాలలో.. ముఖ్యంగా జర్మనీలో ఒక అందమైన విశ్వాసం ఉంది. క్రిస్మస్‌కు కొద్ది గంటల ముందు.. కల్లాకపటం తెలియని స్వచ్ఛమైన పసి హృదయాలు జంతువుల మాటల్ని వినగలుగుతాయట! అంతేకాదు, నదులు ద్రాక్ష సారాయిగా మారడాన్ని ఆ పసివాళ్ల కళ్లు చూడగలుగుతాయి. క్రిస్మస్ ట్రీకి వాళ్ల కళ్లముందే తియ్యటి బేరీ పండ్లు కాస్తాయి. పర్వతాలు తెరుచుకుని వాటి గర్భంలోని మణులు మాణిక్యాలు బయటపడతాయి. సముద్రపు అడుగు నుంచి దేవుని గంటలు ధ్వనిస్తాయి. నిజంగా ఇలా జరిగితే ఎంతమందిమి చూడగలుగుతాం? మనలో ఎన్ని పవిత్రమైన హృదయాలు ఉంటాయి అని ప్రశ్న?!

**క్రీస్తు జన్మించారన్న కబురును ఒక నక్షత్రం భూమి మీదకు మోసుకొచ్చింది. ఆ నక్షత్రం ప్రసవించిన వెలుగులో క్రీస్తు జనన ఘడియలు కాంతి పుంజాలై ప్రసరించి లోకమంతటా మంచిని విత్తనాల్లా విరజిమ్మాయి. ఆ విత్తన సంతతే కావచ్చు ఈ మంచిని ప్రయాసపడి మోసుకొచ్చే మనుషులు!**

● మాధవ్ శింగరాజు

మంచిని మోసుకొచ్చేవాళ్లు కనిపిస్తే మనసుకు భారం దిగినట్లుగా అనిపిస్తుంది. భుజాన అరటి గెలతో వచ్చేవాళ్లు, వడ్ల బస్తాల బండితో దిగేవాళ్లు, అమ్మాయికి పెళ్లి సంబంధం తెచ్చేవాళ్లు.. ఇవనే కాదు, ఊరికే చూసిపోదామని ఎంతోదూరం నుంచి ఒక పలకరింపునైనా మూట కట్టుకుని వచ్చేవాళ్లు.. వాళ్లు ఎండన పడి వచ్చినా.. మనకు నీడనిచ్చేందుకు వేర్లు పెకిలించుకుని కదలి వచ్చిన మనిషంత మహావృక్షంలా కనిపిస్తారు. మన నీరసాన్ని, నిస్సత్తువను పోగొడతారు. వాళ్లు తెచ్చిన చక్కెరకేళీలు, వాళ్లు దించిన ధాన్యం గింజలు, వాళ్లు చెప్పిన వరుడి విశేషాలు.. ఇవి కాదు మనసుకు సంతోషం. ఆ మోసుకురావడం.. అదీ! మనిషంటే అలానే ఉండాలి. నక్షత్రంలా! క్రీస్తు జన్మించారన్న కబురును ఇలాగే ఒక నక్షత్రం భూమి మీదకు మోసుకొచ్చింది. ఆ నక్షత్రం ప్రసవించిన వెలుగులో క్రీస్తు జనన ఘడియలు కాంతిపుంజాలై ప్రసరించి లోకమంతటా మంచిని విత్తనాల్లా విరజిమ్మాయి. ఆ విత్తన సంతతే కావచ్చు ఈ మంచిని ప్రయాసపడి మోసుకొచ్చే మనుషులు! విరజిమ్మినప్పుడు మంచి అక్కడక్కడా పడింది కనుకనేనా మంచి మనుషులు అక్కడక్కడ మాత్రమే కనిపిస్తుంటారు?! కాదు. కనిపించకపోవడానికి కారణం మనం చూడకపోవడం, చూడాలని మనకు లేకపోవడం! ప్రకృతిని చూసి పరవశిస్తాం. ప్రకృతిలో భాగమైన మూగజీవుల్ని చేరదీసి సేదతీరుతాం. పక్షులు పాడుతుంటే వింటాం. మరి సాటి మనిషినెందుకు దగ్గరకు రానివ్వం? ఎన్ని యుగాల పరిచయం ఉన్నా మనిషికి దగ్గరగా ఎందుకు వెళ్లలేం?


చూడదలచుకుంటే దిగ్మండలంలోనే కాదు, ఈ భూమండలంలోనూ నక్షత్రాల్లాంటి మనుషులు ప్రత్యక్షమవుతారు. క్రీస్తు జననం వంటి ఒక మంచిని వాళ్లు సాక్షాత్కరింపజేస్తారు. మనలో ప్రతి ఒక్కరం చూడగలం. అయితే చూడదలచుకోం! చూసేందుకు లోకంలో మంచే లేదనుకుంటాం. నిజంగానే లోకంలో మంచికి చోటు లేదా, మంచిని చూసేందుకు మనలో చోటు లేదా? ఉంటుంది. మంచిని చూడాలన్న ఆలోచన.. అది రాదు. వచ్చిందా.. మరుక్షణమే మన పక్కనే ఉన్న మనిషిలోనూ ఒక నక్షత్రం కనిపిస్తుంది! మనిషిలో నక్షత్రం కాదు, మనిషే నక్షత్రంలా కనిపిస్తారు. ఆ నక్షత్రపు వెలుగులో లోకంలోని మంచి కనిపిస్తుంది.

వెలుగులో మంచొక్కటే కనిపిస్తుందా! వెలుగులో కనిపించేది మంచైనా, కానిదైనా.. మనసులోని వెలుగు మంచిని మాత్రమే చూస్తుంది. ఆ చూపును కాపాడుకోవాలి మనం. అప్పుడు లోకం దివ్యమైన నక్షత్ర కూటమిలా వెలుగుతూ కనిపిస్తుంది. శోకమయపు సముద్రాల ఈతకు నీటిపై సురక్షితంగా తేలియాడే ఆకులాంటి ఒక మంచి చూపు చాలదా.. సముద్రాన్ని, సుడిగుండాల్ని, తిమింగలాలను లక్ష్యపెట్టక ప్రశాంతంగా జీవనయానం సాగించడానికి!

కొన్ని సంగతులు విన్నప్పుడు భూమి మీద ఉన్నదంతా ప్రేమ సందేశాలను మోసుకొచ్చే నక్షత్రాలే కానీ మానవమాత్రులు కారేమో అనిపిస్తుంది. కాకపోతే కొన్ని వెలిగే నక్షత్రాలు. కొన్ని వెలుగులో మాత్రమే కనిపించే నక్షత్రాలు. వెలుగులో నక్షత్రాలు కనిపించడం ఏమిటి! నక్షత్రమంటేనే వెలుగు కదా?! మనిషెంత వెలిగినా మంచితో వెలగడం ఒకటి ఉంటుందిగా. అలాంటిదే. ఒక యువకుడు ఉన్నాడు. హోటల్‌లో వెయిటర్. రూపాయి రూపాయి కూడబెట్టుకుని సైకిల్ కొనుక్కోవడం కోసం రోజూ పదకొండు కిలోమీటర్లు కాలి నడకన పనికి వచ్చి పోతున్నాడు. ఆ హోటల్‌కు వస్తుండే దంపతులొకరికి ఈ సంగతి తెలిసింది. మర్నాడే ఒక సైకిల్‌ని కొని అతడికి కానుకగా ఇచ్చారు! కష్టపడటం అతడి వెలుగైతే, అతడి కష్టాన్ని ఆ దంపతులు గమనించడం అతడిపై ప్రసరించిన వెలుగు.

ఒక పోలీస్ అధికారి బంద్ డ్యూటీలో ఉన్నాడు. మధ్యాహ్నం అయింది. డ్యూటీలో ఉన్న చోటే ఒక అరుగు మీద భోజనానికి కూర్చోబోతుండగా ఒక వ్యక్తి దగ్గరగా వచ్చి నిలుచున్నాడు. అతడికి ఆకలిగా ఉన్నట్లు గ్రహించాడు ఆ పోలీస్ అధికారి. 'తింటావా?' అని అడిగాడు. 'తింటాను' అన్నట్లు తలూపాడు ఇల్లూ వాకిలీ లేని ఆ వ్యక్తి. పోలీస్ అధికారి తెప్పించుకున్న అన్నం పొట్లంలోనే ఇద్దరూ కలిసి చేతులు పెట్టి భోజనం చేశారు! పంచే బుద్ధి పోలీస్ ఆఫీసర్‌లోని వెలుగైతే, దాన్ని బయటికి కనిపించేలా చేసిన వెలుగు ఆ ఆకలిగొన్న వ్యక్తి. ఇలాంటివి జరక్కపోతే పోలీసు చొక్కాపై నక్షత్రాలను తప్ప పోలీసు మనసు లోపలి నక్షత్రాలను చూడగలమా?!

మనుషుల్లోపల్లోపల సాటి మనుషులంటే ఇంతింత ప్రేమ ఉంటుందే.. మరి అదంతా కనిపించకుండా ఎక్కడికి పోతుంది? ఎక్కడీ పోదు. ఎక్కడి నుంచో, ఏ రూపంలోనో ఓ కాంతి ధార వచ్చి పడితేనే కానీ ఆ మానవ నక్షత్రాల్లోని ప్రేమ వెలుగు పైకి కనిపించదు. మనుషులు ధరించే నిర్దయ, నిరాదరణ అనే కవచాలు మనుషుల మీద అనుమానంతోనే కానీ అవేవీ సహజ కవచాలు, కుండలాలు కావు. సాటి మనిషి అవసరానికి అవి తునాతునకలైపోయి హృదయ కాంతి బయటపడినప్పుడు గానీ అప్పటి వరకు వారు పండ్ల గెలలు, ధాన్యపు బస్తాలు, పెళ్లి సంబంధాలు మోస్తున్నట్లు తెలియదు. జ్ఞానులు సైతం క్రీస్తు జననాన్ని నక్షత్రం ద్వారానే గుర్తించగలిగారు. మనిషిలోని దైవత్వాన్ని గుర్తించడానికి ప్రతి మనిషీ అంతటి నక్షత్రం అయి ఆ కాంతిని లోకానికి బాటగా వేయాలి. ●



## గంటకు 60 లక్షల మైళ్లు!



క్రిస్మస్‌తాత తెచ్చే గిఫ్టుల కోసం ఎదురు చూసే పిల్లలు ప్రపంచ వ్యాప్తంగా 70 కోట్ల మంది వరకు ఉంటారని అంచనా. మరి వారందరికీ గిఫ్టులు చేరవెయ్యాలంటే క్రిస్మస్ తాతకు టైమ్ సరిపోతుందా? సరిపోతుంది. గంటకు అరవై లక్షల మైళ్ల వేగంతో ప్రయాణిస్తే చాలు. అన్ని దేశాల్లోని అందరి పిల్లలకు గిఫ్టులు అందినట్లే. యు.ఎస్.లోని యూనివర్శిటీ ప్రొఫెసర్ ఒకరు వేసిన లెక్క ఇది.

## ఎక్స్‌మస్



క్రిస్మస్‌ని ఎక్స్‌మస్ అని కూడా అంటుంటాం. ఎందుకిలా? ఎప్పుడైనా మీకు డౌట్ వచ్చిందా? మీకు వచ్చినా రాకున్నా ఎక్స్‌మస్ అన్నది మాత్రం క్రిస్మస్ నుంచే వచ్చింది. అబ్రివేషన్‌గా వాడుతున్నాం. ఇలా ఇష్టమొచ్చినట్లు వాడితే సరిపోయిందా? లాజిక్ ఉండొద్దా? ఉంది! గ్రీకు భాషలో chi ని X తో సంకేతపరుస్తారు. అందుకే క్రైస్ట్, క్రిస్టోస్ అనే మాటలకు ముందు వాళ్లు X అని రాస్తారు. అలా క్రిస్మస్.. ఎక్స్‌మస్ అయింది.

## బాతు చెట్లు



మొదట్లో క్రిస్మస్ చెట్టును బాతు ఈకలతో చేసేవాళ్లు. ఆ ఈకలకు పచ్చరంగు వేసేవారు. 19వ శతాబ్దంలో జర్మనీలో ఇలా చేయడం మొదలైంది. అప్పట్లో అక్కడ అడవుల నరికివేత విపరీతంగా ఉండటంతో చెట్లకు కరువొచ్చింది. దాంతో బాతు ఈకల ఆలోచన వచ్చింది వాళ్లకు. తర్వాత్తర్వాత బాతు ఈకలతో క్రిస్మస్ చెట్లను తయారు చేయడమన్నది అమెరికాకు, ఇతర దేశాలకూ వ్యాపించింది.

## కెంటకీ ఫర్ క్రిస్మస్




జపాన్‌లో క్రిస్మస్ రోజు కె.ఎఫ్.సి.లు కిటకిటలాడిపోతుంటాయి. అక్కడ క్రైస్తవుల సంఖ్య పెద్దగా ఉండదు కానీ, క్రిస్మస్ రోజు అంతా కె.ఎఫ్.సి.ల దారి పడతారు. కె.ఎఫ్.సి. అంటే కెంటకీ ఫ్రైడ్ చికెన్. అయితే 1947లో కె.ఎఫ్.సి. తన సేల్స్ పెంచుకోవడం కోసం 'కెంటకీ ఫర్ క్రిస్మస్' అనే మార్కెటింగ్ వ్యూహం పన్ని సక్సెస్ అయ్యింది. అప్పట్నుంచీ క్రిస్మస్ సీజన్‌లో జపాన్‌వారికి పండగే పండుగ. కె.ఎఫ్.సి. వారి నోరూరించే ఆఫర్లు కడుపునిండా ఉంటాయి.

## తిరుప్పావై 10వ పాశురం

**నోత్తు చ్చువర్ క్కం పుగుగిన్ఱ అమ్మనాయ్**
**మాత్తముం తారాతో వాశల్ తిఱవాదార్**
**నాత్తత్తుళాయ్ ముడి నారాయణన్ నమ్మాల్**
**పొత్తప్పఱై తరుమ్ పుణ్ణియనాల్ పండొరునాళ్**
**కుత్తత్తిన్ వాయ్వీళంద కుంబకరణనుమ్**
**తోత్తుం ఉనక్కే పెరుందుయిల్ తాన్ తందానో**
**అత్త ఆనందల్ ఉడైయాయ్ ! అరుంగలమే**
**తేత్తమాయ్ వందు తిఱవేలోర్ ఎమ్బావాయ్.**

భగవత్ భక్తురాలైన ఒక కన్యను మేల్కొల్పటం ఈ పాశురంలో చూస్తాము. 'కన్యావ్రతాన్ని ఆచరించి తప్పక స్వర్గానికి చేరుకుంటాననే ఆత్మవిశ్వాసం కలిగిన ఓ చెలీ! నీ తలుపు దగ్గర నిలబడి మేము పిలుస్తుంటే కనీసం తలుపు తెరిచి పలుకక పోవటం నీ సంప్రదాయమా? (ఆ చెలి స్పందించక పోవటం చేత బయట నిలబడ్డ అండాళ్ తదితర గోపికలు ఆమెకు వినబడే విధంగా ఇలా సంభాషించుకుంటున్నారు.) :

తులసీదామ భూషణుడైన నారాయణ నామగానం స్వామికి అత్యంత ప్రీతికరం. మనం చేసే నామస్మరణకు ప్రసన్నుడై కృష్ణుడు తప్పక మనకు వ్రతోపకరణమైన 'పర'(భేరీ)వాయిద్యాన్ని ప్రసాదించగలడు. (అందుకే నీవును మాతో రా). పూర్వం ధర్మమూర్తియైన శ్రీరాముడు వధించిన కుంభకర్ణుని నీవు నిద్ర పోటీలో జయించినట్లున్నావు, అతడు తన నిద్రను నీకు ధారపోశాడనిపిస్తున్నది. అటువంటి నిద్రావివశురాలివైన ఓ ప్రియసఖీ! మా బంధానికి విలువైన ఆభరణానివి నువ్వు. వచ్చి తలుపు తియ్యవమ్మా.'



బొమ్మ: కేశవ్ వెంకటరాఘవన్

– శ్రీదేవి మురళీధర్

## చెట్టు నీడ

# అందిన దైవ సందేశం

యాజకుడు జెకర్యా అతి పరిశుద్ధ స్థలం నుండి బయటకు రావడం ఆలస్యమైనకొద్దీ ఆలయ ప్రాంగణంలో వేచి ఉన్న ప్రజల్లో భయం, ఉత్కంఠ పెరిగిపోతున్నాయి. ''యాజకునికి దైవదర్శనం అయ్యుంటుంది. దైవ సందేశం అంది ఉంటుంది..'' అనుకుంటున్నారు ప్రజలు. కొన్ని గంటల తర్వాత యాజకుడు రావడం, మాటను కోల్పోయి సైగలు చేయడం చూసిన ప్రజలు తామనుకున్నదే జరిగినదనుకుంటూ మూగ జెకర్యా సైగలతో ఇచ్చిన ఆశీర్వాదాలను స్వీకరించి వెళ్లిపోయారు. ఇంట్లో ఇల్లాలు, ఎలీసబెతుకు జెకర్యా సైగలు ఎంతో ఆనందాన్ని కలిగించాయి. 'గొడ్రాలు' అన్న అవమానాన్ని తొలగించి తనను తల్లిని చేయబోతున్న దేవుని ఎంతో స్తుతించింది. తాము ఎదురు చూస్తున్న మెస్సయకు ముందుగా వెళ్లి మార్గాన్ని సరాళం చేసే ప్రవక్తకు తమను తల్లిదండ్రులను చేయబోతున్న దేవాదిదేవుని ఎంతో ఘనపరచారు ఆ వృద్ధదంపతులు!

ప్రభువు చేసిన మేలులను ధ్యానిస్తున్న ఎలీసబెతుకు ఆ తర్వాత గడచిన ఆరు నెలలు ఆరు క్షణాలుగా అనిపించాయి. ఒకనాడు తలుపు తడుతున్న శబ్దం వినిపించి, వెళ్లి తలుపు తెరిచింది ఎలీసబెతు.

''అత్తమ్మా! మీ పూజ్య దంపతులకు అభినందనలు'' అంటూ ఓ యువతి ఎలీసబెతును ఆత్మీయ ఆలింగనంతో హత్తుకుంది. ''మరియా, ఎన్నాళ్లకెన్నాళ్లకు? అమ్మానాన్నా తోబుట్టువులు అందరూ బావున్నారా? ఆ... ఆగు మరియా! నా గర్భంలో ఉన్న శిశువు నీ మాట వినడంతోనే ఆనందంతో గంతులు వేస్తున్నాడమ్మా...'' అంది.


''ఔనా అత్తమ్మా? అయితే మనమంతా ఎదురు చూస్తున్న మెస్సయ నా గర్భంలోనే పుట్టబోతున్నాడని.. నీ గర్భంలోని శిశువుకు తెలిసిపోయిందేమో... అందుకే...'' అంది.

''మరియా, నాకర్థమయ్యేలా చెప్పు.. కూర్చో'' అంది. ముందు రోజే దైవదూత గాబ్రియేలు తనతో చెప్పిన అద్భుత విషయాలు ఎలీసబెతుకు చెప్పడం ప్రారంభించింది మరియ.

''అత్తమ్మా! నేను కన్యకనే అయినప్పటికీ దేవుని పరిశుద్ధాత్మ వల్ల గర్భం దాల్చి లోకరక్షకునికి జన్మనివ్వబోతున్నానని, ఆయనకు యేసు అని పేరు పెట్టమని, ఆయన సర్వోన్నతుడైన దేవుని కుమారుడు అనబడతాడని, మనకందరికీ పితామహుడైన దావీదు మహారాజు సింహాసనానికి ఆయనే వారసుడవుతాడనీ, ఆయన రాజ్యమంతయు అంతం లేనిదిగా ఉంటుందని దేవుని దూత చెప్పాడు'' అంటూ ముగించింది మరియ. ఆ మాటలతో ఆనంద పరవశురాలైన ఎలీసబెతు ''తల్లీ, స్త్రీలలో నువ్వు ఆశీర్వదించబడ్డావమ్మా! నా ప్రభువు తల్లి నా వద్దకు రావడం మాకెంత ధన్యత!'' అంటూ మరియను ముద్దాడింది. వారిద్దరూ మోకరించి దేవుని స్తుతించారు.

– ఝాన్సీ కె.వి.కుమారి


## ● ముగ్గు-ముచ్చట



రాయి విజయలక్ష్మి
నిజామాబాద్




20 చుక్కలు
6 వరుసలు
6 వచ్చేవరకు, సరి చుక్క



ఆకుల కోమలి
హాలియా విలేజ్, నల్గొండ జిల్లా



20 చుక్కలు
12 వరుసలు
అటు 4 ఇటు 4 వదిలి
12 చుక్కలు 4 వరుసలు



గోలి వీరమ్మ
గోనేడ, కిర్లంపూడి మండలం, తూ.గో.జిల్లా



23 చుక్కలు
7 వరుసలు
7 వచ్చేవరకు



ఇలియానా

# నా లైఫ్ బ్యూటిఫుల్

\- రామ్‌గోపాల్ వర్మ



టి. అంజయ్య, నైనా గంగూలి, రామ్‌గోపాల్ వర్మ, అగస్త్య మంజు, సూరి

''మనసుకి ఆహ్లాదం కలిగించి మనల్ని ఉద్రేకానికి గురి చేసే ఏ ఎమోషన్ అయినా బ్యూటిఫుల్. నా హిట్‌ని ఎంత బ్యూటిఫుల్‌గా తీసుకుంటానో నా ఫ్లాప్‌ని కూడా అంతే బ్యూటిఫుల్‌గా తీసుకుంటాను. నా జీవితంలో ఎవరిపైనా ఫిర్యాదు చేయను.. నాకు ఎవరి మీదా కోపం రాదు. నేను బ్యూటిఫుల్ కాకపోవచ్చు.. కానీ నా లైఫ్ మాత్రం బ్యూటిఫుల్'' అని రామ్‌గోపాల్ వర్మ అన్నారు. నైనా గంగూలి, సూరి జంటగా రామ్‌గోపాల్ వర్మ టైగర్ కంపెనీ ప్రొడక్షన్ పతాకంపై అగస్త్య మంజు దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'బ్యూటిఫుల్'. 'ట్రిబ్యూట్ టు రంగీలా' అనేది ఉపశీర్షిక. టి.అంజయ్య సమర్పణలో టి. నరేష్ కుమార్, టి. శ్రీధర్ నిర్మించిన ఈ సినిమా జనవరి 1న విడుదలవుతోంది. హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకలో రామ్‌గోపాల్ వర్మ మాట్లాడుతూ– ''ఊర్మిళ లాంటి అమ్మాయి లేకుంటే నేను 'రంగీలా' సినిమా తీసుండేవాణ్ణి కాదు. ఇప్పుడు నైనా విషయంలోనూ అదే జరిగింది. కొంతమంది యాక్టర్స్ కొన్ని ప్రత్యేకమైన క్యారెక్టర్స్ కోసమే క్రియేట్ అయ్యారనిపిస్తుంది. నేను పదిహేనేళ్లుగా లవ్ స్టోరీ జోలికి వెళ్లలేదు. దానికి రెండు కారణాలు.. ఒకటి నన్ను అంతగా ఇన్‌స్పైర్ చేసిన కథ రాలేదు. రెండోది అంతగా ఇన్‌స్పైర్ చేసిన యాక్టర్ దొరకలేదు.. అవి రెండూ కుదిరాయి కాబట్టే ఈ సినిమా మొదలుపెట్టాం'' అన్నారు. అగస్త్య మంజు మాట్లాడుతూ – ''ఈ సినిమా ముంబైలో ఉన్న ధారావి అనే ప్రాంతంలో జరుగుతుంది. ఆ ప్రాంతం అంత 'బ్యూటిఫుల్' ప్లేస్ కాదు. కానీ అక్కడి మనుషులు బ్యూటిఫుల్‌గా ఉంటారు. అందుకే ఆ పేరు పెట్టాం'' అన్నారు. ''రాము త్వరలోనే 'శివ'లాంటి సినిమా తీయాలని కోరుకుంటున్నా'' అన్నారు నిర్మాత సి.కల్యాణ్. ''మా సినిమా గురించి ఎంత చెప్పినా తక్కువే.. పెద్ద సక్సెస్ అవుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు టి.అంజయ్య. ఈ వేడుకలో రామ్‌గోపాల్ వర్మ డ్యాన్స్ చేయడం విశేషం. ఈ వేడుకలో నిర్మాతలు నట్టి కుమార్, తుమ్మలపల్లి రామసత్యనారాయణ, దర్శకులు చంద్ర సిద్ధార్థ్, బీవీఎస్ రవి, హీరో ఆకాష్ పూరి తదితరులు పాల్గొన్నారు.

''మనం చేసే పని మనకు నచ్చితే ఇతరులకు కూడా నచ్చుతుందని నమ్ముతాను. ఈ సినిమాకు నేను చేసిన బ్యాగ్రౌండ్ స్కోర్ నాకు సంతృప్తినిచ్చింది. ప్రేక్షకులు కూడా మెచ్చుకుంటారని ఆశిస్తున్నాను'' అన్నారు గాయకుడు, సంగీతదర్శకుడు కాలభైరవ. సంగీత దర్శకుడు కీరవాణి తనయుడు శ్రీ సింహా హీరోగా పరిచయం అవుతున్న చిత్రం 'మత్తు వదలరా'. రితేష్ దర్శకత్వంలో చిరంజీవి (చెర్రీ), హేమలత నిర్మించారు. ఈ సినిమాతో కీరవాణి మరో తనయుడు, గాయకుడు కాలభైరవ సంగీత దర్శకుడిగా మారారు. 'మత్తు వదలరా' చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా కాలభైరవ చెప్పిన విశేషాలు.

# అప్పుడు కథకు అన్యాయం చేసినవాళ్లం అవుతాం



కాలభైరవ

● చిన్నప్పటి నుంచి సంగీత దర్శకుడు కావాలన్నదే నా కల. నా వాయిస్ కూడా బాగుండటంతో పాటలు పాడాను. ప్లే బ్యాక్ సింగర్‌గా దాదాపు 30 పాటలు పాడాను. 'బాహుబలి 2' చిత్రంలోని 'దండాలయ్యా' పాట నాకు మంచి బ్రేక్ ఇచ్చింది. 'అరవింద సమేత వీరరాఘవ' చిత్రంలోని 'పెనివిటీ' పాట నాకు మంచి పేరు తెచ్చింది. ఇది వరకు నేను 'బాహుబలి: ది లాస్ట్ లెజెండ్స్' యానిమేషన్ వెబ్ సిరీస్‌కు సంగీతం అందించాను. కానీ సంగీత దర్శకుడిగా ఇదే నా మొదటి సినిమా.

● తొలి సినిమా అంటే ఎవరైనా నిరూపించుకోవాల్సిందే. ప్రస్తుతం సంగీత దర్శకుడిగా నేను ఎక్కువమంది ప్రేక్షకులకు తెలియకపోవచ్చు. కానీ ప్రముఖ దర్శకుడు కీరవాణిగారి అబ్బాయి 'మత్తు వదలరా' సినిమాకు సంగీతం అందించాడు. ఎలాంటి సంగీతం ఇచ్చాడు? అనే అంచనాలు ప్రేక్షకుల్లో ఉంటాయి. ఆ ఒత్తిడి నాపై ఉంటుంది. చిత్రబృందం ఇచ్చిన పూర్తి సహకారంతో ఈ ఒత్తిడిని నేను ఫీల్ కాలేదు. నా వరకు నేను వంద శాతం కష్టపడ్డాను. ఐదేళ్ల తర్వాత కాలభైరవ ఎలాంటి సంగీతాన్నైనా ఇవ్వగలడని ప్రేక్షకులు మాట్లాడుకోవాలని కోరుకుంటున్నాను. అందుకోసం కష్టపడతా.

● ఐదారేళ్లుగా నాన్నగారితోనే కలిసి పని చేస్తున్నాను కాబట్టి ఆయన ప్రభావం నాపై ఉంటుంది. ఈ సినిమా కోసం ఆయన దగ్గర కొన్ని సలహాలు తీసుకున్నాను. ముఖ్యంగా ఎమోషన్‌ను ఎలా క్యాప్చర్ చేయాలో నేర్చుకున్నాను. ఒక హిందీ మ్యూజిక్ డైరెక్టర్ తెలుగు సినిమాకు సంగీతం అందిస్తే ఎక్కడో హిందీ టచ్ వినిపిస్తుంది. కానీ నాన్నగారు ఏ భాషలోని సినిమాలకు సంగీతం అందించినా అది ఆ నేటివిటీలో పరిపూర్ణంగా ఉంటుంది. నాన్నగారి పాటలంటే నాకు చాలా ఇష్టం. నాన్నగారు పాటలిచ్చిన సినిమాల్లో 'ఒకరికొకరు' (2003) నా ఫేవరెట్. ఇండస్ట్రీ విషయాలు కాకుండా నాన్నగారు మాకు కొన్ని విషయాలు చెబుతుంటారు. ఏ విషయంలోనైనా మన బుద్ధి చాలా ముఖ్యమని చెప్పారు. నాన్నగారి పేరు నిలబెట్టడానికి కష్టపడతాను.

● 'మత్తు వదలరా'లో హీరో డెలివరీ బాయ్. ఓ డెలివరీ ఇవ్వాల్సిన సమయంలో చిన్న పొరపాటు చేస్తాడు. అది పెద్ద సమస్యకు దారి తీస్తుంది. అప్పుడు ఆ సమస్య నుంచి హీరో ఎలా బయటపడ్డాడు? ఇందుకు అతని స్నేహితులు ఎలా సహాయం చేశారు? అనే విషయాలు ఆసక్తికరంగా ఉంటాయి. సినిమాలో బ్యాగ్రౌండ్ స్కోర్ మాత్రమే ఉంటుంది. పాటలు, బ్యాగ్రౌండ్ స్కోర్ తక్కువ ఉన్నా మ్యూజిక్ విషయాన్ని ఆడియన్స్ బాగానే అబ్జర్వ్ చేస్తారు. ఈ సినిమా కోసం ఓ ప్రమోషనల్ సాంగ్ చేశాం. స్క్రిప్ట్‌లో బలవంతంగా పాట పెడితే కథకు అన్యాయం చేసినవాళ్లం అవుతాం.

● నేను సంగీత దర్శకుడిగా, నా బ్రదర్ శ్రీసింహా హీరోగా ఒకే సినిమాతో పరిచయం అవుతామని కలలో కూడా ఊహించలేదు. చిన్నతనం నుంచే శ్రీసింహాకు నటన అంటే ఆసక్తి. నాకు బ్యాగ్రౌండ్ ఉన్నప్పటికీ అవకాశం గొప్పదని నమ్మే వ్యక్తిని నేను. ఈ సినిమాలో అందరి కంటే చివర్లో జాయిన్ అయిన వ్యక్తిని నేనే. నిర్మాత చెర్రీగారు నాకు అవకాశం ఇచ్చారు. 'మైత్రీ' రవిగారు సహాయం చేశారు.

## మళ్లీ రైడ్

గత ఏడాది హీరో అజయ్ దేవగన్ బాలీవుడ్ వెండి తెరపై చేసిన 'రైడ్' బాక్సాఫీస్ వద్ద వంద కోట్లకుపైగా వసూళ్లను రాబట్టింది. దీంతో మళ్లీ 'రైడ్' చేయడానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు అజయ్. తొలి రైడ్‌లో అజయ్ సరసన హీరోయిన్‌గా నటించిన ఇలియానాయే మలి రైడ్‌లోనూ నటించబోతున్నారని బాలీవుడ్ సమాచారం. 1980 నేపథ్యంలో అప్పటి వాస్తవ సంఘటనల ఆధారంగా రాజ్‌కుమార్ గుప్తా దర్శకత్వంలో 'రైడ్' చిత్రం తెరకెక్కింది. తాజాగా మరో భారీ ఐటీ రైడ్ నేపథ్యంలో 'రైడ్'కు సీక్వెల్ తీయాలనే ఆలోచనలో ఉన్నారట అజయ్ దేవగన్. ఇందుకు తగిన కథాచర్చలు కూడా జరుగుతున్నాయని బాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. మరి.. రెండో 'రైడ్'కు కూడా రాజ్‌కుమార్ గుప్తాయే దర్శకత్వం వహిస్తారా? అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది.




మణిరత్నం

## ఆరు గంటలకు టేక్

ఉదయం మూడు గంటలకే మేకప్ చైర్‌లో కూర్చుని, ఆరు గంటలకల్లా షూట్‌కు సిద్ధంగా ఉంటున్నారట కార్తీ, 'జయం' రవి. క్వాలిటీ విషయంలో కాంప్రమైజ్ కాని దర్శకుడు మణిరత్నం ఆర్డర్ ఇది. 'పొన్నియిన్ సెల్వన్' నవల ఆధారంగా ఆయన దర్శకత్వంలో ఓ భారీ బడ్జెట్ సినిమా తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఇందులో విక్రమ్, కార్తీ, 'జయం' రవి, ఐశ్వర్యారాయ్, త్రిష ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఇటీవల ఈ సినిమా చిత్రీకరణ థాయ్‌ల్యాండ్‌లో ప్రారంభమైన సంగతి తెలిసిందే. ప్రస్తుతం కార్తీ, 'జయం' రవిలపై కీలక సన్నివేశాలను తెరకెక్కిస్తున్నారు. సూర్యోదయం సన్నివేశాలను తీస్తున్నారట మణిరత్నం. ఇది చారిత్రాత్మక చిత్రం కావడంతో నటీనటులు గెటప్పులు భిన్నంగా ఉంటాయి. అందుకే కార్తీ, 'జయం' రవి ఉదయం మూడు గంటలకల్లా మేకప్ రూమ్‌కి ఎటెండ్ అయిపోతున్నారు. అలాగే సహజమైన లైటింగ్‌లో సన్నివేశాలను తీయాలని మణిరత్నం ప్లాన్ చేసుకున్నారట. అందుకని ఉదయం 6 గంటలకు ఫస్ట్ షాట్‌కి టేక్ చెబుతున్నారట. సూర్యాస్తమయం లోపు షూటింగ్ ప్యాకప్ చెబుతున్నారని సమాచారం. ఈ భారీ షెడ్యూల్ ఫిబ్రవరి వరకు థాయ్‌ల్యాండ్‌లోనే జరుగుతుందట. ఈ షెడ్యూల్ ముగిసిన తర్వాత త్రిష, విక్రమ్‌లపై సన్నివేశాలను ప్లాన్ చేశారట. ఈ సినిమా రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు వస్తుందనే ప్రచారం జరుగుతోంది.


# బుంగమూతి పిల్ల



జీపీఎస్, కపిలాక్షి

ఎస్.ఎస్.ఆర్ట్ ప్రొడక్షన్స్, యుగ క్రియేషన్స్ బ్యానర్స్‌పై రాహుల్ భాయ్ మీడియా, దుర్గశ్రీ ఫిల్మ్స్ నిర్మిస్తున్న చిత్రం 'ప్రేమ పిపాసి'. మురళీ రామస్వామి దర్శకత్వంలో పి.ఎస్.రామకృష్ణ నిర్మిస్తున్నారు. జీపీఎస్, కపిలాక్షి మల్హోత్రా, సోనాక్షి వర్మ హీరో హీరోయిన్లు. ఈ చిత్రంలోని 'బుంగమూతి పిల్లదాన' అనే పాటను విడుదల చేశారు. ''ఫిబ్రవరిలో సినిమాను విడుదల చేయాలనుకుంటున్నాం'' అన్నారు పీఎస్ రామకృష్ణ. ''బుంగమూతి పిల్ల..' పాటకు ఆర్స్‌గారు అద్భుతమైన ట్యూన్ ఇస్తే.. సురేష్ ఉపాధ్యాయ మంచి లిరిక్స్ ఇచ్చారు'' అన్నారు మురళీ రామస్వామి. ''టీజర్‌కు మంచి స్పందన వచ్చింది. సోషల్ మీడియాలో డైలాగ్స్ హల్‌చల్ చేస్తున్నాయి'' అన్నారు జీపీయస్. ఈ చిత్రానికి కో–ప్రొడ్యూసర్స్: రాహుల్ పండిట్, జీఎస్ రావు, వై. వెంకటలక్ష్మి, అసోసియేట్ ప్రొడ్యూసర్: యుగంధర్ కొడవటి.

# రాజా వస్తున్నాడు



మమ్ముట్టి

మలయాళ సూపర్‌స్టార్ మమ్ముట్టి లీడ్ రోల్‌లో 'మన్యం పులి' ఫేమ్ వైశాఖ్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'మధుర రాజా'. జై, మహిమా నంబియార్ కీలక పాత్రల్లో, జగపతిబాబు ప్రతినాయకుడిగా నటించారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో మలయాళంలో విడుదలై ఘనవిజయం సాధించిన ఈ చిత్రం తెలుగులో 'రాజా నరసింహ'గా జనవరి 1న ప్రేక్షకుల ముందుకొస్తోంది. జై చెన్నకేశవ పిక్చర్స్ పతాకంపై సాధు శేఖర్ ఈ సినిమాని విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా సాధు శేఖర్ మాట్లాడుతూ– ''అదొక మారుమూల అటవీ ప్రాంతం. ఓ వ్యక్తి తయారు చేసే కల్తీ మందు తాగి 75 మంది చనిపోతారు. ఆ సమస్యను నవ్యాంధ్ర ప్రజాసేన అధ్యక్షుడు రాజా ఎలా తీర్చాడు? అన్నదే ఈ చిత్రకథాంశం. చక్కని సందేశంతో యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన చిత్రమిది. మమ్ముట్టి మాస్ యాక్షన్ , జగపతిబాబు క్యారెక్టర్, గోపీ సుందర్ సంగీతం, సన్నీ లియోన్ ప్రత్యేక గీతం, పీటర్ హెయిన్ పోరాటాలు ఈ సినిమాకు హైలైట్‌గా నిలుస్తాయి. మలయాళంలో వంద కోట్లు వసూలు చేసిన ఈ సినిమా తెలుగులో కూడా మంచి విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది'' అన్నారు. ఈ చిత్రానికి సహనిర్మాత: నూల అశోక్, నిర్మాణ సారథ్యం: వడ్డీ రామానుజం, పురం రాధాకృష్ణ.




## ప్రతి ఊరిలో ఓ ఉత్తర ఉంటుంది



కారుణ్య కత్రేన్

శ్రీరామ్, కారుణ్య కత్రేన్ జంటగా తిరుపతి యస్.ఆర్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'ఉత్తర'. తిరుపతి, శ్రీపతి గంగదాస్ నిర్మించిన ఈ చిత్రం జనవరి 3న విడుదల కానుంది. ఈ సందర్భంగా కారుణ్య మాట్లాడుతూ – ''నేను తెలుగు అమ్మాయినే. చిన్నతనం నుంచే నటన అంటే ఇష్టం. మా అమ్మగారి సపోర్ట్‌తో సినిమాలు చేస్తున్నాను. 'పెళ్లి పుస్తకం (2013)', 'దానవీరశూర కర్ణ' (2015) చిత్రాల్లో చైల్డ్ ఆర్టిస్టుగా చేశాను. 'ఆట 5', 'రాములమ్మ' సీరియల్ మంచి టర్నింగ్ పాయింట్. నా నటనకు నంది అవార్డు వచ్చింది. మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీగారి చేతుల మీదగా మల్టీటాలెంటెడ్‌గా జాతీయ అవార్డు అందుకున్నాను. కథానాయికగా 'బంగారి బాలరాజు' నా తొలి చిత్రం. 'ఉత్తర' నా రెండో చిత్రం. ఇందులో నా పాత్ర పేరు స్వాతి. అందమైన అమ్మాయిలకు పొగరు ఉంటే తప్పుకాదని నమ్మే వ్యక్తిత్వం స్వాతిది. ప్రతి ఊరిలోనూ ఉత్తరలాంటి వారు ఒకరుంటారు. నేను టైటిల్ రోల్ చేయలేదు. ప్రస్తుతం 'ఇట్లు శ్రీమతి'తో పాటు మరో తెలుగు సినిమా, తమిళంలో ఒక సినిమా చేస్తున్నాను'' అన్నారు.







epaper.sakshi.com

# సఖ్యతకు తరుణం



**తెగిపోయిన అనుబంధాల్ని ఈ 'క్రిస్మస్' రోజు పునరుద్ధరించుకోవడమే ప్రధాన ధ్యేయంగా పెట్టుకోండి. లోకంలో చాలా తేలికైన పని బయట పరిచర్య సాగించడం. చాలా కష్టమైన పని తల్లిదండ్రులు, తోబుట్టువులతో సఖ్యత కలిగి ఉండటం. యేసు స్థాపించబూనిన దైవికరాజ్యంలో మీరు భాగం కావాలంటే తొలి అడుగుగా మీ అనుబంధాల్ని పునరుద్ధరించుకొని పటిష్టం చేసుకోండి. హ్యాపీ క్రిస్మస్!!**

దేవుడు తన అద్వితీయ కుమారుడైన, తనకు మానవ రూపమైన యేసుక్రీస్తు సారథ్యంలో నిర్మించి, ప్రపంచవ్యాప్తంగా విస్తరించ తలపెట్టిన 'దైవిక రాజ్యం' ఆవిష్కరణకు అలనాటి యూదా దేశం (నేటి ఇజ్రాయేలు దేశంలోని దక్షిణ భూభాగం) లోని బేత్లెహేము వేదికగా రంగమంతా సిద్ధమయ్యింది. అంతటి మహత్తరమైన పరిణామానికి రెండువేల ఏళ్ల క్రితం, యూదయ అనే ఒక ఎడారి ప్రాంతాన్ని, తరుచు క్షామాలకు లోనయ్యే అక్కడి బెత్లేహేము అనే పేద గ్రామాన్ని, యేసుక్రీస్తుకు ఇహలోకపు తల్లిదండ్రులుగా యూదా వంశీయుడైన యోసేపు, లేవీ వంశీయురాలైన మరియ అనే నిరుపేదలను, యేసు ఆవిర్భావ సువార్త ప్రచారకులుగా బేత్లెహేముకే చెందిన కొందరు నిరుపేద గొర్రెల కాపరులను, దేవుడు తన అనాది సంకల్పంలో భాగంగా ఏర్పర్చుకున్నాడు. పెను విషాదమేమిటంటే, పుడమినేలేందుకు వచ్చిన పరలోకపు రాజైన యేసుకు ఎక్కడ చూసినా పేదరికం, దారిద్ర్యమే తాండవించే యూదయ దేశపు బెత్లేహేములో, అక్కడి సత్రంలోనైనా కనీసం కాసింత చోటు దొరకలేదు. అందువల్ల అక్కడి పశువుల కొట్టంలోనే ప్రభువు జన్మించాడు, పశువులు దాణా తాగేందుకు వాడే ఒక పశువుల తొట్టి ఆయనకు మెత్తటి పూలపాన్పుగా పనికొచ్చింది.

మునుపటి రాజ్యానికి భిన్నంగా.. నిరుపేదలు, నిర్భాగ్యులు, నిరాశ్రయులే ప్రధాన పౌరులుగా ఏర్పాటుచేయ తలపెట్టిన దైవిక రాజ్యాన్ని.. ఇలా పేదరికంలోనే దేవుడు నిర్మించ తలపెట్టాడు. దైవిక రాజ్యస్థాపన కోసం యేసుక్రీస్తు ప్రధాన సైన్యాధికారిగా, పేదలు, బలహీనులే ఆయనకు విధేయులైన సైన్యంగా గత రెండువేల ఏళ్లుగా సాగుతున్న సమరంలో రక్తపుటేరులు కాదు.. ప్రేమ, క్షమాపణ అనే జీవనదులు పొంగి పారుతున్నాయి. చరిత్రలో దుర్నీతి, దౌర్జన్యం, దుష్టన్యాయమే ఇతివృత్తంగా సాగి నిరుపేదల దోపిడీకి పెద్దపీట వేసిన సామ్రాజ్యాలకు ప్రత్యామ్నాయంగా ప్రభువు తన దైవిక రాజ్య స్థాపన కోసం 'క్రైస్తవాన్ని' తన సాత్విక ఆయుధంగా ఎంచుకున్నాడు. క్రీస్తు సారథ్యంలోని 'క్రైస్తవం' దేవుని రాజ్యానికి ప్రతీక. అందువల్ల అవినీతికి, ఆశ్రితపక్షపాతానికి, ఆడంబరాలకు, ధనాపేక్షకు అతీతంగా క్రీస్తును పోలి జీవించే వారే క్రైస్తవం లో పౌరులు.

**దైవిక రాజ్యస్థాపన కోసం యేసుక్రీస్తు ప్రధాన సైన్యాధికారిగా, పేదలు, బలహీనులే ఆయనకు విధేయులైన సైన్యంగా గత రెండువేల ఏళ్లుగా సాగుతున్న సమరంలో రక్తపుటేరులు కాదు.. ప్రేమ, క్షమాపణ అనే జీవనదులు పొంగి పారుతున్నాయి.**

మరి దీనికంతటికీ భిన్నంగా బోధిస్తూ, జీవిస్తూ ఉన్నవాళ్లు ఎవరు? యేసుప్రభువు పరిభాషలో చెప్పాలంటే, వాళ్లు గోధుమల మధ్య 'శత్రువు' కుట్రతో పెరుగుతున్న 'గురుగులు' (మత్తయి 13:27)!! శత్రువులు రెండు రకాలు. ఎదురుగా నిలబడి మనతో యుద్ధం చేసే శత్రువు ఒకరైతే, దొంగచాటు దెబ్బలతో మనిషిని పడగొట్టే శత్రువు మరొకరు. చెట్లతో కిక్కిరిసి ఉన్న కీకారణ్యంలో నడిచే బాటసారులను, వేటగాళ్లను కింద గడ్డిలో దాక్కొని అకస్మాత్తుగా మడిమె మీద కాటేసి చంపే విషసర్పం లాంటి వాడు 'సైతాను' అని పిలిచే ఈ శత్రువు. గోధుమల మధ్య గురుగులు విత్తే అలవాటున్న శత్రువు.. కుటుంబాల్లో, చర్చిల్లో, చివరికి క్రైస్తవ సమాజంలో, మానవ సంబంధాల్ని కలుషితం చేసి చిచ్చు పెట్టడంలో దిట్ట. అందుకే ఈ 'క్రిస్మస్' లో తెగిపోయిన అనుబంధాల్ని పునరుద్ధరించుకోవడమే ప్రధాన ధ్యేయంగా పెట్టుకోండి. లోకంలో చాలా తేలికైన పని బయట పరిచర్య సాగించడం. చాలా కష్టమైన పని తల్లిదండ్రులు, తోబుట్టువు లతో సఖ్యత కలిగి ఉండటం. యేసు స్థాపించబూనిన దైవికరాజ్యంలో మీరు భాగం కావాలంటే తొలి అడుగుగా మీ అనుబంధాల్ని పునరుద్ధరించుకొని పటిష్టం చేసుకోండి. హ్యాపీ క్రిస్మస్!!

– రెవ.డా.టి.ఎ.ప్రభుకిరణ్
ఈమెయిల్: prabhukirant@gmail.com

---

సీరియల్

**ఏ సీరియల్ చూసినా ఆ కథనంలో ఇమిడిపోయేలా అనిపిస్తారు. భిన్నమైన పాత్రలతో అలరిస్తున్నారు. 'ఒకేలాంటి పాత్రలు చేస్తూ ఉంటే బోర్ అనిపించవచ్చు. కానీ, భిన్నమైన పాత్రల వల్ల పనిని ఎంజాయ్ చేస్తున్నాను. వాటి వల్ల మనల్ని మనం నిరూపించుకోవచ్చు' అంటున్నారు టీవీ నటుడు నిరుపమ్ పరిటాల. పుష్కరకాలంగా సీరియల్స్ ద్వారా ఆకట్టుకుంటున్న నిరుపమ్ ప్రస్తుతం కుంకుమపువ్వు, కార్తీకదీపం, ప్రేమ సీరియల్స్ ద్వారా తెలుగు ప్రేక్షకుల అభిమానాన్ని పొందుతున్నారు. తన గురించి 'సాక్షి'తో పంచుకున్న కబుర్లు ఇవి..**

# ప్రేక్షకుల ప్రేమే నా విజయం

'చంద్రముఖి సీరియల్ నా జీవితంలో ఓ మైలు రాయి అని చెప్పవచ్చు. అది కెరియర్ పరంగానూ, జీవితంలో నిలదొక్కునేలా చేసింది. 2007లో మొదలైన ఈ సీరియల్ ద్వారా బుల్లి తెరకు పరిచయం అయ్యాను.

**నాన్న నో చెప్పారు..**

మా నాన్న ఓంకార్ పరిటాల. ఆయన నటుడు, రచయిత. నేను ఈ ఫీల్డ్‌కి రావడం నాన్నకి ఏ మాత్రం ఇష్టం లేదు. చదువుకునేటప్పుడు కెరియర్ అంటూ పెద్ద ఆలోచనలేవీ లేవు. సినిమాల్లోకి రావాలని ఉండేది. కానీ, సోర్స్ అంటూ ఏమీ లేదు. నాన్న మాత్రం 'ముందు చదువుకో, తర్వాత ట్రై చేయవచ్చు' అనేవారు. మాది విజయవాడ. నాన్న నటుడు కావడంతో నా చదువు అంతా చెన్నైలోనే సాగింది. ఇంజినీరింగ్ తర్వాత ఎంబీయే చేశాను. నేను సినిమాల్లోకి రావాలనే ఆలోచనతో చెన్నై నుంచి హైదరాబాద్‌కి షిఫ్ట్ అవ్వాలనుకున్నాం. ఆ సమయంలోనే నాన్న చనిపోయారు. ఆ టైమ్‌లో రెండు విషయాలు ఆలోచించాను. ఒకటి ఉద్యోగం, రెండు సినిమా ఇండస్ట్రీ. ఆ సమయంలోనే నాన్న స్నేహితుల ద్వారా నాకు సీరియల్ అవకాశం వచ్చింది. ఇంకేమీ ఆలోచించకుండా ఓకే చెప్పాను. మొదట్లో నాన్న పేరు నన్ను ఎదుటివారు గుర్తించే వరకే ఉపయోగపడింది. ఆ తర్వాత పనిని బట్టే విలువ ఏర్పడింది. చిన్నప్పటి నుంచి మా నాన్నగారిని చూస్తూ పెరిగాను. తను ఈ ఫీల్డ్ వద్దనడానికి కారణం 'ఒకనాడు బాగుంటుంది, మరోసారి అంత బాగుండకపోవచ్చు' అనే ఉద్దేశంతోనే. అన్నింటికీ సిద్ధపడే రంగంలోకి దిగాను. ఇక్కడ బిహేవియర్, డిసిప్లిన్, డెడికేషన్‌తో ఉంటేనే రాణించడం సాధ్యం. కొంతమంది వైఫల్యాలు చూసి పాఠాలు నేర్చుకున్నాను.



నిరుపమ్ పరిటాల

**భిన్న పాత్రలు**

'కుంకుమపువ్వు' సీరియల్ చేస్తున్న సమయంలో 'కార్తీక దీపం' సీరియల్ డిస్కషన్స్ జరిగాయి. ఆ సీరియల్ ప్రొడ్యూసర్‌తో అప్పటికే 'మూగమనసులు' సీరియల్ చేసున్నాను. ఆ తర్వాత కూడా ఆ టీమ్‌తో టచ్‌లో ఉండేవాడిని. కార్తీక దీపం హీరో వెతుకులాటలో నా సలహా అడిగితే ఒకరిద్దరి పేర్లు కూడా చెప్పాను. వాళ్లతో ఆడిషన్స్ చేసినా క్లియర్ అవ్వలేదు. దీంతో నన్నే చేయమన్నారు. అప్పటివరకు వాళ్ల మనసులో నేను ఉన్నాను అనే విషయం నాకు తెలియదు. 'అత్తారింటికి దారేది' సీరియల్‌లో విలన్ రోల్ చేశాను. జనాలకు ఎప్పుడూ ఒకేలా కనిపించకూడదు.. 'ఇలాగ కూడా మెప్పించగలడు నిరుపమ్..' అనుకోవాలి. ఆ ఆలోచనతో ఒప్పుకున్న పాత్ర అది. అందరూ బాగుంది అన్నారు కానీ, కొంతమంది నెగిటివ్ రోల్ వద్దులెండి అని చెప్పేవారు.

**రచయితగా!**

'నెక్ట్స్ నువ్వే' అనే సినిమాకి స్క్రిప్ట్ రాశాను. ఇప్పుడలాంటివేమీ లేవు. ఒక సీరియల్‌కి పది రోజుల షూటింగ్ షెడ్యూల్ ఉంటుంది. డబ్బింగ్స్ కూడా ఉంటాయి. ప్రస్తుతం ఈ పనుల్లోనే ఉన్నాను. మా ఆవిడ మంజుల కూడా ఇదే ఫీల్డ్. చంద్రముఖి సీరియల్‌లో ఇద్దరం కలిసి చేశాం. ప్రేమించి, పెద్దల అంగీకారంతో పెళ్లి చేసుకున్నాం.

**సర్దుబాట్లు**

మంజుల కూడా సీరియల్ నటి కావడంతో ఇండస్ట్రీలో వర్క్ ఎలా ఉంటుందో తనకు బాగా తెలుసు. తన పని వేరు, నా పని వేరు. ఇద్దరం మెచ్యూర్డ్‌గా ఉంటాం. ఎప్పుడైనా చిన్న చిన్న వాదనలు వచ్చినా అర్థం చేసుకుంటాం. తనకోసం టీవీ షోస్‌లో కపుల్ డ్యాన్స్‌కి అవకాశం ఉంటే, ప్రాక్టీస్ చేసి మరీ ఆ ప్రోగ్రామ్‌లో పాల్గొన్నాను. టైమ్‌కి సంబంధించి కంప్లైంట్స్ ఉంటాయి మా ఇద్దరికి. ఏదో విధంగా సర్ది చెప్పుకుంటాను.



భార్య మంజుల, కుమారుడితో నిరుపమ్

**ప్రొడక్షన్‌వైపుగా అడుగు**

చంద్రముఖి నుంచి కార్తీక దీపం వరకు గ్రోత్ పరంగా చూసుకుంటూ 'జీ తెలుగు'లో ఇప్పుడు 'ప్రేమ' సీరియల్‌తో ప్రొడక్షన్ వైపుగానూ వెళ్లాను. అనుకోకుండా వచ్చిన బాధ్యత ఇది. ఇందులో లీడ్ రోల్ కూడా చేస్తున్నాను. అన్నీ ప్లాన్ ప్రకారం చేసుకుంటూ వెళితే ఏదీ మిస్ చేసుకోలేం. రోజు మొత్తం ఈ ఇండస్ట్రీకి సంబంధించిన ఆలోచనలు, షెడ్యూల్.. ఉంటుంది కాబట్టి అన్నీ సాఫీగా సాగిపోతున్నాయి.

– నిర్మలారెడ్డి

---

సినీ పరివారం

# మై మదర్ టి.కృష్ణకుమారి



కుమార్తె దీపికతో కృష్ణకుమారి

**చక్కటి ఒడ్డూ పొడుగు, పెద్ద పెద్ద కళ్లు, పొందికైన శరీరంతో తెలుగు చలనచిత్ర పరిశ్రమలో గ్లామర్ క్వీన్‌గా మెరిశారామె. జానపదాలలో ఎక్కువ నటించారు. వాటిలో కత్తుల కాంతారావుతో కలసికట్టుగా చేసినవే అధికం. ఒక కంట కన్నీటిని, మరోకంట పన్నీటిని కూడా అలవోకగా అభినయించిన ఆ అభినేత్రి కృష్ణకుమారి. కెరీర్‌లో బాగా బిజీగా ఉన్న కృష్ణకుమారి, ఒక అనాథ బాలికను దత్తత తీసుకున్నారు. ఆమెను సినిమాలకు దూరంగా అల్లారు ముద్దుగా పెంచారు. 'తనను కన్న తల్లి కంటె గారంగా పెంచారు' అని తల్లి గురించి సాక్షికి వివరించారు దీపిక. ఆమె తెలిపిన వివరాలే ఈ వారం మన సినీ పరివారం.**

అమ్మీకి దత్తుకుమార్తె అని ఇప్పుడు అంటున్నారు కానీ నాకసలు 19 సంవత్సరాల వయసు వచ్చేవరకు ఆమె నన్ను దత్తు తీసుకుందనే విషయమే తెలియదు. విషయం తెలిశాక నాకు అమ్మ మీద గౌరవం పెరిగింది. మా పెద్దమ్మ షావుకారు జానకి. ఆవిడ తన పిల్లలతో సమానంగా చూస్తుంది నన్ను కూడా. ఇంకా చెప్పాలంటే, నాతో మరింత ఎక్కువ ప్రేమగా ఉంటుంది. అమ్మ కెరీర్ సుదీర్ఘ కాలం నడిచింది. అందువల్ల వివాహం కూడా ఆలస్యంగా అయ్యింది. 1978లో నేను మూడు నెలల పసిపిల్లగా ఉన్నప్పుడు, వన్‌శంకరిలో ఉన్న అనాథాశ్రమం నుంచి నన్ను దత్తత తీసుకుంది అమ్మ. నేను అమ్మను అమ్మీ అని పిలిచేదాన్ని. నేను మదనపల్లిలో జిడ్డు కృష్ణమూర్తి స్కూల్‌లో పదో తరగతి వరకు చదువుకున్నాను. స్కూల్ నుంచి ఇంటికి వచ్చాక అమ్మమ్మ వాళ్లతో పచ్చీస్, చింత గింజలు, క్యారమ్ బోర్డు లాంటివి ఆడేదాన్ని. అమరచిత్ర కథలు, పిల్లల మహాభారతం చదివించేది. నా హిందీ టెక్స్ట్ చదివి, అమ్మీ హిందీ నేర్చుకుంది. అమ్మీకి గార్డెనింగ్ అంటే చాలా ఇష్టం.



భర్త అజయ్ మోహన్, కుమార్తె దీపికతో కృష్ణకుమారి

**అమ్మతో గడిపిన రోజులు నేను మరచిపోలేను**

అమ్మీ షూటింగ్ నుంచి ఇంటికి వచ్చాక ఆ రోజు జరిగిన షూటింగ్ వివరాలతోపాటు, నటీనటులంతా ఒకే కుటుంబంలా ఎంత సరదాగా ఉండేవారో చెప్పేది. చిన్నతనంలో అమ్మీ నాకు అన్నం తినిపిస్తూ, తను నటించిన సినిమాలు చూపించేది. నాకు మైథాలజీ, మాయలు మంత్రాల చిత్రాలంటే చాలా ఇష్టం. నేను ఒక సెలబ్రిటీలాగే ఎదిగాను. ఇంట్లో మాత్రం మామూలుగానే ఉండేవాళ్లం. కుటుంబం కోసం అమ్మీ చదువు ఆపేయవలసి వచ్చింది. అందుకు అమ్మీ అప్పుడప్పుడు బాధపడుతుండేది. నాకు స్నేహితులు చాలామంది ఉన్నారు. వాళ్లని ఇంటికి తీసుకువస్తే అమ్మీనే స్వయంగా వండి పెట్టేది. అమ్మీ వంటలు చాలా బాగా చేసేది. ఇడ్లీలు చేయడంలో ఎక్స్‌పర్ట్. వంట అమ్మీనే స్వయంగా చేసేది. నాన్నకి అమ్మీ అంటే చాలా ఇష్టం. అమ్మ సినిమాలు కాదు, అమ్మీ చేతి వంట అంటే ప్రీతి. అమ్మ ప్రతి వంటకం తయారీ గురించీ ఒక పుస్తకంలో రాసి పెట్టుకుంది. ఆ పుస్తకం ఇప్పటికీ నా దగ్గర ఉంది. మాది పెద్ద ఫామ్ హౌస్. అన్ని కూరలు అమ్మీ స్వయంగా పండించేది. ఒక్క కూర కూడా బయట నుంచి కొనలేదు మేం.

**మా అబ్బాయంటే ప్రాణం**

నా పెళ్లి అమ్మ వాళ్లే చేయాలనుకుని, చాలా సంబంధాలే తెచ్చారు, నేను రిజెక్ట్ చేశాను. చాలా మంది నిర్మాతలు కూడా నన్ను కోడలు చేసుకోవాలని అమ్మని అడిగారట. అందరూ మా డబ్బు కోసం చూసినవారు కావడంతో అమ్మ నిరాకరించింది. నా స్నేహితులే విక్రమ్ అనే అబ్బాయిని ఎంపిక చేసి, 2003లో నా వివాహం జరిపించారు. మా వివాహాన్ని అమ్మ వాళ్లు మొదట్లో అంగీకరించలేకపోయారు. కొంత కాలం తరవాత అంగీకరించారు. 2006లో నాకు బాబు పుట్టాడు. పవన్ మయ్యా అని పేరు పెట్టుకున్నాం. వాడు పుట్టినప్పుడు 'ఆపిల్ ఆఫ్ ద ఐ' డిజైన్‌లో మాకు ఇల్లు కట్టించారు అమ్మీవాళ్లు. మా అబ్బాయిని చాలా ప్రేమగా చూసేది. అమ్మీ చాలా లవింగ్ అండ్ ఓపెన్ హార్టెడ్ పర్సన్. ఇంటికి ఎవరు వచ్చినా మర్యాదగా చూసేది. షాపింగ్ బాగా చేసేది. ఒకే ఒక్క హిందీ సినిమాలో నటించింది. నాన్న వద్దనడంతో మానుకుంది.


అమ్మ 20 సంవత్సరాల పాటు నాన్నతో లివ్ ఇన్ టుగెదర్‌గా ఉంది. నాన్నగారు అజయ్ మోహన్ ఖైతాన్ చాలా బాగా చదువుకున్నారు. పెళ్లి అయిపోయిందని తెలిస్తే సినిమా అవకాశాలు రావని ఉద్దేశంతో అమ్మ ఆ విషయాన్ని రహస్యంగా ఉంచింది. పిల్లలు లేని ఇంటికి నేను ఇంటికి దీపంలా వచ్చాననే ఉద్దేశంతో నాకు దీపిక అని పేరు పెట్టారు. నా 21వ ఏట, డ్రీమ్ డ్రీమ్ పేరున ఒక ఎన్‌జీవో ప్రారంభించాను. ఎయిడ్స్‌తో బాధపడుతున్న వారి పిల్లలకి, క్యాన్సర్ బాధితుల పిల్లలకి వృత్తివిద్యలలో శిక్షణ ఇప్పిస్తున్నాం. అది నేటికీ విజయవంతంగా నడుస్తోంది. ప్రస్తుతం అందులో నేను యాక్టివ్‌గా ఉండట్లేదు. మయ్యా పబ్లిషింగ్ హౌస్ ప్రారంభించి, అన్ని రకాల పుస్తకాలను ఆన్‌లైన్‌లో పెడుతున్నాం. నాకు కుక్కలంటే ప్రాణం. ప్రాణిక్ హీలింగ్ నమ్ముతాను. గతంలో మోటరోలా, జీ కంపెనీలలో పని చేశాను. సొంతగా ఇంటీరియర్ కంపెనీ కొంతకాలం నడిపాను. నాన్నగారు గ్లకోమాతో బ్లైండ్ అయ్యారు. అప్పుడు నేను ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపాను. 2012లో నాన్న పోయాక చాలా ఇబ్బందులు పడ్డాం. అమ్మ 2018లో మరణించారు. 'మై మదర్ టి. కృష్ణకుమారి' అని అమ్మ మీద ఇంగ్లీషులో బయోగ్రఫీ రాశాను. ప్రస్తుతం కుటుంబం, గార్డెనింగ్, ప్రాణిక్ హీలింగ్ పనుల్లో బిజీగా ఉన్నాను. మా వారు మధ్వులు. ఉడిపి నుంచి వచ్చారు. లాల్ బాగ్ హోటల్‌తో పాటు సుమారు 15 రెస్టారెంట్లు ఉన్నాయి.

– సంభాషణ: డా. వైజయంతి పురాణపండ

---

పరిశోధన

# లేజర్ కిరణాలతో కొత్త రకం ఎక్స్‌రేలు!




మనిషి శరీరం లోపల ఏముందో తెలుసుకోవాలంటే.. ఎక్స్‌రేలు తీయాలి. లేదంటే అల్ట్రాసౌండ్ లాంటి టెక్నాలజీలు ఉపయోగించాలి. ఎక్స్ రేలతో రేడియోధార్మికత సమస్యలు ఉండగా.. అల్ట్రాసౌండ్‌తోనూ కొన్ని చిక్కులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మసాచూసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ శాస్త్రవేత్తలు లేజర్ కిరణాలు, అల్ట్రాసౌండ్‌లు రెండింటినీ కలిపి అభివృద్ధి చేసిన ఒక కొత్త టెక్నాలజీ అందరిలోనూ ఆసక్తి రేకెత్తిస్తోంది. శరీరానికి తాకించకుండానే.. కొంచెం దూరం నుంచే శరీరం లోపలి చిత్రాలను తీయగలగడం ఈ టెక్నాలజీలోకి కీలకాంశం. ఇంకో కీలకమైన విషయం ఏమిటంటే.. దీనికోసం పెద్ద పెద్ద యంత్రాల అవసరమూ ఉండదు. లేజర్ కిరణాలతో మనకు వినిపించని స్థాయిలో ఉండే శబ్ద తరంగాలను పుట్టించడం వాటిని శరీరంలోపలికి పంపి ప్రతిధ్వనులను గుర్తించి ఛాయా చిత్రాన్ని తయారు చేయడం ఈ కొత్త టెక్నాలజీ పనిచేసే విధానం. ఈ కొత్త టెక్నాలజీతో ఇప్పటికే తాము కొన్ని ప్రయోగాలు చేశామని, జంతు కణజాలం, మనిషి చర్మాన్ని పోలిన పదార్థంపై వాడినప్పుడు మంచి ఫలితాలే వచ్చాయని ఈ పరిశోధనల్లో పాల్గొన్న శాస్త్రవేత్త ఆంటోనీ తెలిపారు. ప్రస్తుతం ఇది సంప్రదాయ అల్ట్రాసౌండ్ టెక్నాలజీ ఛాయా చిత్రం స్థాయి నాణ్యత మాత్రమే ఇస్తోందని, కొన్ని మార్పులు చేర్పులు చేయడం ద్వారా మెరుగైన, నాణ్యమైన చిత్రాలు తీయడం కష్టమేమీ కాదని వివరించారు. శరీరాన్ని తాకకుండానే లోపలి భాగాల పరిస్థితిని తెలుసుకోగలగడం కాలిన గాయాలైన వారికి, సున్నితమైన చర్మమున్న పసిపిల్లలకు ఎంతో ఉపయోగపడుతుందని ఆంటోనీ వివరించారు. పైగా అల్ట్రాసౌండ్ పరికరాల మాదిరిగా లేజర్ కిరణాల టెక్నాలజీతో చాయా చిత్రాలు తీసేందుకు ప్రత్యేకమైన సిబ్బంది అవసరమూ ఉండదు.

సాక్షి భవిత
సోమవారం నుంచి శుక్రవారం వరకు
మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక, రోడ్ నంబరు-1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. ఈ-మెయిల్ sakshieducation@gmail.com
స్పర్ధయా వర్ధతే విద్య
బుధవారం
25-12-2019

నోటిఫికేషన్

# కొత్తగా క్లాట్ 2020



**ప్రతిష్టాత్మక నేషనల్ లా యూనివర్సిటీల్లో ప్రవేశానికి నిర్వహించే క్లాట్ 2020 నోటిఫికేషన్ విడుదలైంది. దాంతోపాటే క్లాట్ కొత్త పరీక్ష విధానంపై స్పష్టత వచ్చింది. ప్రశ్న పత్రంలో 150 ఆబ్జెక్టివ్ తరహా ప్రశ్నలు ఉంటాయని నిర్వహణ సంస్థ నేషనల్ లా యూనివర్సిటీల (ఎన్‌ఎల్‌యూ) కన్సార్టియం పేర్కొంది. క్లాట్ 2020 ఆఫ్‌లైన్ విధానంలో (పెన్-పేపర్) జరుగనుంది. 12వ తరగతి స్థాయిలో ప్రశ్న పత్రం ఉంటుంది. క్వాంటిటేటివ్ అనాలసిస్ విభాగం మాత్రం పదోతరగతి మ్యాథమెటిక్స్ స్థాయిలో ఉండనుంది. అదేవిధంగా క్లాట్ పీజీలో తొలిసారిగా కటాఫ్ మార్కుల విధానం ప్రవేశం పెట్టారు. ఈ నేపథ్యంలో.. క్లాట్ 2020 నోటిఫికేషన్ వివరాలు, అర్హతలు, పరీక్ష నూతన విధానం, సిలబస్ విశ్లేషణ, ప్రిపరేషన్ టిప్స్..**

» క్లాట్ 2020 నోటిఫికేషన్ విడుదల
» 200 నుంచి 150 ప్రశ్నలకు ప్రశ్న పత్రం కుదింపు
» మే 10, 2020న ఆఫ్‌లైన్ విధానంలో దేశవ్యాప్తంగా పరీక్ష
» 21 ఎన్‌ఎల్‌యూల్లో 2500 యూజీ, 720 పీజీ లా సీట్లు భర్తీ

### మారిన క్లాట్

- గతేడాది వరకూ క్లాట్ యూజీ పరీక్ష 200 ప్రశ్నలు-200 మార్కులకు జరిగేది.
- క్లాట్ 2020 మాత్రం 150 ప్రశ్నలు-150 మార్కులకు నిర్వహించనున్నారు.
- పరీక్ష సమయం రెండు గంటలు. ప్రశ్న పత్రం మల్టిపుల్ చాయిస్ విధానంలో ఉంటుంది.
- ఇంగ్లిష్ లాంగ్వేజ్, కరెంట్ అఫైర్స్, జనరల్ నాలెడ్జ్, లాజికల్ రీజనింగ్, లీగల్ రీజనింగ్, క్వాంటిటేటివ్ టెక్నిక్స్ అంశాల నుంచి ప్రశ్నలు అడగనున్నారు.
- పరీక్ష ప్రశ్న పత్రం కాంప్రెహెన్షన్ ఆధారితంగా ఉంటుంది. పరీక్షలో సిలబస్‌లోని అన్ని విభాగాల నుంచి కాంప్రెహెన్షన్ ఆధారిత ప్రశ్నలు ఎదురవుతాయి.
- ప్రశ్న పత్రం 12వ తరగతి స్థాయిలో ఉంటుంది. అయితే క్వాంటిటేటివ్ అనాలసిస్ విభాగం మాత్రం పదో తరగతి మ్యాథ్స్ స్థాయిలో ఉంటుంది.
- క్లాట్ పీజీలో... ఆబ్జెక్టివ్ (100 ప్రశ్నలు), సబ్జెక్టివ్ (2ప్రశ్నలు- 50 మార్కులు).. ఇలా రెండు రకాల ప్రశ్నలు ఉంటాయి. ఆబ్జెక్టివ్ పరీక్షలో ప్రతి ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం 100 ప్రశ్నలు- 100 మార్కులకు పరీక్ష జరుగుతుంది. ప్రతి తప్పు సమాధానానికి 1/4 మార్కుల కోత విధిస్తారు. సబ్జెక్టివ్ పేపర్‌లో.. ఎస్సే తరహా ప్రశ్నలు రెండు ఉంటాయి. ఒక్కో ప్రశ్నకు 25 మార్కుల చొప్పున మొత్తం 50 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. పరీక్ష సమయం రెండు గంటలు.
- క్లాట్ పీజీ ఆబ్జెక్టివ్ తరహా పరీక్షలో జనరల్ అభ్యర్థులు కనీసం 45(ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూడీ అభ్యర్థులకు 35 శాతం మార్కులు) శాతం మార్కులు సాధించాలి. దీంతో ఇప్పుడు కటాఫ్ మార్కులు సాధించడం కీలకంగా మారింది.

### అర్హతలు

- **క్లాట్ యూజీ:** 10+2/ఇంటర్మీడియెట్‌లో కనీసం 45 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులు కనీసం 40 శాతం మార్కులు తెచ్చుకోవాలి. విద్యార్హత ఫైనల్ పరీక్షలు మార్చి/ఏప్రిల్ 2020లో రాసే అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఎలాంటి గరిష్ఠ వయోపరిమితి నిబంధన లేదు.
- **క్లాట్ పీజీ:** అభ్యర్థులు ఎల్‌ఎల్‌బీని కనీసం 55 శాతం మార్కులతో పూర్తి చేయాలి. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులు కనీసం 50 శాతం మార్కులు తెచ్చుకోవాలి. ఫైనల్ ఇయర్ విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఎలాంటి గరిష్ఠ వయోపరిమితి నిబంధనలేదు.

### ప్రవేశం ఇలా

- నేషనల్ లా యూనివర్సిటీలు క్లాట్ యూజీ, పీజీ టెస్ట్‌ల్లో సాధించిన స్కోర్‌తోపాటు అభ్యర్థి ఇచ్చిన ఆప్షన్ల ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించి సంబంధిత కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తాయి.
- క్లాట్ యూజీ, పీజీ పరీక్షలో స్కోర్ ఆధారంగా ఆయా నేషనల్ లా యూనివర్సిటీల్లో బీఏ ఎల్‌ఎల్‌బీ, బీఎస్సీ ఎల్‌ఎల్‌బీ, బీబీఏ ఎల్‌ఎల్‌బీ, బీకామ్ ఎల్‌ఎల్‌బీ, బీఎస్‌డబ్ల్యూ ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం కోర్సుల్లో అడ్మిషన్ లభిస్తుంది.

### 21 ఇన్‌స్టిట్యూట్‌లు... 2500 సీట్లు

- నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ స్టడీ అండ్ రీసెర్చ్ ఇన్ లా (ఎన్‌యూఎస్‌ఆర్‌ఎల్), రాంచీ...

క్లాట్ 2020ను ఆఫ్‌లైన్ విధానంలో (పెన్-పేపర్) నిర్వహించనుంది. క్లాట్ యూజీ, పీజీ పరీక్షల స్కోర్ ఆధారంగా దేశవ్యాప్తంగా ఉన్న 21 నేషనల్ లా యూనివర్సిటీ(ఎన్‌ఎల్‌యూ)ల్లో యూజీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు. వీటిల్లో దాదాపు 2500 అండర్‌గ్రాడ్యుయేట్(యూజీ) సీట్లు, 720 పోస్ట్‌గ్రాడ్యుయేట్ (పీజీ) సీట్లు అందుబాటులో ఉన్నాయి. క్లాట్ స్కోర్ ఆధారంగా ఎన్‌ఎల్‌యూలతోపాటు పలు ప్రైవేట్ లా విద్యాసంస్థలు సైతం ప్రవేశాలు కల్పిస్తున్నాయి.

- **ప్రవేశం కల్పించే 21 నేషనల్ లా యూనివర్సిటీలు ఇవే:** » ఎన్‌ఎల్‌ఎస్‌ఐయూ, బెంగళూరు » నల్సార్, హైదరాబాద్ » ఎన్‌ఎల్‌ఐయూ, భోపాల్ » డబ్ల్యూబీఎన్‌యూజేఎస్, కోల్‌కతా » ఎన్‌ఎల్‌యూ, జోధ్‌పూర్ » హెచ్‌ఎన్‌ఎల్‌యూ, రాయ్‌పూర్ » జీఎన్‌ఎల్‌యూ, గాంధీనగర్ » ఆర్‌ఎంఎల్‌ఎన్‌ఎల్‌యూ, లక్నో » ఆర్‌జీఎన్‌యూఎల్, పంజాబ్ » సీఎన్‌ఎల్‌యూ, పాట్నా » ఎన్‌యూఏఎల్‌ఎస్, కోచి » ఎన్‌ఎల్‌యూఓ, ఒడిసా » ఎన్‌యూఎస్‌ఆర్‌ఎల్, రాంచి » ఎన్‌ఎల్‌యూజేఏ, అస్సాం » డీఎస్‌ఎన్‌ఎల్‌యూ, విశాఖపట్నం » ఎమ్‌ఎన్‌ఎల్‌యూ, ముంబయి » ఎంఎన్‌ఎల్‌యూ, నాగ్‌పూర్ » ఎంఎన్‌ఎల్‌యూ, ఔరంగాబాద్ » హెచ్‌పీఎన్‌ఎల్‌యూ, షిమ్లా » డీఎన్‌ఎల్‌యూ, జబల్‌పూర్ » డీబీఆర్‌ఏఎన్‌ఎల్‌యూ, హర్యానా.


### యూజీ సిలబస్

- ఇంగ్లిష్ విభాగంలో కాంప్రెహెన్షన్ ప్యాసేజ్‌లు, గ్రామర్ అంశాల నుంచి ప్రశ్నలు అడిగే అవకాశముంది.
- మ్యాథమెటిక్స్‌లో.. పదోతరగతి స్థాయిలోని ఎలిమెంటరీ మ్యాథమెటిక్స్ నుంచి ప్రశ్నలు ఎదురవుతాయి.
- జనరల్ నాలెడ్జ్ విభాగంలో.. స్టాటిక్ జనరల్ నాలెడ్జ్ పై ప్రశ్నలు అడిగే వీలుంది.
- కరెంట్ అఫైర్స్‌లో జాతీయ, అంతర్జాతీయ వార్తలు, తాజా పరిణామాలపై ప్రశ్నలు వచ్చే అవకాశముంది.
- లాజికల్ రీజనింగ్ అంశం నుంచి అభ్యర్థి లాజికల్, అనలిటికల్ సామర్థ్యాలను పరీక్షించేలా ప్రశ్నలు అడుగుతారు.
- లీగల్ ఆప్టిట్యూడ్‌లో.. స్టడీ ఆఫ్ లా, రీసెర్చ్ ఆప్టిట్యూడ్, ప్రాబ్లం సాల్వింగ్ ఎబిలిటీతో పాటు హైపోథెటికల్ సిట్యూవేషన్స్‌పైన ప్రశ్నలు ఎదురవుతాయి.

### పీజీ సిలబస్

- క్లాట్ పీజీ సిలబస్‌లో... కాన్స్‌టిట్యూషనల్ లాతోపాటు ఇతర లా సబ్జెక్టులైన కాంట్రాక్ట్, టార్ట్స్, క్రిమినల్ లా, ఇంటర్నేషనల్ లా, ఐపీఆర్, జురిస్ ప్రుడెన్స్‌తదితర అంశాలు ఉంటాయి.

### ప్రిపరేషన్ టిప్స్



- ఏటేటా క్లాట్‌కు పోటీ పెరుగుతున్న దృష్ట్యా సాధ్యమైనంత త్వరగా ప్రిపరేషన్ ప్రారంభించాలి. ఫలితంగా సిలబస్‌లోని అన్ని టాపిక్స్‌ను సమగ్రంగా అధ్యయనం చేయడంతోపాటు రివిజన్‌కు సమయం లభిస్తుంది.
- మొదట సిలబస్ అంశాలను విశ్లేషించి.. తన బలాలు, బలహీనతలను గుర్తించి..అందుకు అనుగుణంగా పటిష్ట ప్రిపరేషన్ ప్రణాళిక రూపొందించుకోవాలి.
- ప్రిపరేషన్‌కు ప్రామాణిక పుస్తకాలను ఎంచుకోవడం మేలు చేస్తుంది. ఆయా పుస్తకాల భాష సైతం సరళంగా ఉండేలా చూసుకోవాలి.
- సిలబస్ మొత్తం ఒకసారి చదవడం పూర్తిచేశాక.. గత ప్రశ్న పత్రాలను, మోడల్ పేపర్లను తరచూ ప్రాక్టీస్ చేయడం లాభిస్తుంది.
- పరీక్షకు నెల రోజుల ముందు నుంచి మాక్ టెస్టులకు హాజరుకావచ్చు. అంతేకాకుండా రివిజన్‌కు ఎక్కువ సమయం కేటాయించడం సక్సెస్‌కు దోహదం చేస్తుంది.

### ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** జనరల్/ఓబీసీ అభ్యర్థులకు రూ.4000; ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు రూ.3500.
- **దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం:** జనవరి 1, 2020
- **దరఖాస్తులకు చివరి తేది:** మార్చి 31, 2020
- **క్లాట్ 2020 పరీక్ష తేది:** మే 10, 2020
- **ఫలితాల వెల్లడి:** మే 24, 2020
- **వెబ్‌సైట్:** **https://consortiumofnlus.ac.in**

## ఢిల్లీ పోలీస్-649

ఢిల్లీ పోలీస్ విభాగం దేశవ్యాప్తంగా అర్హులైన స్త్రీ, పురుష అభ్యర్థుల నుంచి 649 హెడ్ కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **విభాగాల వారీ ఖాళీలు:** పురుషులు- ఓపెన్-392, డిపార్ట్‌మెంటల్-43; స్త్రీలు- ఓపెన్-193, డిపార్ట్‌మెంటల్-21.
» **అర్హత:** సైన్స్, మ్యాథ్స్ సబ్జెక్టులతో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత/సంబంధిత సబ్జెక్టుల్లో నేషనల్ ట్రేడ్ సర్టిఫికెట్ (ఎన్‌టీసీ)తో పాటు టైపింగ్, కంప్యూటర్ నాలెడ్జ్ ఉండాలి.
» **వయసు:** 2019, జులై 1 నాటికి 18-27 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక:** రాతపరీక్ష ఆధారంగా ఎంపిక చేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» **దరఖాస్తు ఫీజు:** రూ.100.
» **దరఖాస్తులు ప్రారంభం:** డిసెంబర్ 28, 2019.
» **దరఖాస్తుకు చివరితేదీ:** జనవరి 27, 2020.
» **వెబ్‌సైట్:** **www.delhipolice.nic.in**

# ఆర్‌బీఐలో కొలువు

## నెలకు రూ.36వేల వేతనం

» 926 అసిస్టెంట్ పోస్టుల భర్తీకి ఆర్‌బీఐ నోటిఫికేషన్
» డిగ్రీ అర్హతతోనే కేంద్ర బ్యాంకులో కొలువుదీరొచ్చు
» మూడంచెల విధానంలో ఎంపిక ప్రక్రియ

ముంబై ప్రధాన కేంద్రంగా ఉన్న రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ).. దేశవ్యాప్తంగా వివిధ బ్రాంచుల్లో ఖాళీగా ఉన్న 926 అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. దీని ద్వారా డిగ్రీ అర్హతతోనే కేంద్ర బ్యాంకులో కొలువు సొంతం చేసుకోవచ్చు. దేశవ్యాప్తంగా జరిగే పోటీ పరీక్షల్లో ప్రతిభ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఎంపికైతే ప్రారంభంలోనే అన్నీ కలుపుకొని నెలకు రూ.36,091 వరకూ వేతనం అందుకోవచ్చు.

» **అర్హత:** కనీసం 50 శాతం మార్కులతో ఏదైనా బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణత. ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూడీ వర్గాలు ఉత్తీర్ణత సాధిస్తే సరిపోతుంది.
» **వయసు:** 2019, డిసెంబర్ 1 నాటికి 20-28 ఏళ్ల మధ్య ఉండాలి. రిజర్వేషన్ వర్గాలకు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ విధానంలో ప్రిలిమినరీ, మెయిన్ ఎగ్జామినేషన్‌తోపాటు లాంగ్వేజ్ ప్రొఫిషియన్సీ టెస్ట్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

### ప్రిలిమినరీ 100 మార్కులకు

» ప్రిలిమినరీ పరీక్షలో ఇంగ్లిష్ లాంగ్వేజ్ 30 ప్రశ్నలు-30 మార్కులు, న్యూమరికల్ ఎబిలిటీ 35 ప్రశ్నలు-35 మార్కులు, రీజనింగ్ ఎబిలిటీ 35 ప్రశ్నలు-35 మార్కులకు.. అంటే మొత్తం 100 ప్రశ్నలు-100 మార్కులకు పరీక్ష జరుగుతుంది. పరీక్ష ఆబ్జెక్టివ్ తరహాలో ఉంటుంది. పరీక్ష సమయం 60 నిమిషాలు. ప్రిలిమినరీ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులను మెయిన్ పరీక్షకు అనుమతిస్తారు.

### మెయిన్ పరీక్ష 200 మార్కులకు

మెయిన్ పరీక్షను 200 మార్కులకు ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో టెస్ట్ ఆఫ్ రీజనింగ్ 40 ప్రశ్నలు-40 మార్కులు, టెస్ట్ ఆఫ్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ 40 ప్రశ్నలు-40 మార్కులు, టెస్ట్ ఆఫ్ న్యూమరికల్ ఎబిలిటీ 40 ప్రశ్నలు-40 మార్కులు, టెస్ట్ ఆఫ్ జనరల్ అవేర్‌నెస్ 40 ప్రశ్నలు-40 మార్కులు,టెస్ట్ ఆఫ్ కంప్యూటర్ నాలెడ్జ్ 40 ప్రశ్నలు-40 మార్కులకు పరీక్ష జరుగుతుంది. పరీక్ష సమయం 135 నిమిషాలు.

### లాంగ్వేజ్ ప్రొఫిషియన్సీ టెస్ట్

ఆన్‌లైన్ విధానంలో జరిగిన మెయిన్ పరీక్షలో ప్రతిభ ద్వారా షార్ట్‌లిస్ట్ అయిన అభ్యర్థులకు లాంగ్వేజ్ ప్రొఫిషియన్సీ టెస్ట్ (ఎల్‌పీటీ) నిర్వహిస్తారు. సంబంధిత రాష్ట్ర అధికారిక/స్థానిక భాషలో అభ్యర్థి నైపుణ్యాన్ని పరీక్షించేలా ఈ పరీక్ష ఉంటుంది. ఎల్‌పీటీలో ఉత్తీర్ణత సాధించని అభ్యర్థులను అనర్హులుగా ప్రకటిస్తారు.

### ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» **దరఖాస్తుకు చివరితేదీ:** జనవరి 16, 2020.
» **ప్రిలిమినరీ పరీక్ష తేదీలు:** 2020, ఫిబ్రవరి 14, 15 తేదీల్లో జరుగుతుంది.
» **మెయిన్ పరీక్ష తేదీలు:** మార్చి, 2020.
» **వెబ్‌సైట్:** **www.rbi.org.in**

## ఏఎండీ-78

హైదరాబాద్ కేంద్రంగా ఉన్న భారత అణుశక్తి విభాగానికి చెందిన అటామిక్ మినరల్స్ డైరెక్టరేట్ ఫర్ ఎక్స్‌ప్లొరేషన్ అండ్ రీసెర్చ్ (ఏఎండీ).. వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 78 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **పోస్టులు:** సైంటిఫిక్ ఆఫీసర్, సైంటిఫిక్ అసిస్టెంట్-బీ, టెక్నీషియన్-బీ, స్టెనోగ్రాఫర్ గ్రేడ్-3, అప్పర్ డివిజన్ క్లర్క్, డ్రైవర్.
» **అర్హత:** పోస్టులను బట్టి సంబంధిత సబ్జెక్టుల్లో డిప్లొమా, ఎంబీబీఎస్, బీఎస్సీ, గ్రాడ్యుయేషన్ , మెట్రిక్యులేషన్ ఉత్తీర్ణత, తత్సమాన అర్హత, అనుభవం ఉండాలి.
» **వయసు:** 35 ఏళ్లకు మించకూడదు. రిజర్వేషన్ల ఆధారంగా వయో సడలింపు ఉంటుంది.
» **ఎంపిక:** రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలి.
» **దరఖాస్తులు ప్రారంభం:** డిసెంబర్ 21, 2019.
» **దరఖాస్తుకు చివరితేదీ:** జనవరి 10, 2020.
» **వెబ్‌సైట్:** **https://amd.gov.in**

## ఎన్‌ఎఫ్‌సీ-273

భారత అణుశక్తి విభాగానికి చెందిన న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్.. 273 స్టైపెండరీ ట్రైనీ కేటగిరీ-1, 2 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **విభాగాలు:** మెకానికల్, కెమికల్, ఎలక్ట్రికల్, సివిల్, ఆర్కిటెక్చర్, హార్టికల్చర్, ఫిట్టర్, టర్నర్, వెల్డర్ తదితర విభాగాలున్నాయి.
» **అర్హత:** పోస్టులను బట్టి సంబంధిత సబ్జెక్టుల్లో డిప్లొమా, బీఎస్సీ, గ్రాడ్యుయేషన్, మెట్రిక్యులేషన్, ఇంటర్మీడియట్/తత్సమాన అర్హత, అనుభవం ఉండాలి.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» **ఎంపిక:** పోస్టును బట్టి ప్రిలిమినరీ (స్క్రీనింగ్) టెస్ట్, అడ్వాన్స్‌డ్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
» **దరఖాస్తుకు చివరితేదీ:** జనవరి 10, 2020.
» **వెబ్‌సైట్:** **www.nfc.gov.in**




## నాబార్డ్-73

ముంబై ప్రధాన కేంద్రంగా ఉన్న నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ (నాబార్డ్).. 73 ఆఫీస్ అటెండెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **అర్హత:** పదోతరగతి/తత్సమాన ఉత్తీర్ణత.
» **వయసు:** 18-30 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక:** రాతపరీక్ష/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేయాలి.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» **దరఖాస్తుకు చివరితేదీ:** జనవరి 12, 2020.
» **వెబ్‌సైట్:** **www.nabard.org**

సాక్షి ఎడ్యుకేషన్ వెబ్‌సైట్లో..
❖ 10వ తరగతి ప్రీవియస్ పేపర్స్, మోడల్‌పేపర్స్, స్టడీ మెటీరియల్, బిట్ బ్యాంక్ మొదలైనవి.. (EM&TM)
❖ ఇంటర్మీడియట్ ప్రీవియస్ పేపర్స్, మోడల్‌పేపర్స్, స్టడీ మెటీరియల్, ఎగ్జామ్స్ గైడెన్స్ మొదలైనవి... (EM&TM)
❖ డీఎస్సీ స్టడీమెటీరియల్, బిట్‌బ్యాంక్, మోడల్‌పేపర్స్, గైడెన్స్
విద్య, ఉద్యోగ సమాచారం కోసం
WWW.SAKSHIEDUCATION.COM
SAKSHI CURRENT AFFAIRS యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోండి

నేటి టాబ్లాయిడ్ విద్య పేజీల్లో...
10th Class
SRIGAYATRI EDUCATIONAL INSTITUTIONS
Mathematics

## డబ్ల్యూఐఐ-29

డెహ్రాడూన్‌లోని వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూఐఐ) ఒప్పంద ప్రాతిపదికన 29 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **పోస్టులు:** రీసెర్చ్ అసోసియేట్, వైల్డ్ లైఫ్ బయాలజిస్ట్, వెటర్నరీ ఆఫీసర్, ప్రాజెక్ట్ అసోసియేట్, ప్రాజెక్ట్ అసిస్టెంట్, తదితర విభాగాలున్నాయి.
» **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో బ్యాచిలర్స్ డిగ్రీ, మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణత, అనుభవం ఉండాలి.
» **ఎంపిక:** రాతపరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» **దరఖాస్తుకు చివరితేదీ:** జనవరి 23, 2020.
» **వెబ్‌సైట్:** https://wii.gov.in

## ఎండోమెంట్ (టీఎస్)-4

తెలంగాణ ప్రభుత్వానికి చెందిన దేవదాయ-ధర్మాదాయ శాఖ నిర్మల్ జిల్లాలోని శ్రీ జ్ఞాన సరస్వతి దేవస్థానం-బాసరలో వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 4 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

» **పోస్టులు:** అర్చక-2, పరిచారిక-1, సహాయ వంటాచార్యులు -1.
» **అర్హత:** అర్చక ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత, ఉత్సవాలు, పూజలకు, నిత్య కైంకర్యములలో మంత్రాలు, శ్లోకాలు దోషరహితముగా వల్లించు సామర్థ్యం ఉండాలి.
» **వయసు:** 18-38 ఏళ్ల మధ్య ఉండాలి.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» **దరఖాస్తుకు చివరితేదీ:** జనవరి 23, 2020.
» **వెబ్‌సైట్:** **http://endowments.ts.nic.in**

## ఇండియన్ ఆర్మీ-108

ఇండియన్ ఆర్మీకి చెందిన 17, 23 అమ్యునీషిషన్ డిపోలు వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 108 గ్రూప్-సీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **విభాగాల వారీ ఖాళీలు:** ట్రేడ్స్‌మెన్ మేట్-62, ఫైర్‌మెన్-35, జూనియర్ ఆఫీస్ అసిస్టెంట్-9, ఎంటీఎస్-2.
» **అర్హత:** పోస్టును బట్టి పదోతరగతి, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణతతో పాటు సంబంధిత స్కిల్స్ ఉండాలి.
» **వయసు:** 18-25 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక:** రాతపరీక్ష, టైపింగ్ టెస్ట్, ఫిజికల్ ఎండ్యూరెన్స్ టెస్ట్ (పీఈటీ) ఆధారంగా ఎంపిక చేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» **దరఖాస్తుకు చివరితేదీ:** జనవరి 12, 2020.
» **వెబ్‌సైట్:** **www.indianarmy.nic.in**

## ఎస్‌డబ్ల్యూఆర్-10

హుబ్లీ (కర్ణాటక) ప్రధాన కేంద్రంగా ఉన్న సౌత్ వెస్టర్న్ రైల్వే (ఎస్‌డబ్ల్యూఆర్)..ఖాళీగా ఉన్న 10 స్కౌట్స్ అండ్ గైడ్స్ కోటా పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **అర్హత:** పోస్టును బట్టి పదోతరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ ఉత్తీర్ణత, ఎన్‌సీవీటీ సర్టిఫికెట్ ఉండాలి.
» **వయసు:** 2020, జనవరి 1 నాటికి 18-30 ఏళ్ల మధ్య ఉండాలి.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌లో
» **దరఖాస్తు ఫీజు:** రూ.500.
» **ఎంపిక:** రాతపరీక్ష, స్కౌట్స్ అండ్ గైడ్స్ సర్టిఫికెట్ల ఆధారంగా ఎంపిక చేసుకోవాలి.
» **దరఖాస్తుకు చివరితేదీ:** జనవరి 20, 2020.
» **వెబ్‌సైట్:** **www.rrchubli.in**

## ముఖ్యమంత్రిని కలిసిన సచిన్, సన్నీ

భారత క్రికెట్ దిగ్గజాలు సచిన్ టెండూల్కర్, సునీల్ గావస్కర్ మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఉద్ధవ్ థాకరేను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కొత్తగా సీఎం బాధ్యతలు చేపట్టిన ఉద్ధవ్‌ను ఆయన స్వగృహం 'మాతోశ్రీ'లో కలిసి అభినందించారు. మరో వైపు జనవరి 12న జరిగే బీసీసీఐ అవార్డుల వార్షిక కార్యక్రమంలో మన్సూర్ అలీఖాన్ పటౌడీ స్మారకోపన్యాసాన్ని సచిన్ వెలువరించనున్నట్లు బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి.



# బ్యాటింగ్ చేయడం మర్చిపోతానా..!



## గతమేదో గడిచింది... ఇకపై తాజాగా బరిలోకి

- స్థానం కోసం పోటీ తప్పదు
- ఆటలో సవాళ్లు, విమర్శలు సహజం
- శిఖర్ ధావన్ మనోగతం

**న్యూఢిల్లీ:** ఈ ఏడాది గాయాలతో సతమతమైన భారత ఓపెనర్ శిఖర్ ధావన్ కొత్త ఏడాదిని సరికొత్తగా ప్రారంభిస్తానని చెప్పాడు. తన శైలి శాశ్వతమని, బ్యాటింగ్ చేయడం మర్చిపోలేదన్నాడు. ఈ ఏడాదంతా గాయాలు 'గబ్బర్'ను తెగ ఇబ్బంది పెట్టాయి. మొదట చేతి వేలు, తర్వాత మెడ, అటుపై కన్ను, ఇటీవల మోకాలి గాయాలతో ధావన్ ఆటకు దూరం కావాల్సి వచ్చింది. నవంబర్ 21న సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ టి20 మ్యాచ్ తర్వాత మళ్లీ అతను బ్యాట్ పట్టలేదు. ఈ సమయంలో జట్టులోకి వచ్చిన లోకేశ్ రాహుల్ ఓపెనర్‌గా సూపర్ హిట్టయ్యాడు. ఇప్పుడు మోకాలి గాయం నుంచి పూర్తిగా కోలుకోవడంతో ధావన్ స్వదేశంలో శ్రీలంక, ఆస్ట్రేలియాలతో జరిగే సిరీస్‌లకు ఎంపికయ్యాడు. దీనిపై మంగళవారం ప్రాక్టీస్ సెషన్ ముగిశాక మీడియాతో ధావన్ మాట్లాడుతూ 'ఇది నాకు తాజా ఆరంభం. ఈ యేడు చేతి వేలి నుంచి మోకాలి గాయం దాకా చాలా ఇబ్బంది పడ్డాను. ఈ కష్టకాలంలో శుభవార్త ఏంటంటే కొత్త సంవత్సరం రావడం. రాహుల్ బాగా ఆడటం నన్ను సంతోషపరిచింది. అంది వచ్చిన అవకాశాల్ని చక్కగా సద్వినియోగం చేసుకున్నాడు. ఇక ఇప్పుడు నేను సత్తా చాటాలి' అని అన్నాడు.

### గాయాలు తప్పవు

గాయాలనేవి మన నియంత్రణలో ఉండవని... అయితే ఎదురుదెబ్బలెన్ని ఎదురైనా ఎప్పుడు ప్రభావితం కాలేదని, ఇది తన అదృష్టమని చెప్పుకొచ్చాడు. 'ఆటగాళ్లకు గాయాలు సహజం. వీటిని అంగీకరించాల్సిందే. అంతేతప్ప ఎక్కువగా ఆలోచించను. బాగా ఆడుతున్నపుడే ఇలా గాయాలతో ఆగిపోవడం కష్టమనిపించలేదు. ఎందుకంటే నేనేమీ బ్యాటింగ్ చేయడం మర్చిపోలేదు. నా శైలి నాకుంది. పరుగులు చేసే సత్తా నాలో ఉంది' అని గబ్బర్‌గా పిలుచుకునే శిఖర్ అన్నాడు. శ్రీలంకతో జరగనున్న టి20లకు సీనియర్ ఓపెనర్ రోహిత్ శర్మకు విశ్రాంతి ఇవ్వడంతో ఆ సిరీస్ తనకు చాలా కీలకమైందని చెప్పాడు. 'నాకిది ముఖ్యమైన సీజన్. లంకతో పొట్టి మ్యాచ్‌ల్లో బాగా రాణించాలి. అయితే ఆస్ట్రేలియాతో వన్డేలకు రాహుల్‌తో పాటు నేను రోహిత్ కూడా అందుబాటులో ఉంటాం. కాబట్టి టీమ్ మేనేజ్‌మెంట్‌కు తుది జట్టు ఎంపిక సవాలే కానుంది. వాళ్ల పని వాళ్లు చేస్తారు. భారీ స్కోర్లతో నా పని నేను చేసుకుపోవాలి' అని అన్నాడు.

### టెస్టులూ ఆడగలను

గతేడాది ఇంగ్లండ్‌తో టెస్టు ఆడాక ధావన్ మళ్లీ సంప్రదాయ క్రికెట్ ఆడలేకపోయాడు. రోహిత్‌తో పాటు మయాంక్ అగర్వాల్ వచ్చిరాగానే రాణించడంతో ధావన్‌కు చోటులేకుండా పోయింది. యువ ఓపెనర్ పృథ్వీ షా కూడా సెలక్షన్‌కు అందుబాటులో ఉండటం ధావన్ ఎంపికకు సంకటంగా మారింది. అయితే బంగ్లాదేశ్‌తో సొంతగడ్డపై గత నెలలో జరిగిన టి20ల్లో శిఖర్ ఆడాడు. టెస్టు జట్టుకు దూరమైనంత మాత్రాన తన పని అయిపోలేదన్నాడు. అంతర్జాతీయ క్రికెట్లో పరుగులు సాధించే సత్తా తనలో ఉందన్నాడు.

### 'స్టార్'ననే భావన లేనేలేదు

రంజీల ద్వారా మళ్లీ ఆటకు సిద్ధమవడం ఆనందంగా ఉందని ఈ ఢిల్లీ ఓపెనర్ చెప్పాడు. 'రంజీల నుంచే నేనీ స్థాయికి చేరుకున్నా. ఇప్పుడు అంతర్జాతీయ స్టార్‌ననే అహం లేదు. ఎవరితోనైనా కలిసిపోతాను. నా అనుభవాన్ని కుర్రాళ్లకు పంచేందుకు ఎపుడైనా సిద్ధమే. టెస్టు జట్టులోకి రావడం కష్టమే! అయినా... నా లక్ష్యం మాత్రం మూడు ఫార్మాట్లు ఆడటం. దీనికోసం నేను ఎంతైనా శ్రమిస్తాను. ఆటగాళ్ల కెరీర్‌లో గాయాలు... ఆ తర్వాత కోలుకోవడం, తిరిగి ఫిట్‌నెస్ టెస్టు పాసయ్యాక పునరాగమనం ఎప్పుడైన సవాళ్లతో కూడుకున్నదే.

### నా కుటుంబం ఇక ఇండియాలోనే..

మొత్తానికి తన భార్య, పిల్లలు భారత్‌లోనే స్థిరపడేందుకు వస్తున్నారని ధావన్ ఎంతో సంతోషంగా చెప్పాడు. 'ఆస్ట్రేలియాలో ఉండే నా భార్య ఆయేషా, కుమారుడు జొరావర్ ఇప్పుడు పూర్తిగా స్వదేశానికొస్తున్నారు. దీంతో నా వెంట నా కుటుంబం ఎప్పుడూ ఉంటుంది' అని ధావన్ అన్నాడు. విమర్శలకు అతిగా స్పందించనని, వాళ్ల అభిప్రాయం వారిదని తన ఆట ఏంటో తనకు తెలుసు కాబట్టి వారిని పెద్దగా పట్టించుకోనని చెప్పాడు.

### నేటినుంచి రంజీ ట్రోఫీలో...

హైదరాబాద్‌తో బుధవారం నుంచి మొదలయ్యే రంజీ మ్యాచ్‌లో అతను ఢిల్లీ సారథిగా బరిలోకి దిగనున్నాడు. ఫిట్‌నెస్ నిరూపించుకునేందుకు తన సొంత జట్టు తరపున ఆడేందుకు సిద్ధమయ్యాడు. నేటి నుంచి నాలుగు రోజుల మ్యాచ్ ఫిరోజ్‌షా కోట్లా స్టేడియంలో జరుగుతుంది. అతనితో పాటు ఢిల్లీ జట్టులో సీనియర్ పేసర్ ఇషాంత్ శర్మ కూడా ఆడతాడు.

# నాలుగేళ్ల తర్వాత...

## 'ఫెడ్ కప్' టీమ్‌లో సానియా



**న్యూఢిల్లీ:** భారత టెన్నిస్ స్టార్, ఆరు గ్రాండ్‌స్లామ్‌ల విజేత సానియా మీర్జా జాతీయ జట్టు తరపున కూడా పునరాగమనానికి సిద్ధమైంది. ఫెడరేషన్ కప్‌లో పాల్గొనే ఐదుగురు సభ్యుల భారత జట్టులో డబుల్స్ మాజీ వరల్డ్ నంబర్‌వన్ సానియాకు చోటు దక్కింది. చివరి సారిగా 2016లో చివరి సారిగా ఫెడ్ కప్ ఆడిన సానియా 2017 అక్టోబరు నుంచి ఆటకు దూరంగా ఉంది. భారత సింగిల్స్ నంబర్‌వన్ ప్లేయర్ అంకితా రైనాతో పాటు రియా భాటియా, రుతుజ భోంస్లే, కర్మన్ కౌర్ తాండి టీమ్‌లో మిగిలిన నలుగురు సభ్యులు. హైదరాబాద్ అమ్మాయి సౌజన్య భవిశెట్టి రిజర్వ్ ప్లేయర్‌గా ఎంపికైంది. ఈ టీమ్‌కు మాజీ డేవిస్ కప్ ఆటగాడు విశాల్ ఉప్పల్ కెప్టెన్‌గా, మరో మాజీ క్రీడాకారిణి అంకితా బాంబ్రి కోచ్‌గా వ్యవహరిస్తుంది. 2020లో తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఆస్ట్రేలియన్ ఓపెన్‌తో పాటు దానికి ముందు సన్నాహకంగా హోబర్ట్ ఇంటర్నేషనల్‌లో నాదియా కిచెనోక్ (ఉక్రెయిన్)తో కలిసి బరిలోకి దిగుతున్నట్లు సానియా ఇప్పటికే ప్రకటించింది.

## ఆసీస్ ఓపెన్ ప్రైజ్‌మనీ పెరిగింది




**మెల్‌బోర్న్:** ఏడాది తొలి గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీ అయిన ఆస్ట్రేలియా ఓపెన్‌లో ప్రైజ్‌మనీని భారీగా పెంచారు. టోర్నీ మొత్తం ప్రైజ్‌మనీ 7.10 కోట్ల ఆస్ట్రేలియా డాలర్లు. అంటే మన కరెన్సీలో రూ.350 కోట్లు. గతేడాది రూ. 308 కోట్లతో పోల్చితే ఈ సారి 13.6 శాతం పెరిగిందని ఆస్ట్రేలియా ఓపెన్ నిర్వాహకులు ప్రకటించారు. ఇక పురుషుల, మహిళల సింగిల్స్ విజేతకు రూ. 20 కోట్లు (41.20 లక్షల ఆసీస్ డాలర్లు) అందనుంది. సింగిల్స్‌లో స్వల్పంగానే పెరిగింది. గతేడాది 41 లక్షల డాలర్లు ఇస్తే ఈ సారి కేవలం 20 వేల డాలర్లు హెచ్చింపు చేశారు. అయితే ఆరంభ రౌండ్లలో 20 శాతం పెంచారు. తొలి రౌండ్లో 75వేల ఆసీస్ డాలర్ల నుంచి 90 వేల డాలర్ల (రూ.44 లక్షలు)కు పెంచారు. అదే రెండో రౌండ్లో అయితే 1.28 లక్షల డాలర్లు (రూ.63 లక్షలు) ప్రైజ్‌మనీగా లభిస్తాయి. ఏ గ్రాండ్‌స్లామ్‌కు సాధ్యంకాని రీతిలో గత ఐదేళ్లలోనే కనీవినీ ఎరుగని స్థాయిలో 61.4 శాతం మేర ఆసీస్ ఓపెన్ ప్రైజ్‌మనీని పెంచారు. రూపాయల్లో పోల్చి చూసుకుంటే 2014 విజేతకు రూ. 13 కోట్లు దక్కితే ఇపుడు ఏకంగా రూ. 20 కోట్లు దక్కుతాయి. అపుడు మొదటి రౌండ్ నెగ్గితే రూ. 14 లక్షలిస్తే ఇప్పుడు ఏకంగా రూ. 44 లక్షలు ఇస్తున్నారు. కాగా తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నీ మ్యాచ్‌లు వచ్చే నెల 20 నుంచి మెల్‌బోర్న్ పార్క్‌లో జరుగనున్నాయి.

## తొలి టెస్టుకు స్టోక్స్ సందేహమే!



**సెంచూరియన్:** దక్షిణాఫ్రికాతో తొలి టెస్టుకు ముందు ఇంగ్లండ్‌కు గట్టి దెబ్బ తగిలేలా కనిపిస్తోంది. తండ్రి తీవ్ర అనారోగ్యం కారణంగా ఆ జట్టు స్టార్ ప్లేయర్ బెన్ స్టోక్స్ ఈ మ్యాచ్ ఆడటంపై సందేహాలు నెలకొన్నాయి. న్యూజిలాండ్‌లో నివాసం ఉండే బెన్ తండ్రి గెడ్ స్టోక్స్ ఈ సిరీస్ చూసేందుకు దక్షిణాఫ్రికాకు వచ్చాడు. అయితే అనూహ్యంగా అతని ఆరోగ్యం దెబ్బతింది. దాంతో అతడిని జొహన్నెస్‌బర్గ్‌లోని ఆస్పత్రికి తరలించారు. మంగళవారం ప్రాక్టీస్‌కు హాజరు కాకుండా స్టోక్స్ హుటాహుటిన ఆస్పత్రికి చేరుకొని తండ్రితోనే ఉన్నాడు. గెడ్ అనారోగ్యం తీవ్రత తెలియకున్నా కెప్టెన్ జో రూట్ మాటల్లో స్టోక్స్ మ్యాచ్‌కు దూరం కావచ్చనే భావన కనిపించింది. తమకు మరిన్ని ప్రత్యామ్నాయాలు అందుబాటులో ఉన్నాయని అతను చెప్పాడు. రేపటినుంచి ఇరు జట్ల మధ్య 'బాక్సింగ్ డే' టెస్టు జరగనుంది.

## నేనేం మారను...

- ఆ డబ్బును ఏం చేయాలో తెలీదు
- వేలంలో దక్కిన మొత్తంపై ప్యాట్ కమిన్స్ వ్యాఖ్య




**మెల్‌బోర్న్:** ఐపీఎల్ వేలంలో అనూహ్యంగా భారీ ధర పలికిన ఆస్ట్రేలియా పేసర్ ప్యాట్ కమిన్స్ ఒక్కసారిగా భారీ ఎత్తున వచ్చిన సొమ్ము కారణంగా తానేమీ మారబోనని అంటున్నాడు. న్యూజిలాండ్‌తో బాక్సింగ్ డే టెస్టు సందర్భంగా మంగళవారం విలేకరులతో మాట్లాడిన కమిన్స్ ఆ డబ్బును ఏం చేయాలో ఇంకా ఆలోచించలేదని పేర్కొన్నాడు. గత వారం కోల్‌కతాలో జరిగిన వేలంలో కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టు రూ. 15.5 కోట్లకు కమిన్స్‌ను సొంతం చేసుకుంది. దీనిపై స్పందిస్తూ 'డబ్బు కారణంగా మారకుండా ఉండేందుకు శతవిధాలా ప్రయత్నిస్తా. ఇంకా చెప్పాలంటే నేను అదృష్టవంతుడిని. నా చుట్టూ మంచి మనుషులే ఉన్నారు. కాబట్టి నేను మారను. ఆ డబ్బుతో ఏం చేయాలనేది ఇంకా నేను నిర్ణయించుకోలేదు. కానీ నా గర్ల్‌ఫ్రెండ్ మాత్రం తన కోరికల జాబితాను తయారు చేసుకుంది. అందులో మా పెంపుడు కుక్క కోసం ఆట బొమ్మలు కొనాలనేది మొదటిది' అని కమిన్స్ అన్నాడు. తనకు లభించిన అత్యధిక బిడ్ కన్నా కూడా ఆటపై ప్రేమకే తాను ఎక్కువ విలువిస్తానని చెప్పాడు.

## టెస్టుల సంగతి తర్వాత చూద్దాం!

### పాక్‌లో టి20లు ఆడతామన్న బంగ్లా

**ఢాకా:** పూర్తి స్థాయి పర్యటన కోసం రావాలన్న పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) అభ్యర్థనను బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) సున్నితంగా తిరస్కరించింది. ముందు మూడు టి20లు ఆడేందుకు అంగీకరించిన బంగ్లా... టెస్టులు ఆడే విషయమై స్పష్టమైన హామీ ఇవ్వలేదు. ముందు అయితే పొట్టి మ్యాచ్‌లు ఆడిన తర్వాతే టెస్టుల సంగతి చూద్దామని చెప్పింది. 'పాకిస్తాన్ తమ దేశంలో అంతర్జాతీయ క్రికెట్‌ను పూర్తిస్థాయిలో పునరుద్ధరించే ప్రయత్నంలో ఉంది. అయితే మేం మాత్రం మా ఆటగాళ్లు, సహాయ సిబ్బంది సూచనల ప్రకారం నడుచుకుంటాం. మా జట్టు మేనేజ్‌మెంట్‌లో చాలా మంది విదేశీయులున్నారు. కాబట్టి ఇక్కడ వారి అభిప్రాయాలను పరిశీలించాల్సిందే' అని బీసీబీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నిజాముద్దీన్ చౌదరి చెప్పారు. మా ప్రాథమిక ప్రతిపాదన మేరకు ముందు టి20లు ఆడతాం. పరిస్థితుల్ని బట్టి టెస్టులపై నిర్ణయం తీసుకుంటాం' అని అన్నారు. ఇటీవల శ్రీలంక జట్టు పాక్‌లో పర్యటించి రెండు టెస్టుల సిరీస్‌లో ఆడింది. దీంతో పదేళ్ల తర్వాత పాక్‌గడ్డపై అంతర్జాతీయ టెస్టు మ్యాచ్‌లు జరిగాయి.




# కెప్టెన్లుగా కోహ్లి, ధోని

### 'క్రికెట్ ఆస్ట్రేలియా' ఈ దశాబ్దపు జట్లు

**మెల్‌బోర్న్:** గత పదేళ్ల అంతర్జాతీయ ప్రదర్శనను పరిగణనలోకి తీసుకుంటూ ఆస్ట్రేలియా క్రికెట్ బోర్డు (సీఏ) అధికారిక వెబ్‌సైట్ ఈ దశాబ్దపు టెస్టు, వన్డే జట్లను ప్రకటించింది. ఇందులో పలువురు ఆస్ట్రేలియన్లను వెనక్కి నెట్టి వన్డే జట్టు కెప్టెన్‌గా మహేంద్ర సింగ్ ధోని, టెస్టు జట్టు కెప్టెన్‌గా విరాట్ కోహ్లి ఎంపిక కావడం విశేషం. గత పదేళ్ల కాలంలో 70 అంతర్జాతీయ సెంచరీలు చేసిన కోహ్లి 50కు పైగా సగటుతో అన్ని ఫార్మాట్‌లలో కలిపి 21,444 పరుగులు సాధించాడు. ఆసీస్ గడ్డపైనే కోహ్లి 6 టెస్టు సెంచరీలు, 3 వన్డే సెంచరీలు చేయడం విశేషం. 2011లో వన్డే వరల్డ్ కప్, 2013లో ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలో భారత్‌ను విజేతగా నిలిపిన ధోనికి వన్డే కెప్టెన్‌గా గుర్తింపు దక్కింది. **cricket.com.au** ప్రకటించిన ఈ దశాబ్దపు అత్యుత్తమ జట్ల జాబితా:

**టెస్టులు:** కోహ్లి (కెప్టెన్), అలిస్టర్ కుక్, డేవిడ్ వార్నర్, కేన్ విలియమ్సన్, స్టీవ్ స్మిత్, ఏబీ డివిలియర్స్, బెన్ స్టోక్స్, డేల్ స్టెయిన్, స్టువర్ట్ బ్రాడ్, నాథన్ లయన్, జేమ్స్ అండర్సన్

**వన్డేలు:** ధోని (కెప్టెన్), రోహిత్, ఆమ్లా, కోహ్లి, డివిలియర్స్, షకీబ్, బట్లర్, రషీద్ ఖాన్, మిషెల్ స్టార్క్, ట్రెంట్ బౌల్ట్, లసిత్ మలింగ




### టెస్టుల్లోనూ నంబర్‌వన్‌గా... ఏడాదిని ముగించిన కోహ్లి

**దుబాయ్:** అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) వన్డే ర్యాంకింగ్స్‌లో నంబర్‌వన్‌గా నిలిచిన భారత కెప్టెన్ విరాట్ కోహ్లి టెస్టుల్లోనూ అగ్రస్థానంతో 2019ని ముగించాడు. ఐసీసీ ప్రకటించిన తాజా బ్యాట్స్‌మెన్ ర్యాంకింగ్స్‌ల్లో కోహ్లి (928 పాయింట్లు) తన టాప్ ర్యాంక్‌ను నిలబెట్టుకున్నాడు. ఆస్ట్రేలియా ఆటగాడు స్టీవ్ స్మిత్ (911)కంటే కోహ్లి 17 పాయింట్లు ముందంజలో నిలిచాడు. కేన్ విలియమ్సన్ (864)కు మూడో స్థానం దక్కింది. ఇతర భారత బ్యాట్స్‌మెన్‌లో చతేశ్వర్ పుజారా (4వ స్థానం), అజింక్య రహానే (7వ స్థానం)లకు టాప్–10లో చోటు లభించగా, మయాంక్ 12వ, రోహిత్ 15వ స్థానంలో నిలిచారు. ప్యాట్ కమిన్స్ (ఆస్ట్రేలియా) నంబర్‌వన్‌గా ఉన్న బౌలర్ల జాబితాలో జస్‌ప్రీత్ బుమ్రాకు ఆరో స్థానం దక్కింది. ఆల్‌రౌండర్లలో జేసన్ హోల్డర్ (వెస్టిండీస్) అగ్రస్థానం సాధించగా, రవీంద్ర జడేజా (భారత్) రెండో ర్యాంక్‌తో 2019ని ముగించాడు.

## అశ్విన్‌పై సౌరవ్ ప్రశంసలు



**న్యూఢిల్లీ:** భారత జట్టు సీనియర్ స్పిన్నర్ రవి చంద్రన్ అశ్విన్‌పై మాజీ కెప్టెన్, బీసీసీఐ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ ప్రశంసలు కురిపించాడు. అయితే చాలా సందర్భాల్లో అతని ఘనతలకు పెద్దగా గుర్తింపు లభించలేదని అతను వ్యాఖ్యానించాడు. గత దశాబ్ద కాలంలో అన్ని ఫార్మాట్‌లలో కలిపి అత్యధిక వికెట్లు (564) తీసిన బౌలర్‌గా అశ్విన్ గుర్తింపు పొందాడు. 'దశాబ్ద కాలంలో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ అశ్విన్ కావడం నిజంగా అద్భుతం. చాలా గొప్ప ప్రదర్శన. చాలా సార్లు అతని ప్రదర్శనకు తగినంత గుర్తింపు దక్కలేదని నాకు అనిపిస్తూ ఉంటుంది' అని గంగూలీ ట్వీట్ చేశాడు.

## మను భాకర్, అనీశ్‌లకు స్వర్ణాలు

### జాతీయ షూటింగ్ చాంపియన్‌షిప్

**భోపాల్:** యువ షూటర్ మను భాకర్ జాతీయ చాంపియన్‌షిప్‌లో మెరిసింది. సీనియర్, జూనియర్ రెండు విభాగాల్లోనూ కలిపి ఆమె మొత్తం నాలుగు స్వర్ణాలు గెలుచుకోవడం విశేషం. ఈ క్రీడల్లో ఆమె హరియాణాకు ప్రాతినిధ్యం వహించింది. మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ సీనియర్ ఈవెంట్‌లో 17 ఏళ్ల మను 243 పాయింట్లు సాధించి అగ్రస్థానంలో నిలిచింది. దివ్యాంశి ధామా (237.8), యశస్విని సింగ్ (217.7) రజత, కాంస్యాలు గెలుచుకున్నారు. పురుషుల 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్‌లో హరియాణాకే చెందిన అనీశ్ భన్వాలా స్వర్ణం గెలుచుకున్నాడు. అనీశ్ 28 పాయింట్లు స్కోరు చేయగా... భవేశ్ షెఖావత్ (26), విజయవీర్ సిద్ధూ (22) తర్వాతి స్థానాల్లో నిలిచారు.



CENTRAL INSTITUTE OF INDIAN LANGUAGES
(Ministry of Human Resources Development, Dept. of Higher Education, Govt of India)
Manasagangotri, Mysore - 570 006, India

NOTIFICATION-WALK-IN-INTERVIEW

Applications are invited from the eligible candidates for **Lower Division Clerk -2 Numbers** in Centre of Excellence for Studies in Classical Telugu, a project under Central Institute of Indian Languages for its Centre at **Nellore** - Andhra Pradesh.

For application and further details see the website of the institute: **www.ciil.org** under Announcements. Completed applications may be sent **Director, Central Institute of Indian languages, Manasagangothri, Hunsur Road, Mysore - 570006, Karnataka"** by post or may be submitted at the time of interview.

**Sd/-**
**Asst.Director (Admin)**
**CIIL-Mysore**

davp 21248/11/0008/1920

సాక్షి బిజినెస్

బుధవారం
25-12-2019

WWW.SAKSHIBUSINESS.COM


**స్టాక్ మార్కెట్లు**

దేశీ సూచీలు

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 181 ▼ | 48 ▼ |
| 41,461 | 12,214 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు 11.30గంటలకు)

| సూచీ | విలువ | మార్పు |
|---|---|---|
| నాస్‌డాక్ | 8,722 | ▼ 4 |
| డోజోన్స్ | 28,508 | ▼ 44 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,632 | ▲ 9 |
| డాక్స్ | 13,301 | ▼ 18 |
| షాంఘై | 2,983 | ▲ 20 |
| నికాయ్ | 23,831 | ▲ 9 |


● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

**ఫారెక్స్ రేట్లు** రూ. లలో

| కరెన్సీ | | ● కొనుగోలు | ● అమ్మకం |
|---|---|---|---|
| యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 70.47 | 72.11 |
| బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 90.69 | 93.89 |
| యూరో | ఎస్‌బీఐ | 77.62 | 80.51 |
| జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 63.97 | 66.37 |
| ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 48.27 | 50.44 |
| సింగపూర్ డాలర్ | ఎస్‌బీఐ | 51.68 | 53.47 |
| సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 18.22 | 19.82 |
| యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 18.94 | 19.94 |
| చైనా యువాన్ | థామస్‌కుక్ | 9.55 | 10.95 |

# 'ఫండ్స్'లో దుర్వినియోగానికి బ్రేకులు

- సెబీ కీలక చర్యలు
- పూల్ అకౌంట్ల ద్వారా లావాదేవీలు ఇక కుదరవు
- ట్రేడింగ్, మార్జిన్ల కోసం క్లయింట్ల పెట్టుబడుల తరలింపు నేపథ్యం...




**న్యూఢిల్లీ:** మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్టర్ల పెట్టుబడులు దుర్వినియోగం కాకుండా సెబీ ముందు జాగ్రత్త చర్యలకు సిద్ధమైంది. ఇందుకోసం అన్ని ప్లాట్‌ఫామ్‌లలోనూ పూల్ అకౌంట్ల వినియోగాన్ని నిలిపివేయాలనే ప్రతిపాదన తీసుకొచ్చింది. క్లయింట్ల పెట్టుబడులు, సెక్యూరిటీలను ట్రేడింగ్ ద్వారా లేదా క్లియరింగ్ సభ్యులు మార్జిన్ల కోసం తరలించడం.. తమ సొంత ఖాతాల ద్వారా ఆయా షేర్లపై రుణాలు తీసుకోవడం, సెటిల్‌మెంట్లకు సర్దుబాటు చేయడం వంటి ఘటనలు తన దృష్టికి వచ్చినట్టు సెబీ మంగళవారం విడుదల చేసిన చర్చా పత్రంలో వెల్లడించింది. మ్యూచువల్ ఫండ్స్ లావాదేవీలను మధ్యవర్తులైన స్టాక్ బ్రోకర్లు, క్లియరింగ్ సభ్యులు, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా నిర్వహించినప్పుడు అవి దుర్వినియోగం అయ్యే అవకాశాలున్నాయని సెబీ పేర్కొంది. ఎందుకంటే మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులకు సంబంధించి నిధులు పూల్ అకౌంట్లు లేదా ఎస్క్రో ఖాతాల నుంచి వచ్చే అవకాశం ఉన్నందున వీటి మూలాలను అస్సెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలు తెలుసుకోలేవని సెబీ గుర్తించింది. ''ఫండ్స్ యూనిట్లు, నిధులు బ్రోకర్ల ఖాతాల నుంచి రిజిస్ట్రార్ అండ్ ట్రాన్స్‌ఫర్ ఏజెంట్లు లేదా ఏఎంసీల ఖాతాలకు వెళ్లాలి. ఇందుకోసం ఇన్వెస్టర్ల నిధులు మధ్యవర్తుల స్థాయిలో పూలింగ్ ఖాతాల్లోకి వచ్చి వెళుతుంటాయి. దీంతో ఆయా నిధుల మూలాలు, ఇన్వెస్టర్ల వివరాలు ఏఎంసీలకు తెలిసే అవకాశం ఉండడం లేదు'' అని సెబీ పేర్కొంది. దీంతో మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులను సురక్షితంగా మార్చేందుకు స్టాక్‌బ్రోకర్లు, మ్యూచువల్ ఫండ్స్ డిస్ట్రిబ్యూటర్లు, ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్లు, ఇతర ప్లాట్‌ఫామ్‌ల ద్వారా నిధులు లేదా మ్యూచువల్ ఫండ్స్ యూనిట్ల పూలింగ్‌ను నిలిపివేయాలని ప్రతిపాదించినట్టు సెబీ వెల్లడించింది. కార్వీ స్టాక్ బ్రోకింగ్ తన క్లయింట్ల సెక్యూరిటీలను తన పూల్ అకౌంట్‌కు తరలించి వాటిపై రుణాలు తీసుకోవడం, అనంతరం చెల్లింపుల్లో సమస్య ఏర్పడడం ఇటీవలే జరిగింది. ఈ పరిణామాలతో మ్యూచువల్ ఫండ్స్‌లోనూ ఇదే తరహా రిస్క్ లేకుండా చూడాలన్నది సెబీ ఉద్దేశంగా కనిపిస్తోంది.

**మధ్యవర్తుల ప్రమేయం తగ్గించడం..**

సెబీ తాజా ప్రతిపాదనలకు అనుగుణంగా.. క్లయింట్లు, క్లియరింగ్ కార్పొరేషన్ల మధ్య ప్రత్యక్ష సంబంధాలకు స్టాక్ ఎక్స్ఛేంజ్‌లు వీలు కల్పించాల్సి ఉంటుంది. ''స్టాక్ బ్రోకర్ల ద్వారా స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల్లో జరిగే లావాదేవీల కోసం.. ఇన్వెస్టర్ల బ్యాంకు ఖాతా నుంచి నేరుగా గుర్తింపు పొందిన క్లియరింగ్ కార్పొరేషన్‌కు నిధులు వెళ్లేందుకు, అలాగే క్లియరింగ్ కార్పొరేషన్ నుంచి నేరుగా క్లయింట్ బ్యాంకు ఖాతాకు నిధులు జమయ్యేందుకు తగిన వ్యవస్థలను స్టాక్ ఎక్స్ఛేంజ్‌లు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది''అని సెబీ తెలిపింది.

## ప్రజావేగులకు ప్రోత్సాహకం

ఇన్‌సైడర్ ట్రేడింగ్ కేసుల్లో తగిన సమాచారంతో ముందుకు వచ్చిన ప్రజావేగులను ప్రోత్సహించే నూతన విధానాన్ని సెబీ రూపొందించింది. ఇన్‌సైడర్ ట్రేడింగ్ నిషేధ నిబంధనల కింద కనీసం రూ.కోటి రూపాయల మేర రికవరీకి అవకాశం ఉన్న కేసుల్లో సమాచారం ఇచ్చిన వారికి ప్రోత్సాహకం ఇవ్వనుంది. అలాగే, తనకు ఏ రూపంలో సమాచారం వచ్చిందన్నది సెబీ వెల్లడించాల్సి ఉంటుంది. అదే సమయంలో ఆ సమాచారం ఇచ్చిన వారి గుర్తింపును గోప్యంగా ఉంచుతుంది.

## మైనర్ల పేరిట ఫండ్స్‌లో పెట్టుబడులు

మైనర్ల పేరిట వారి సంరక్షకులు మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు పెట్టడం, మేజర్లుగా మారిన తర్వాత సాఫీగా బదలాయింపునకు సంబంధించి సెబీ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. అన్ని ఏఎంసీల పరిధిలో ఈ ప్రక్రియ ఏకరూపంలో ఉండేందుకు ఇవి వీలు కల్పిస్తాయి. పెట్టుబడులు మైనర్ల బ్యాంకు ఖాతాల నుంచి లేదా చెక్ లేదా డీడీ రూపంలో ఇవ్వవచ్చు. మైనర్, సంరక్షకుని సంయుక్త ఖాతా నుంచీ నిధులు పంపొచ్చు. మేజర్ అయిన తర్వాత.. మేజర్‌కు ఉండే పూర్తి హక్కులు దఖలు పడతాయి.

# ● అక్షరాలా... రూ. 1.2 లక్షల కోట్లు

- 2019లో పెరిగిన ముకేశ్ అంబానీ సంపద విలువ
- ప్రస్తుతం సుమారు రూ. 4.3 లక్షల కోట్లు
- అత్యంత సంపన్నుల జాబితాలో 12వ స్థానం




**న్యూఢిల్లీ:** అపర కుబేరుడు, రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీకి 2019 సంవత్సరం బాగా కలిసొచ్చింది. ఈ ఏడాది ఆయన సంపద విలువ ఏకంగా 16.5 బిలియన్ డాలర్ల మేర (సుమారు రూ. 1.2 లక్షల కోట్లు) పెరిగింది. 60.8 బిలియన్ డాలర్లకు చేరింది. బ్లూమ్‌బర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ ద్వారా ఈ విషయాలు వెల్లడయ్యాయి. మంగళవారం నాటికి గణాంకాల ప్రకారం సుమారు 61 బిలియన్ డాలర్ల నికర విలువతో (దాదాపు రూ. 4.3 లక్షల కోట్లు) ప్రపంచంలోనే అత్యంత సంపన్నుల జాబితాలో ముకేశ్ అంబానీ 12వ స్థానంలో నిల్చారు. ఏడాది కాలంగా రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు దూసుకెళ్లడం .. ముకేశ్ అంబానీ సంపద వృద్ధికి కారణమైంది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్‌ఎస్‌ఈ) గణాంకాల ప్రకారం.. గడిచిన సంవత్సర కాలంలో రిలయన్స్ షేరు ఏకంగా 41 శాతం ఎగిసింది. మంగళవారం ఎన్‌ఎస్‌ఈలో రూ. 1,544.50 వద్ద క్లోజయ్యింది. గత కొన్నాళ్లుగా రిలయన్స్ ఇండస్ట్రీస్ వివిధ వ్యాపార విభాగాల్లోకి శరవేగంగా విస్తరిస్తోంది. జియో పేరిట టెలికం రంగంలో సంచలనం సృష్టించిన రిలయన్స్.. తాజాగా జియో గిగాఫైబర్ సేవలతో బ్రాడ్‌బ్యాండ్ సేవల్లోనూ దూసుకెడుతోంది. ఇక రిటైల్ రంగంలోనూ పట్టు సాధించడంతో పాటు త్వరలో ఈ–కామర్స్ విభాగంలోకి కూడా ప్రవేశించేందుకు జోరుగా కసరత్తు చేస్తోంది. ఈ–కామర్స్‌లో అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి దిగ్గజాలకూ గట్టి పోటీనివ్వనుంది.

**టాప్‌లో బిల్ గేట్స్..**

బ్లూమ్‌బర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ ప్రకారం.. ప్రపంచంలోనే అత్యంత సంపన్నుడు, టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ సంపద ఈ ఏడాది మరో 22.4 బిలియన్ డాలర్లు పెరిగి 113 బిలియన్ డాలర్లకు చేరింది. రెండో స్థానంలో ఉన్న అమెజాన్ సీఈవో జెఫ్ బెజోస్ సంపద మాత్రం 13.2 బిలియన్ డాలర్లు తగ్గింది. మరోవైపు, చైనాకు చెందిన ఈ–కామర్స్ దిగ్గజం ఆలీబాబా గ్రూప్ వ్యవస్థాపకుడు జాక్ మా నికర విలువ 11.3 బిలియన్ డాలర్లు పెరిగింది. అత్యంత సంపన్నుల లిస్టులో ఆయన 19వ స్థానంలో ఉన్నారు.

## వ్యాపార వివాదాలను క్రిమినల్ కేసులుగా చూడొద్దు

### సీఐఐ స్టార్టప్ కౌన్సిల్ చైర్మన్ క్రిస్ వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ:** వ్యాపార, సివిల్ వివాదాలను క్రిమినల్ కేసులుగా చూస్తున్న ఉదంతాలు ఈ మధ్య గణనీయంగా పెరుగుతున్నాయని పరిశ్రమల సమాఖ్య సీఐఐ స్టార్టప్ కౌన్సిల్ చైర్మన్ క్రిస్ గోపాలకృష్ణన్ చెప్పారు. ఔత్సాహిక వ్యాపారవేత్తలు, విదేశీ ఇన్వెస్టర్లను ఇది తీవ్ర భయాందోళనలకు గురి చేస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. మోసం చేయాలనే ఉద్దేశం ఉంటే తప్ప వ్యాపార వివాదాలన్నీ సివిల్ కోర్టుల పరిధిలోకే వస్తాయని, వాటిని క్రిమినల్ కేసులుగా చూడరాదని చెప్పారు. ఆర్బిట్రేషన్ లేదా సివిల్ కోర్టుల పరిధిలోకి వచ్చే వివాదాలకు సంబంధించిన కేసులను క్రిమినల్ పరిధి నుంచి తప్పించడంపై ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. దీనితో దేశ, విదేశ ఇన్వెస్టర్లలో భారత్‌పై నమ్మకం పెరుగుతుందని, దేశీయంగా వ్యాపారాలకు అనువైన పరిస్థితులు నెలకొనేందుకు కూడా ఇది ఉపయోగపడగలదని క్రిస్ చెప్పారు. ఇందుకు సంబంధించి కంపెనీల చట్టంలోని కొన్ని నిబంధనలు మార్చే ప్రయత్నాల్లో ఉన్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవలే వెల్లడించిన నేపథ్యంలో క్రిస్ గోపాలకృష్ణన్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. హురున్ గ్లోబల్ యూనికార్న్ జాబితా 2019 ప్రకారం 21 యూనికార్న్‌తో (1 బిలియన్ డాలర్ల పైగా వేల్యుయేషన్ గల అంకుర సంస్థలు) స్టార్టప్స్ ప్రపంచంలో భారత్ మూడో స్థానంలో ఉంది. అమెరికా, చైనా తొలి రెండు స్థానాల్లో ఉన్నాయి.

## మారుతీ డిజైర్.. టాప్ గేర్...

### ఏప్రిల్–నవంబర్‌లో 1.2 లక్షల కార్ల విక్రయాలు




**న్యూఢిల్లీ:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఎనిమిది నెలల కాలంలో అత్యధికంగా అమ్ముడైన కారు మోడల్‌గా 'డిజైర్' నిల్చింది. ఏప్రిల్–నవంబర్ మధ్యకాలంలో ఈ కార్లు 1.2 లక్షలకు పైగా అమ్ముడైనట్లు ఆటోమొబైల్ దిగ్గజం మారుతీ సుజుకీ వెల్లడించింది. కాంపాక్ట్ సెడాన్ సెగ్మెంట్‌లో డిజైర్ మార్కెట్ వాటా దాదాపు 60 శాతం దాకా ఉందని పేర్కొంది. డిజైర్‌కు ఆదరణ గణనీయంగా ఉందని, కస్టమర్ల డిమాండ్లకు అనుగుణంగా ఎప్పటికప్పుడు మార్పులు చేర్పులు చేస్తున్నామని మారుతీ సుజుకీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (మార్కెటింగ్, సేల్స్ విభాగం) శశాంక్ శ్రీవాస్తవ తెలిపారు. డిజైర్ థర్డ్ జనరేషన్ మోడల్‌ను 2017 మేలో మారుతీ సుజుకీ ప్రవేశపెట్టింది.

## బీఎస్-6 ద్విచక్ర వాహనాల్లో హోండా రికార్డు



**న్యూఢిల్లీ:** హోండా మోటార్ సైకిల్ అండ్ స్కూటర్స్ ఇండియా బీఎస్–6 వాహన అమ్మకాల్లో రికార్డు సృష్టించింది. బీఎస్–6 ప్రమాణాలతో కూడిన యాక్టివా 125 స్కూటర్, ఎస్‌పీ 125 మోటారు సైకిల్‌ను విడుదల చేయగా, ఇవి 60,000 వాహన అమ్మకాల రికార్డును అధిగమించాయని సంస్థ మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. వీటికి మంచి స్పందన లభిస్తున్నట్టు పేర్కొంది. దేశవ్యాప్తంగా ఇంకా అన్ని ప్రాంతాల డీలర్ల పరిధిలో వీటిని అందుబాటులోకి తీసుకొస్తున్నామని, ఆ లోపే ఈ రికార్డు సాధ్యమైనట్టు కంపెనీ సేల్స్ అండ్ మార్కెటింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ యదువీందర్ సింగ్ గులేరియా తెలిపారు.

# ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో అపార అవకాశాలు

- 2019లో రెట్టింపైన నిపుణులు
- గ్రేట్ లెర్నింగ్ సంస్థ నివేదిక



**న్యూఢిల్లీ:** వ్యాపార సంస్థల్లో కొంగొత్త టెక్నాలజీల వినియోగం మెరుగుపడుతున్న నేపథ్యంలో దేశీయంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఉద్యోగుల సంఖ్య కూడా గణనీయంగా పెరుగుతోంది. 2019లో ఏఐ ఉద్యోగుల సంఖ్య రెట్టింపయ్యింది. అయితే, నిపుణులు తగినంత స్థాయిలో దొరక్కపోతుండటంతో ఇంకా చాలా రంగాల సంస్థల్లో ఏఐ ఉద్యోగాలు ఖాళీగా ఉంటున్నాయని, ఈ విభాగంలో నిపుణులకు అపార అవకాశాలు ఉన్నాయని ఎడ్యుటెక్ సంస్థ గ్రేట్ లెర్నింగ్ ఒక నివేదికలో వెల్లడించింది. దీని ప్రకారం ఏఐ ఉద్యోగుల సంఖ్య గతేడాది 40,000గా ఉండగా.. 2019లో 72,000కు చేరింది. ఏఐ ప్రాజెక్టులపై పనిచేసే కంపెనీల సంఖ్య గతేడాది సుమారు 1,000 దాకా ఉండగా.. ఈ ఏడాది మూడు రెట్లు పెరిగి 3,000కు చేరింది. వ్యాపారాలు, డేటా నిర్వహణకు కంపెనీలు పెద్ద ఎత్తున ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత సాంకేతికతను వినియోగిస్తుండటం పెరుగుతోందని గ్రేట్ లెర్నింగ్ తెలిపింది. ఏఐ నిపుణుల సంఖ్య పెరుగుతున్నప్పటికీ.. ఇది డిమాండ్‌కు తగ్గ స్థాయిలో ఉండటం లేదని పేర్కొంది. దీంతో వివిధ సంస్థల్లో ఏఐ సంబంధ ఉద్యోగాలు 2,500 పైగా ఖాళీగా ఉన్నాయని వివరించింది. ఫ్రెషర్స్ మొదలుకుని మధ్య, సీనియర్ స్థాయి ఎగ్జిక్యూటివ్స్ దాకా దేశీయంగా పలు సంస్థల్లోని ఏఐ, మెషీన్ లెర్నింగ్ విభాగాల్లో ప్రొఫెషనల్స్ ఈ సర్వేలో పాల్గొన్నారు.


**415 మిలియన్ డాలర్లకు ఏఐ పరిశ్రమ..**

గ్రేట్ లెర్నింగ్ అధ్యయనం ప్రకారం.. దేశీ ఏఐ పరిశ్రమ ఆదాయం ఈ ఏడాది 415 మిలియన్ డాలర్లకు (సుమారు రూ. 2,950 కోట్లు) చేరింది. 2018లో ఇది 230 మిలియన్ డాలర్లు (దాదాపు రూ. 1,600 కోట్లు)గా ఉంది. దేశీయంగా ఏఐ నిపుణుల సగటు అనుభవం 7.2 సంవత్సరాలుగా ఉంటోంది. 29 శాతం మంది ఏఐ ప్రొఫెషనల్స్‌కు పదేళ్ల పైగా అనుభవం ఉంది. ఈ విభాగంలో చేరిన ఫ్రెషర్స్ సంఖ్య గతేడాది 3,700గా ఉండగా.. ఇది ప్రస్తుతం 60 శాతం వృద్ధి చెంది 6,000కు పెరిగింది. 'రాబోయే రోజుల్లోనూ ఇదే ధోరణి కొనసాగవచ్చని అంచనా వేస్తున్నాం. అనుభవజ్ఞులైన ప్రొఫెషనల్స్ వచ్చే ఏడాది పెద్ద సంఖ్యలో ఏఐ కెరియర్ల వైపు మళ్లే అవకాశాలు ఉన్నాయి' అని గ్రేట్ లెర్నింగ్ సహ వ్యవస్థాపకుడు హరి కృష్ణన్ నాయర్ చెప్పారు.

**బెంగళూరు టాప్..**

ఏఐ నిపుణులు ఎక్కువగా బెంగళూరును ఎంచుకుంటున్నారు. బెంగళూరులో ఏఐ ఉద్యోగాల కల్పన గతేడాది 13,000 స్థాయిలో ఉండగా.. 2019లో 23,000 పైగా నమోదైంది. సుమారు 8,000 ఉద్యోగాలతో హైదరాబాద్ నాలుగో స్థానంలో ఉంది. ఢిల్లీ (17,000), ముంబై (9,000) రెండు.. మూడు స్థానాల్లో నిల్చాయి. అనుభవం, నైపుణ్యాలను బట్టి ఏఐ నిపుణులకు సగటు జీతభత్యాలు రూ. 14.7 లక్షలుగా ఉంటోంది. ముంబైలో ప్రొఫెషనల్స్ అత్యధికంగా వార్షికంగా రూ. 17 లక్షల ప్యాకేజీ అందుకుంటుండగా, చెన్నైలో అత్యంత తక్కువగా రూ. 10.8 లక్షల స్థాయిలో ప్యాకేజీ ఉంటోంది. 39 శాతం మంది ఏఐ నిపుణులు .. భారీ సంస్థల్లోనూ, 29 శాతం మంది మధ్య స్థాయి సంస్థల్లోనూ, 32 శాతం మంది స్టార్టప్ సంస్థల్లోనూ సేవలు అందిస్తున్నారు. మహిళా ఏఐ నిపుణుల సంఖ్య అంతంత మాత్రంగానే ఉంటోంది.

## ఐబీసీ చట్ట సవరణల ఆర్డినెన్స్‌కు కేబినెట్ ఆమోదం




**న్యూఢిల్లీ:** దివాలా అండ్ బ్యాంక్రప్టసీ కోడ్(ఐబీసీ)లో మరి కొన్ని సవరణలను కేంద్రం తీసుకొచ్చింది. ఇందుకు సంబంధించిన ఆర్డినెన్స్‌కు కేంద్ర కేబినెట్ మంగళవారం ఆమోదం తెలిపినట్టు కేంద్ర మంత్రి ప్రకాశ్ జవదేకర్ ఢిల్లీలో మీడియాకు తెలిపారు. ఈ మార్పులతో.. దివాలా పరిష్కార ప్రక్రియ ప్రారంభానికి ముందుగా కార్పొరేట్ రుణగ్రస్తులు ఏవైనా నేరాలకు పాల్పడి ఉంటే.. ఆయా కంపెనీలను కొనుగోలు చేసే నూతన ప్రమోటర్లపై అందుకు సంబంధించి ఎటువంటి బాధ్యత ఉండదు. అలాగే కార్పొరేట్ దివాలా పరిష్కార ప్రక్రియకు అడ్జుడికేటింగ్ అథారిటీ ఆమోదం తెలిపిన తేదీ తర్వాత కార్పొరేట్ రుణగ్రస్తులను విచారించడానికి లేదు. ఐబీసీలో సవరణలకు సంబంధించిన బిల్లును ఈ నెల 12న ప్రభుత్వం లోక్‌సభలో ప్రవేశపెట్టిన విషయం గమనార్హం. అది ఇంకా ఆమోదానికి నోచుకోవాల్సి ఉంది. పలు అడ్డంకులను తొలగించి, దివాలా పరిష్కార ప్రక్రియ సాఫీగా సాగేందుకు వీలుగా కేంద్రం ఐబీసీలో సవరణలను పొందుపరిచింది.

## మార్చి 12 నుంచి ఏవియేషన్ షో



**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** రెండేళ్లకోసారి జరిగే ఏవియేషన్ షో 'వింగ్స్ ఇండియా' మార్చి 12 నుంచి ప్రారంభంకానుంది. హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయంలో నాలుగు రోజులపాటు ఈ కార్యక్రమం జరుగనుంది. ఫ్లయింగ్ ఫర్ ఆల్ అన్న నినాదంతో కేంద్ర పౌర విమానయాన శాఖ, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా, ఫిక్కీ దీనిని నిర్వహిస్తున్నాయి. 5,000కుపైగా చదరపు మీటర్ల విస్తీర్ణంలో 150 పైచిలుకు సంస్థలు తమ ఉత్పత్తులు, సేవలను ఇక్కడ ప్రదర్శించనున్నాయి. బోయింగ్, ఎమిరేట్స్, డస్సాల్ట్, అగస్టా వెస్ట్ ల్యాండ్, ఎంబ్రార్, గల్ఫ్‌స్ట్రీమ్, క్లబ్ వన్ ఎయిర్, పవన్ హన్స్ తమ విమానాలతో కనువిందు చేయనున్నాయి. 25కుపైగా విమానాలు, హెలికాప్టర్లు కొలువుదీరనున్నాయి. వైమానిక విన్యాసాల కోసం యూకే నుంచి ప్రత్యేక బృందం రానుందని ఫిక్కీ అధికారి ఒకరు సాక్షి బిజినెస్ బ్యూరో ప్రతినిధికి తెలిపారు. మార్చి 11న సాయంత్రం గ్లోబల్ సీఈవోల ఫోరమ్ సదస్సు జరుగనుంది. మార్చి 12, 13న బిజినెస్ విజిటర్లకు కేటాయించారు. వీరికి చార్జీ రూ.2,500 ఉంది. అలాగే 14, 15న సాధారణ ప్రజానీకానికి అనుమతినిస్తారు. ఒక్కో టికెట్‌కు రూ.500 చెల్లించాలి.

# భారత్‌లో ఆర్థిక మందగమనం

- తక్షణ చర్యలు అవసరం
- భారత్‌కు ఐఎంఎఫ్ సూచన
- విధానపరమైన చర్యలు తీసుకోవాలని సలహా
- రుణ వృద్ధి, ప్రైవేటు వినియోగం బలహీనంగా ఉన్నాయని వ్యాఖ్య




**వాషింగ్టన్:** భారత్‌లో ఆర్థిక మందగమన పరిస్థితులు తీవ్రంగా ఉన్నాయని అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్) అభిప్రాయపడింది. దీర్ఘ కాల ఈ ధోరణిని అరికట్టడానికి కేంద్రం తక్షణం విధానపరమైన చర్యలు తీసుకోవాలని సూచించింది. ఈ మేరకు ఐఎంఎఫ్ డైరెక్టర్స్ నివేదిక వెలువరించిన అంశాలను సంస్థ ఆసియా, పసిఫిక్ శాఖలో భారత్ వ్యవహారాల చీఫ్ రానిల్ సల్గాడో విలేకరులకు తెలిపారు. దీని ప్రకారం– భారత్ ఆర్థిక రంగానికి సంబంధించి కొన్ని ముఖ్యాంశాలను చూస్తే...

■ నిజానికి భారత్ ఇటీవలి సంవత్సరాల్లో భారీ ఆర్థిక విస్తరణ బాటలో ముందడుగు వేసింది. దీనితో లక్షలాది మంది పేదరికం నుంచి బయటపడ్డారు. అయితే 2019 సంవత్సరం నుంచీ దేశంలో ఆర్థిక వృద్ధి పూర్తి మందగమనంలో జారిన జాడలు సుస్పష్టమయ్యాయి. తగిన విధానపరమైన చర్యలు తీసుకోకపోతే, ఈ పరిస్థితి దీర్ఘ కాలం కొనసాగే అవకాశం ఉంది.

■ అయితే భారీ వృద్ధి తర్వాత వచ్చే దిగువబాట గానే (సైక్లికల్) మేము ఈ పరిస్థితిని ఇంకా పరిగణిస్తున్నాం. వ్యవస్థాగతమైన ఇబ్బందులు కనబడ్డంలేదు. అయితే ఈ సైక్లికల్ ప్రతికూలతలను ఎదుర్కొనడానికి కూడా తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రత్యేకించి ఫైనాన్షియల్ రంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలి.

■ ఆర్థిక సంవత్సరం రెండవ త్రైమాసికం (జూలై–సెప్టెంబర్)లో స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి రేటు ఆరేళ్ల కనిష్టం 4.5 శాతానికి పడిపోయింది. దేశీయంగా ప్రైవేటు డిమాండ్‌లో కేవలం ఒక శాతం వృద్ధి రేటు నమోదయ్యిందని గణాంకాలు పేర్కొంటున్నాయి. పరిస్థితి చూస్తుంటే, డిసెంబర్ త్రైమాసికంలోనూ ప్రతికూల జీడీపీ గణాంకాలే వెలువడతాయని భావించాల్సి వస్తోంది.

■ బ్యాంకింగ్ యేతర ఆర్థిక సంస్థల్లో (ఎన్‌బీఎఫ్‌సీ) రుణ వృద్ధి లేకపోవడం, ఆదాయాల వృద్ధి ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతాల్లో పడిపోవడం మొత్తంగా ప్రైవేటు వినియోగంపై కనబడుతోంది.

■ తగినంత వ్యాపార విశ్వాసం లేకపోవడం వల్ల బ్యాంకింగ్ రంగంలో రుణ వృద్ధి మందగమనం కొనసాగుతోంది.

■ వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) మంచి వ్యవస్థాగత సంస్కరణే అయినప్పటికీ, అమల్లో కొన్ని సమస్యలు ఉన్నాయి. వృద్ధి మందగమనంలో దీని పాత్ర కూడా ఉండొచ్చనిపిస్తోంది.

■ బ్యాంకింగ్ రంగంలో మొండిబకాయిల సమస్య పరిష్కార దిశలో తగిన చర్యలు ఉండాలి.

■ ప్రస్తుతం 2019–20లో భారత్ జీడీపీ వృద్ధిరేటు 6.1% ఉంటుందని అంచనా. అంచనాల సవరణ నిర్ణయం జనవరిలో ఉంటుంది. గత వృద్ధి అంచనాలను గణనీయంగా తగ్గించే అవకాశాలే ఉన్నాయి. ప్రస్తుతం వివిధ జాతీయ, అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు భారత్ వృద్ధి అంచనాలను దాదాపు 5% దిగువనకు కుదించిన సంగతి తెలిసిందే.

■ భారత్ ఆర్థిక రంగానికి సంబంధించి కొన్ని సానుకూల అంశాలూ ఉన్నాయి. అందులో విదేశీ మారక నిల్వలు రికార్డు స్థాయిలో ఉండడం ఒకటి. నవంబర్ 15తో ముగిసిన వారంలో 441 మిలియన్ డాలర్ల పెరుగుదలతో 448.249 బిలియన్ డాలర్లకు ఎగశాయి. దేశంలోకి వచ్చీ–పోయే విదేశీ మారకద్రవ్య నిల్వల మధ్య నికర వ్యత్యాసం కరెంట్ అకౌంట్ లోటు కూడా కట్టడిలోనే ఉంది. కూరగాయల ధరల పెరుగుదల వల్ల ద్రవ్యోల్బణం ఇటీవల కట్టుతప్పినప్పటికీ, గడచిన కొన్ని సంవత్సరాలుగా పూర్తి నియంత్రణలో ఉంది. కార్పొరేట్ పన్ను రేటును 30 నుంచి 15 శాతానికి తగ్గించడమూ సానుకూలాంశమే. ఇన్ని చర్యలు ఉన్నా... ఆర్థిక మందగమనం ఆశ్చర్యకరమే. అందువల్ల ఈ మందగమనాన్ని ఆర్థిక సంక్షోభంగా అభివర్ణించలేం.

■ కార్మిక, భూ, ప్రొడక్ట్ మార్కెట్ వంటి విభాగాల్లో భారత్ సంస్కరణలు తీసుకురావాలని ఐఎంఎఫ్ భావిస్తోంది. అలాగే మార్కెటింగ్‌లో ప్రత్యేకించి అంతర్జాతీయంగా పోటీతత్వాన్ని ఎదుర్కొనేందుకూ చర్యలు అవసరం. ఇక విద్యా, ఆరోగ్యం వంటి కీలక రంగాల్లోనూ సంస్కరణలు అవసరం.

■ అయితే ఇక్కడ ఒక అంశాన్ని ఐఎంఎఫ్ విశ్వసిస్తోంది. ప్రస్తుతం భారత్ ద్రవ్యలోటు (ప్రభుత్వ ఆదాయాలు–వ్యయాలకు మధ్య నికర వ్యత్యాసం) సమస్యను ఎదుర్కొంటోంది. ఈ పరిస్థితుల్లో ఆర్థిక వ్యవస్థకు ఉద్దీపనలు ప్రకటించడానికి పరిమితులు ఉన్నాయి. 2019– 20 ఆర్థిక సంవత్సరం మొత్తంలో ఈ పరిమాణం రూ.7.03 లక్షల కోట్లుగా ఉండాలన్నది (జీడీపీలో 3.3 శాతం) బడ్జెట్ లక్ష్యం. కానీ అక్టోబర్ ముగిసే నాటికే ఈ మొత్తం రూ.7,20,445 కోట్లకు చేరింది. ద్రవ్యలోటు కట్టడికి తగిన చర్యలపై దృష్టి పెట్టాలి.

# బాలుడిపై ఏడు నెలలుగా లైంగిక దాడి

## నిందితుల్లో ఐదుగురు బాలురు, ఒక యువకుడు

**కోదాడ రూరల్:** ఓ బాలుడిపై ఆరుగురు వ్యక్తులు ఏడు నెలలుగా లైంగిక దాడికి పాల్పడ్డారు. ఈ ఘటన కోదాడ పట్టణంలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. పట్టణ సీఐ శ్రీనివాసులురెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన 7వ తరగతి చదువుతున్న 13 ఏళ్ల బాలుడిపై అదే ప్రాంతానికి చెందిన ఐదుగురు బాలురు, ఒక యువకుడు క్రికెట్ ఆడుకుందామని చెప్పి సమీపంలోని నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి అఘాయిత్యానికి పాల్పడుతున్నారు. ఏడు నెలలుగా ఈ ఘాతుకానికి పాల్పడుతున్నారు. వారం రోజుల క్రితం ఆ బాలుడి ప్రవర్తనలో మార్పు రావడంతో తండ్రి గట్టిగా అడగడంతో జరిగిన విషయాన్ని తెలిపాడు. దీంతో బాలుడి తల్లి ఈ నెల 18న పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. విచారణ చేపట్టిన పోలీసులు బాలుడికి వైద్య పరీక్షలు చేసి లైంగిక దాడి జరిగినట్లు నిర్ధారించుకున్నారు. అనంతరం ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారిలో ఐదుగురు మైనర్‌లు కాగా, వారిని నల్లగొండ జువైనల్ హోంకు, మేజర్ అయిన నక్కా నవీన్‌కుమార్‌ను కోర్టుకు రిమాండ్ చేసినట్లు సీఐ తెలిపారు. నిందితులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల కదలికలపై అప్రమత్తంగా ఉండాలని సీఐ సూచించారు.

# ఉద్దేశపూర్వకంగా మాట్లాడలేదు

## ఎమ్మెల్యే శంకర్‌నాయక్

**మహబూబాబాద్:** ‘ఏ సామాజిక వర్గాల వారి మనోభావాలను దెబ్బతీయాలనే ఆలోచన నాకు లేదు.. నేను ఉద్దేశపూర్వకంగా మాట్లాడలేదు’అని ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. కేసముద్రంలో క్రిస్టియన్లకు దుస్తుల పంపిణీ సందర్భంగా చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమైన నేపథ్యంలో ఆయన వివరణ ఇచ్చారు. తాను మాట్లాడిన మాటలను ఎవరూ తప్పుగా భావించవద్దని.. తనను అపార్థం చేసుకోవద్దని కోరారు. కాగా, కులాల పేరుతో అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ.. శంకర్ నాయక్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ కాజీపేట పోలీసు స్టేషన్‌లో రెడ్డి సంఘం నాయకులు ఫిర్యాదు చేశారు.

# भारतीय वायु सेना / Indian Air Force

**INDIAN AIR FORCEINVITES UNMARRIED MALE CANDIDATES TO APPEAR IN RECRUITMENT RALLY FROM 17 JANUARY 2020 TO 21 JANUARY 2020**
**JOIN AS AIRMEN IN GROUP ‘Y’ (NON-TECHNICAL) AUTOMOBILE TECHNICIAN (AUTO TECH), INDIAN AIR FORCE (POLICE) [IAF(P)] TRADES**
**AT JNTUH COLLEGE OF ENGINEERING, SULTANPUR, SANGAREDDY (TELANGANA) : 01/2021**

**CAUTION**
**SELECTION IN THE INDIAN AIR FORCE IS “FREE & FAIR” AND ON MERIT ONLY. AT NO STAGE ANY MONEY IS REQUIRED TO BE PAID TO ANYONE FOR SELECTION OR RECRUITMENT IN THE INDIAN AIR FORCE. CANDIDATES SHOULD NOT FALL PREY TO UNSCRUPULOUS PERSONS POSING AS RECRUITING/SELECTING AGENTS.**

1. **Indian Air Force** offers opportunities for UNMARRIED MALE INDIAN/NEPALESE CITIZENS from **designated Districts of State of Telangana and UT of Yanam** to join as Airmen. The Recruitment Test for **Group ‘Y’ (Non-Technical), Automobile Technician (Auto Tech), Indian Air Force (Police) [IAF(P)] Trades** will be held at **JNTUH College of Engineering, Sultanpur, Sangareddy, Telangana** as per the selection programme given below.

2. The recruitment test shall be conducted from **6 AM** onwards as per the details given below. Candidates (from designated districts of state of Telangana or UT of Yanam) fulfilling the domicile requirements and eligibility conditions may report upto **10 AM** on **17 January 2020 and 19 January 2020** at **JNTUH College of Engineering, Sultanpur, Sangareddy, Telangana** (rally venue) shall only be permitted to appear in the recruitment test.

**Note: The Recruitment Test is not for selection as Commissioned Officers/ Pilots/Navigators.**

| DATE | TRADE | ACTIVITIES | DISTRICTS TO BE COVERED |
|---|---|---|---|
| 17 January 2020 | Auto Tech & IAF(P) | Physical Fitness Test & Written Test | Adilabad, Nirmal, Kumaram Bheem Asifabad, Mancherial, Pedapalli, Jagitial, Nizamabad, Rajanna Sircilla, Warangal (R), Warangal (U), Bhadradri Kothagudaem, Mehbubabad, Khammam, Karimnagar, Jayashankar Bhoopalapally and Mulugu districts of state of Telangana and UT of Yanam. |
| 18 January 2020 | | Adaptability Test - 1 & Adaptability Test - 2 | |
| 19 January 2020 | Auto Tech & IAF(P) | Physical Fitness Test & Written Test | Rangareddy, Hyderabad, Medchal, Jogulamba Gadwal, Sangareddy, Yadadri Bhuvanagiri, Vikarabad, Narayanpet, Jangaon, Suryapet, Siddipet, Medak, Nalgonda, Wanaparthy, Mehbubnagar, Kamareddy and Nagar Kurnool districts of state of Telangana. |
| 20 January 2020 | | Adaptability Test -1 & Adaptability Test - 2 | |
| 21 January 2020 | Reserve Day | | |

***ELIGIBILITY CONDITIONS***

3. **Date of Birth Block.** Candidates born between **17 January 2000** and **30 December 2003 (both days inclusive)** are eligible to appear in the recruitment rally.

4. **Educational Qualification.**

For Group ‘Y’ (Non-Technical) {Auto Tech & IAF(P) Trades} Candidate should have passed **Intermediate / 10+2 / Class XII or Equivalent Examination** in any stream/subjects approved by Central / State Education Boards with minimum **50% marks** in aggregate as well as in English in Class XII or equivalent examination.

**OR**

Passed two years vocational course from Education Boards listed as **COBSE** member with minimum **50% marks** in aggregate and **50% marks** in English in vocational course or in Intermediate/Matriculation if English is not a subject in Vocational Course.

Note - 1: Education Boards listed in Council of Boards for School Education (COBSE) website as members, shall only be permitted.
Note - 2: Exact aggregate % of marks before decimal as written in the marks sheet of 10+2/Intermediate/Equivalent OR calculated as per the rules of concerned Education Board shall only be considered (For example 49.99% should be taken as 49% and not to be rounded off to 50%).

5. **Domicile Requirement.** To be eligible to appear in the rally at **JNTUH College of Engineering, Sultanpur, Sangareddy, Telangana** the candidates shall be required to satisfy the following conditions:

(a) The school / college/ institute from where candidates have passed the qualifying examination should be within the geographical / administrative limits of **designated districts (as specified in Paragraph 2 above) of State of Telangana or UT of Yanam**. If the name of District is not mentioned with the name of Institution in the certificate / marks sheet of qualifying examination, the candidates shall produce **‘Domicile Certificate’** issued by **Mandal Revenue Officer (MRO) or any official authorised by the State Government of Telangana or UT of Yanam.**

(b) Permanent Domicile of **designated Districts (as specified in Paragraph 2 above) of State of Telangana or UT of Yanam** who have passed the qualifying examination from anywhere in India shall produce the Domicile Certificate prior to **commencement of examination,** from appropriate authority as given in sub-paragraph 5(a) above.

(c) Sons of serving Air Force personnel {Officer/Airmen/NCs(E) and Unit cadre Civilians paid from Defence Estimates} whose father/mother is presently serving in any Air Force Unit/any other Organisation located in the designated Districts **(as specified in Paragraph 2 above) of State of Telangana or UT of Yanam** irrespective of their domicile status, shall be permitted to appear in the rally subject to production of latest SOAFP (Son of Air Force Personnel) Certificate (format available at CASB site on AFNET).

(d) Sons of Air Force personnel {Officers/Airmen/NCs(E) and Unit Cadre Civilians paid from Defence Estimates} whose father/mother is retired/ discharged/ deceased and they are residing in the **designated Districts (as specified in Paragraph 2 above) of State of Telangana or UT of Yanam** shall be permitted to appear in the rally subject to production of proof of minimum stay of one year along with original and photocopy of Service Book/Discharge Book/Casualty Service Certificate/Service Particular Certificate (issued from DPO-3/DAV, as applicable) in case of Officers/ Airmen/NCs(E) and a Certificate duly signed by OIC Civil Admin and countersigned by CO/C Adm O of the last served unit, in case of Civilians.

6. **Medical Standards.**

(a) **General Medical Standards shall be as follows: -**

(i) **Chest:** Minimum range of expansion: 5 cm (ii) **Weight:** Proportionate to height and age. (iii) **Corneal Surgery (PRK/LASIK)** shall not be acceptable. (iv) **Hearing:** Candidate should have normal hearing i.e. able to hear forced whisper from a distance of 6 meters with each ear separately. (v) **Dental:** Should have healthy gums, good set of teeth and minimum 14 dental points. (vi) **General Health:** Candidate should be of normal anatomy without loss of any appendages. He should be free from any active or latent, acute or chronic, medical or surgical disability or infection and skin ailments. Candidate must be physically and mentally **FIT** to perform duty in any part of the world, in any climate and terrain.

(b) **Height, Leg Length, Visual Standards and Colour Vision are as follows:**

| Trades | Height | Leg length | Visual Acuity | Maximum limits of Ref Error | Colour Vision |
|---|---|---|---|---|---|
| Auto Tech | 165 cm | Minimum leg length required is 99 cm | 6/12 each eye correctable to 6/6 each eye | Hypermetropia: +2.0D Myopia: -1D including $\pm$ 0.50 Astigmatism | CP-II |
| IAF(P) | 175 cm | Not applicable | Unaided visual acuity of 6/6 | Not applicable | CP-II |

7. **Consumption of Narcotic Drugs and Psychotropic Substance (NDPS).** Consumption of Narcotic Drugs and Psychotropic substances banned under the NDPS Act 1985 **shall be a reject criteria for selection into the IAF** and Airmen found either in possession or storing or distributing or consuming such drugs and substances after enrolment shall be liable for disciplinary action including dismissal from the IAF.

8. **Body Tattoo.** Permanent body tattoos shall not be permitted. However, tattoos only on inner face of the fore arms (inside of elbow to the wrist), back (dorsal) part of the hand/reverse side of palm and for Tribals tattoos which are as per custom and traditions of their tribes may be considered. However, right to decide on acceptability/unacceptability of the individual shall rest with the selection centre. **Candidates with permanent body tattoos shall submit two photographs (close up and distant view) with details of size and type of the tattoo.**

9. **Only Sikh candidates**, whose religion prohibits the cutting of the hair or shaving of face, shall be permitted to grow hair and retain beard and moustache. Accordingly, those Sikh candidates willing to retain the same as per laid down specification are to get their photographs with beard and moustache. Such candidates shall not be permitted to grow/shave beard/moustache at later stages after enrolment.

10. Candidates discharged from Indian Army/Indian Navy/Any other Government Organisation shall also be eligible subject to their discharge with **NO ADVERSE ENTRIES.** Such candidate has to declare at the rally venue that he is an Ex-employee of the Organisation discharged from and produce original Discharge Certificate. In case of serving individuals, they must be in possession of NOC from their employer at the time of rally. If any candidate does not disclose the fact of being employed or that of being an Ex-employee, his candidature shall be cancelled at any stage during the selection process and if selected shall be liable for discharge/dismissal for hiding the fact of his employment and discharge/dismissal from service. **Candidates discharged from Indian Air Force for any reason are not eligible to appear in the rally.**

11. **Writing Material and Documents Required.** Candidates are to bring the following:-

(a) **HB pencil, eraser, sharpener, glue stick, stapler and black/blue ball point pen for writing.**

(b) Seven un-attested recent (**taken not before December 2019**) passport size colour photographs (front portrait in light background without head gear except for Sikhs). **The photograph is to be taken with candidate holding a black slate in front of his chest with his name and date of photograph taken, clearly written on it with white chalk in capital letters.**

(c) **Original and four self-attested photocopies of matriculation passing certificate (required for date of birth verification).**

(d) **Original and four self-attested photocopies of Intermediate/10+2/ Equivalent Examination Passing Certificate and Marks Sheet.**

(e) Original and four self-attested photocopies of Domicile Certificate **(or)** Original and four self-attested photocopies of duly filled Son of Air Force Personnel (SOAFP) Certificate (format available on AFNET CASB webpage) for Sons of Serving Air Force Personnel **(or)** Original and four self-attested photocopies of Service Book/Discharge Book/Causality Service Certificate/Service Particular certificate (issued from DPO-3/DAV, as applicable) in case of Officer/Airmen/NCs(E) and a certificate duly signed by OIC Civil Admin and countersigned by CO/C Adm O of the last served unit, in case of civilians for sons of retired/deceased/discharged Air Force Personnel and proof of minimum stay of one year as per Para 5 (d) above. .

(f) Candidates discharged from Indian Army/Indian Navy/Any other Government Organisation. Original and four Self-attested photocopies of Discharge Certificate (as issued from Indian Army/Indian Navy/Government Organisation).

(g) NOC in original and four self-attested photocopies from the employer for candidates presently serving in any government organization (if applicable).

(h) Original and four self-attested photocopies of NCC ‘A’, ‘B’ or ‘C’ Certificate (if applicable).

**Note. Under no circumstances shall the candidates be permitted to appear in the rally without original educational marks sheets/passing certificates & documents mentioned above in paragraph 11 (c) to (h). However, candidates with photocopies of educational marks sheets/ passing certificates may be permitted to appear in the rally only on production of a certificate from college/school princi pal certifying that educational certificates/marks sheets are deposited with college/school.**

(j) CONSENT FORM FOR PHYSICAL FITNESS TEST AND MEDICAL TESTS. Candidates shall bring the ‘Consent Form’ (as per the format given below) to the rally venue (**JNTUH College of Engineering, Sultanpur, Sangareddy, Telangana**) and submit it before the Physical Fitness Test. Candidates below 18 years of age shall get the Consent Form filled and signed by their parent/guardian. The candidates of 18 years of age and above can sign the consent form themselves.

**CONSENT FORM FOR PHYSICAL FITNESS TEST AND MEDICAL TESTS**
(Applicable in respect of candidates both **above** and **below** 18 years of age)

I, ......................son/father/guardian of ..........................whose date of birth is ............. do hereby give my consent for myself/son/ward to appear in the physical fitness/medical tests, as prescribed for selection in the Indian Air Force, at my/his own risk. I am aware that no compensation in any form shall be claimed, in respect of injuries/casualty if any, sustained by myself/ my son/my ward, during such tests.

Signature.......................................................
Name of candidate/parent/guardian...................
Relationship with the candidate.......................
Date:

**TERMS AND CONDITIONS**

12. **Tenure & Training.** Enrolment shall be for an initial period of 20 years (subject to condition) which may be extended upto the age of 57 years (subject to service conditions). Initially, candidates shall be sent for a Joint Basic Phase Training (JBPT) at designated Basic Training Institutes located at various Air Force Stations. On successful completion of JBPT, candidates will be allocated trades and sent for trade training of specified durations which shall include Security training or any other training as per service requirements. Training is however liable to be terminated at any time if the trainee fails to achieve the required standards in academics, profession, physical fitness and discipline or is found to be medically unfit. **AFTER SUCCESSFUL COMPLETION OF ALL STAGES OF TRAINING, THE AIRMEN SHALL BE DEPLOYED ON JOBS AS PER THEIR ALLOTTED TRADES. ALLOTTED TRADE SHALL NOT BE CHANGED ON CANDIDATE’S REQUEST ON ANY GROUNDS.**

13. **Pay & Allowances.** During training, a stipend of **Rs. 14,600/-** per month shall be paid. On completion of training the **starting gross emoluments at the minimum of scale of pay** including Military Service Pay (MSP) shall be **Rs. 26,900/- per month** plus Dearness allowance (as applicable) which, in subsequent years, may rise as per the career progression of the individual.

14. Other allowances such as Transport Allowance, Composite Personal Maintenance Allowance (CPMA), Leave Ration Allowance (LRA), Children Education Allowance, HRA etc. shall also be admissible to airmen, as per relevant government instructions.

15. **Higher Education.** Airmen shall be permitted to pursue higher education qualification only after acquiring prescribed skill grade in their trade.

16. **Perks.** Perks such as **ration, clothing, medical facilities, accommodation, CSD facilities, Leave (60 days annual and 30 days casual in a calendar year as a privilege, subject to service exigencies), recreational facilities, transport for school going children and Leave Travel Concession (LTC)** shall also be provided as per the existing rules. **Group Insurance Cover of Rs. 37.5 Lakhs at a premium of Rs. 2300/- per month** for all airmen and facility of Group Housing Scheme are also extended.

17. **Job Specification.**
(a) **Automobile Technician.** As an Automobile Technician you will drive all types of light, medium and heavy automobiles, load carriers and specialist vehicles like cranes, towing tractors, fork lifters etc., subject to service exigencies. You will also carry out minor repairs, day to day maintenance and basic level servicing of the common user vehicles and specialist vehicles in the Indian Air Force inventory.
(b) **Indian Air Force (Police).** As an Indian Air Force (Police) your responsibilities involve assuming police duties and investigation of offences. You are also in-charge of maintenance of security.

**Note: Airmen shall also have to undertake any other tasks as assigned by superior authorities.**

**SELECTION PROCEDURE**

18. **Verification of Eligibility.** Original Educational Certificates (10th passing Certificate and 12th passing Certificate & Marks Sheets) and other required applicable original documents like NCC ‘A’, ‘B’ or ‘C’ certificate, Son of serving Air Force Personnel (SOAFP) certificate **(or)** , Discharge Book, Service Book, Service Particular Certificate/Casualty Service Certificate **(or)** Discharge Certificate (if discharged from Army/Navy/Government organisation), Consent form (signed by parents if candidate below 18 years of age) and passport size colour photographs shall be required and scrutinized/verified at the examination venue prior to commencement of Physical Fitness Test to ascertain the eligibility prima-facie. Detailed verification will be carried out later in respect of candidates who pass Physical Fitness Test and subsequently the Written Test. Candidature of those who do not meet the laid down educational criteria shall be rejected during **Initial verification of original certificates & mark sheets** prior to conduct of Physical Fitness Test and also during **detailed verification** on clearing the Physical Fitness Test as well as Written Test or if found at subsequent stage.

**Note: The original Passing Certificates / Marks Sheets will not be retained by the Selection Centre. The same will be returned to the candidates on completion of detailed verification.**

**SEQUENCE OF EXAMINATION**

19. **Group ‘Y’ (Non-Technical) Auto Tech & IAF(P)**

(a) **Physical Fitness Test (PFT).** PFT consists of a **1.6 Km** run to be completed within **6 minutes 30 Seconds**. **Candidates shall also have to complete 10 push-ups, 10 sit-ups and 20 squats within the stipulated time to qualify in the Physical Fitness Test**.

Note: Candidates are advised to bring their **sports shoes** and **shorts/track pant.**

(b) **Written Test.** All candidates who qualify PFT shall undertake Written Test on the same or subsequent day depending on the local conditions. The Written Test will be objective type and question paper shall be bilingual (English & Hindi) except for English paper. Answers are to be annotated on OMR sheet. Detailed procedure shall be explained before conduct of the examination. Duration of the written test will be 45 minutes and shall comprise of **English** as per 10+2 CBSE syllabus and **Reasoning & General Awareness (RAGA)**. **CANDIDATES ARE TO QUALIFY IN EACH PAPER SEPARATELY**. Results of the written test shall be declared on the same day.

(c) **Marking Pattern for Written Test:-** (i) 1 mark for every correct answer. (ii) Nil (0) marks for un-attempted question. (iii) 0.25 marks shall be deducted for each wrong answer or choosing more than one option as answer.

(d) **Adaptability Test-1.** All candidates who pass the Written Test shall undertake Adaptability Test-1 on the same or subsequent day depending on the local conditions. Adaptability Test - 1 is to assess suitability of a candidate for employment in the IAF which involves deployment in varied geographic terrain, weather and operational conditions.

(e) **Adaptability Test-2.** All candidates who pass Adaptability Test-1 will have to undertake Adaptability Test-2 as per policy in vogue. AdaptabilityTest-2 is to select candidates who can adapt to the environment of Indian Air Force and are able to adjust to the military way of life.

**Note: The question paper is a confidential document of Indian Air Force. All candidates to note and understand that access to the question paper is permitted only during the examination. Question paper in any form whatsoever will not be provided to the candidate after examination.**

20. **Medical Examination.** Candidates who qualify Adaptability Test -2 shall be medically examined in the month of **July 2020** at **14 Air Force Hospital, Dundigal.** Medical Examination shall be conducted by Air Force Medical Team as per IAF medical standards and existing policy in vogue. Medical Examination would also include Baseline Investigation of: -

(a) Blood Haemogram - Hb, TLC, DLC (b) Urine RE/ME (c) Biochemistry:- (i) Blood Sugar Fasting & PP (ii) Serum Cholesterol (iii) Urea, Uric acid, Creatinine (iv) LFT- Serum Bilurubin, SGOT, SGPT
(d) X- Ray chest (PA view) (e) ECG (R) (f) Tests for Narcotic Drug and Psychotropic Substance Abuse (if required)

Candidates declared Medically Unfit can avail the option for Appeal Medical Board (AMB) against their Unfitness by depositing Rs. 40/- in a Government Treasury/RBI/SBI through Military Receivable Order (MRO). The application for AMB along with original copy of MRO, photocopy of Unfitness Certificate are to be submitted to the representative of **12 ASC, AF** within three working days of Medical examination. AMB Centre will be **SMC, Air Force Station, Hakimpet.**

21. The recruitment Medical Officer and the specialist doctors of Armed Forces are the final authorities on declaring a candidate Fit or Unfit during initial medical examination, appeal medical board and medical examination prior to enrolment. **The candidate shall be governed by Armed forces standards which may be at variance from civil standards. There is no provision for representation/ review after the appeal medical board.**

**Note : Candidates are advised to get tartar & stains removed from their teeth before appearing for the medical examination. Ears should be free of wax. Candidates should be prepared to travel / stay for the medical test for four to five days under their own arrangement. No TA/DA shall be admissible.**

22. **Publishing of PSL.** The Provisional Select List (PSL) will be displayed at **12 Airmen Selection Centre, Air Force Station Begumpet, Bowenpally, Secunderabad Telangana - 500011** on **31 October 2020**. Copies of the display list will also be sent to District Collector of **Sangareddy (Telangana)** (through Airmen Selection Centre) and will also be available at Central Airmen Selection Board webportal www.airmenselection.cdac.in. The inclusion of names of the candidates in the PSL depends upon the performance of the candidates in the rally. Inclusion of name in the PSL does not guarantee automatic enrolment. Enrolment is strictly in order of merit from the PSL subject to medical fitness, availability of vacancies, not exceeding the age of 21 years on date of enrolment and meeting other laid down eligibility criteria as and when called for enrolment. The validity of PSL shall be 06 months from the date of display and shall be applicable only for **Intake No. 01/2021.**

23. Candidates figuring in the PSL published in respect of ibid Rally and also figuring in one or more PSLs published on the same date, shall be called for enrolment only in any one Group/Trade as per the requirement of IAF. President CASB reserves the right to allocate any Group/Trade for candidates appearing in more than one PSL published on same date.

24. If any such candidate absents himself or expresses unwillingness to join IAF or his candidature gets cancelled due to any reason in the group/ trade in which he was called for enrolment, then the candidate shall be marked as absent/unwilling/candidature cancelled in all other PSLs published on the same date wherever his name figures.

25. If there is any variation between English & Hindi/any other regional language versions of the advertisement, English version shall to be taken as authentic.

26. Any CORRIGENDUM/CHANGES/UPDATES shall be available ONLY on our webportal www.airmenselection.cdac.in and NO INTIMATION SHALL BE GIVEN IN ANY NEWS PAPER/ANY OTHER MEDIA. All candidates are required to see the website of this office from time to time.

**FOR ANY QUERY CONTACT, PRESIDENT, CENTRAL AIRMEN SELECTION BOARD, BRAR SQUARE, DELHI CANTT, NEW DELHI – 110010, TELEPHONE NO. 011- 25694209 /25699606 AND e-mail : casb@iaf.nic.in / casbiaf@cdac.in OR COMMANDING OFFICER, 12 AIRMEN SELECTION CENTRE, AIR FORCE STATION BEGUMPET, BOWENPALLY, SECUNDERABAD TELANGANA - 500011. TELE: 040 27753512 (Direct), 040 27753500 EXTN - 467 AND E-MAIL: co.12asc-ap@gov.in**

**FOR CAREER DETAILS, PROMOTION PROSPECTS, POST RETIREMENT BENEFITS, DETAILED SYLLABUS, MODEL QUESTION PAPERS, PROVISIONAL SELECT LIST AND ENROLMENT LIST, LOG ON TO CENTRAL AIRMEN SELECTION BOARD WEBPORTAL: www.airmenselection.cdac.in**

**DISCLAIMER: The terms and conditions given in the advertisement are guidelines only and orders issued by the Government as amended from time to time will apply for the selected candidates.**

***MOBILE PHONES/ELECTRONIC DEVICES WILL NOT BE PERMITTED IN TESTING AREA***

**IMPERSONATORS WILL BE CAUGHT**

DAVP/10801/11/ 0038/1920

# కాల్ చేస్తే లొకేషన్ తెలిసిపోద్ది!

- డయల్ 100లో కొత్త సదుపాయం
- ప్రత్యేక సాఫ్ట్‌వేర్ రూపొందించిన డీజీపీ కార్యాలయం
- రోడ్డు ప్రమాదాలు, ఆపదలో ప్రాణాలు కాపాడుతుందంటున్న పోలీసులు
- కొత్త సంవత్సరం నుంచి అందుబాటులోకి..

సాక్షి, హైదరాబాద్

**రో**డ్డు ప్రమాదంలో గాయపడ్డ ఓ వ్యక్తి డయల్ 100కి కాల్ చేశాడు. కానీ అవతలివారు కాల్ లిఫ్ట్ చేసేలోపే అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. అతడిది బేసిక్ ఫోన్ కావడంతో ఆ వ్యక్తి ఎక్కడున్నాడో కనుక్కునే సరికి చాలా ఆలస్యమైంది. పోలీసులు, అంబులెన్సు చేరుకునే సరికి అతడు మరణించాడు.

మరో ఘటనలో రైలు నుంచి కిందపడ్డ ఓ వ్యక్తి కాళ్లు విరిగినా డయల్ 100కి కాల్ చేశాడు. తాను మాట్లాడగలిగాడు. కానీ చీకట్లో తానెక్కడ ఉన్నాడో




చెప్పలేకపోయాడు. ఫలితంగా అతడిని వెతికేసరికి నాలుగైదు గంటలు పట్టింది.

అయితే భవిష్యత్తులో డయల్ 100కి కాల్ చేసే బాధితులకు ఇలాంటి కష్టాలు ఉండవు. గతంలో డయల్ 100కి ఫోన్ చేసినవారు తామెక్కడ ఉన్నది చెప్పాల్సి వచ్చేది. పైగా ఏ ఏరియాలో ఉన్నారో తెలిసేది కాదు. ఇకపై ఆ సమస్యలన్నీ తొలగిపోనున్నాయి. దీనికోసం తెలంగాణ పోలీసులు డయల్ 100 విషయంలో మరో అదనపు సదుపాయం చేర్చారు. ఇకపై బాధితులు ఫోన్ చేయగానే ముందు వారెక్కడ ఉన్నారో ఇట్టే తెలిసిపోతుంది. గస్తీ పోలీసులకు బాధితుల లొకేషన్ గాడ్జెట్లపై ప్రత్యక్షమవుతుంది. దాంతో అవతలివారు ఫోన్ మాట్లాడినా, మాట్లాడకపోయినా.. శివారు, మారుమూల, నిర్మానుష్య, అటవీ, రోడ్డు, రైలు ఇలా మార్గమేదైనా.. తెలంగాణ పోలీసులకు క్షణాల్లో తెలిసిపోతుంది. నిమిషాల్లో పోలీసు గస్తీ వాహనం బాధితులు చిక్కుకుపోయిన ప్రాంతానికి వచ్చేస్తుంది.

**నేరాలు, ప్రాణనష్టం నివారణ..**

హైవేలపై జరిగే రోడ్డు ప్రమాదాల్లో చాలామటుకు ల్యాండ్‌మార్క్ చెప్పడం చాలాకష్టం. రైలు ప్రమాదాల్లోనూ అంతే. ఇక కొత్తగా మారుమూల, పట్టణాలకు వచ్చిన వారి పరిస్థితి అంతే. ఈ సదుపాయం అందుబాటులోకి వస్తే.. రోడ్డు ప్రమాద బాధితులను త్వరితగతిన ఆస్పత్రికి తరలించవచ్చని, తద్వారా ప్రాణనష్టం తగ్గుతుందని పోలీసులు చెబుతున్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగిన (గోల్డెన్ అవర్)లో చికిత్స అందితే బాధితులను 90 శాతం కాపాడే అవకాశాలు మరింత పెరుగుతాయి. అంతేకాకుండా కిడ్నాపులు, ఇతర నేరాలు జరిగినప్పుడు ఘటనాస్థలం కనిపెట్టడం ఇకపై క్షణాల్లో పని అని పోలీసులు అంటున్నారు.

## సరికొత్త సాఫ్ట్‌వేర్ రూపకల్పన..

**డ**యల్ 100 విషయంలో బాధితుల లొకేషన్ తెలుసుకోవడం కష్టంగా మారుతున్న విషయంపై తెలంగాణ పోలీసులు ప్రత్యేకంగా దృష్టి సారించారు. చాలాకాలం క్రితమే ఈ సమస్యలపై పలు సాఫ్ట్‌వేర్ నిపుణులతో చర్చించారు. బాధితుల లొకేషన్‌ను క్షణాల్లో గుర్తించడమే దీనికి పరిష్కారమని సూచించారు. ఈ మేరకు ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుని, ప్రత్యేకంగా ఈ సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేయించుకున్నారు. ఇప్పటికే సాఫ్ట్‌వేర్‌ను విజయవంతంగా పరీక్షించారు. కొత్త సంవత్సరం నుంచి రాష్ట్రవ్యాప్తంగా పోలీసులందరికీ అందుబాటులో తీసుకువచ్చేందుకు ప్రతీ పోలీసు గాడ్జెట్లలోనూ ఈ సాఫ్ట్‌వేర్‌ను త్వరలో ఇన్‌స్టాల్ చేస్తారు.

# రాష్ట్రంలో నేడు పొడి వాతావరణం

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో బుధవారం పొడి వాతావరణం ఉంటుందని, గురువారం తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. కోమోరిన్ ప్రాంతం నుంచి దక్షిణ తమిళనాడు వరకు 2.1 కిలోమీటర్ల ఎత్తు వరకు ఉపరితల ద్రోణి ఏర్పడింది. ప్రధానంగా తూర్పు, ఆగ్నేయ దిశ నుంచి రాష్ట్రంలో చలిగాలులు వీస్తాయని వాతావరణ కేంద్రం తెలిపింది. రాష్ట్రంలో మంగళవారం అత్యల్పంగా 13.6 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైనట్లు పేర్కొంది.



## ‘నాట్య’ మయూరీలు

పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ట్రినిటీ పాఠశాలలో మంగళవారం క్రిస్మస్ వేడుకలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భరత నాట్య ప్రదర్శన ఇచ్చేందుకు అలంకరణలో వచ్చిన చిన్నారులు ఒక్కచోట కూర్చొని అందరి దృష్టినీ ఆకట్టుకున్నారు.

*- మర్రి సతీష్‌రెడ్డి, సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి*

# కరీంనగర్ ఐటీ టవర్స్ ప్రారంభం వాయిదా

- మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో వాయిదా వేసినట్లు తెలిపిన మంత్రి గంగుల
- 15 ఐటీ కంపెనీల ప్రతినిధులతో మంత్రి భేటీ

**సాక్షి, హైదరాబాద్:** మున్సిపల్ ఎన్నికల షెడ్యూలు విడుదల నేపథ్యంలో ఈ నెల 30న జరగనున్న కరీంనగర్ ఐటీ టవర్స్ ప్రారంభోత్సవాన్ని వాయిదా వేస్తున్నట్లు మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. ఐటీ టవర్స్‌లో తమ కార్యాలయాలు ఏర్పాటు చేస్తున్న 15 ఐటీ సంస్థల ప్రతినిధులతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. టీఎస్ఐఐసీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్‌కుమార్, ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కరీంనగర్ ఇప్పటికే స్మార్ట్, క్లీన్, సేఫ్ సిటీగా పేరు సంపాదించిందని, దేశంలో 5 లక్షలలోపు జనాభా గల పట్టణాల్లో రెండో నివాసయోగ్య నగరంగా కరీంనగర్ ఎంపికైన విషయాన్ని గుర్తు చేశారు. కరీంనగర్‌లో త్వరలో ప్రారంభమయ్యే ఐటీ టవర్స్ ద్వారా స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు దక్కుతాయని అన్నారు. ప్రస్తుతమున్న ఐటీ టవర్స్‌తోపాటు త్వరలో మరో టవర్, నైపుణ్యాభివృద్ధి శిక్షణ సంస్థను కూడా టాస్క్ ద్వారా ఏర్పాటు చేస్తామన్నారు. హైదరాబాద్ తర్వాత రాష్ట్రంలో రెండో అత్యుత్తమ నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో కరీంనగర్‌లో రూ.38 కోట్లతో ఐటీ టవర్స్‌ను సీఎం కేసీఆర్ మంజూరు చేశారని తెలిపారు. ఇక్కడ ఏర్పాటయ్యే కంపెనీలకు ప్రభుత్వం ఇచ్చే రాయితీలను జయేశ్ రంజన్ వివరించారు. సమీక్ష సమావేశంలో టీఎస్ఐఐసీ చైర్మన్ గ్యాదరి బాలమల్లు, ఎండీ ఈవీ నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

# ‘చల్లటి’ కబురు

**సిటీ ఏసీ బస్సు చార్జీల తగ్గింపు**

- జనవరి 1 నుంచి అమలు
- ఆక్యుపెన్సీ రేషియో పెంచుకునేందుకు ఆర్టీసీ యత్నాలు

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర రాజధాని నగర ప్రయాణికులకు ‘చల్లటి’ ప్రయాణాన్ని అందించేందుకు ప్రారంభించిన ఏసీ మెట్రో లగ్జరీ బస్సుల చార్జీలను తగ్గించాలని ఆర్టీసీ నిర్ణయించింది. ఇప్పటికే వాటి టికెట్ ధరలను ఎంతమేర తగ్గించాలనే విషయంలో అధికారులు కసరత్తు పూర్తి చేశారు. తుది ఆమోదం కోసం ఇన్‌చార్జి ఎండీ సునీల్‌శర్మకు పంపారు. ఆయన ఆమోదం రాగానే కొత్త చార్జీలు అమలు చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. జనవరి 1 నుంచి సిటీ ప్రయాణికులకు కొత్త సంవత్సరం కానుకగా అమల్లోకి తెచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం నగరంలో ఈ కేటగిరీకి సంబంధించి 80 బస్సులు తిరుగుతున్నాయి. వాటిని వోల్వో కంపెనీ నుంచి ఐదేళ్ల కింద కొనుగోలు చేశారు. ఉప్పల్ నుంచి వేవ్‌రాక్, లింగంపల్లి నుంచి ఎల్‌బీనగర్, లింగంపల్లి నుంచి దిల్‌సుఖ్‌నగర్, సికింద్రాబాద్ నుంచి విమానాశ్రయం, సికింద్రాబాద్ నుంచి ఎల్‌బీనగర్.. ఇలా తిప్పుతున్నారు.

**అధిక చార్జీలు..**

హైదరాబాద్ సిటీలో సొంత వాహనాల వాడకాన్ని నియంత్రించేందుకు వీటిని అందుబాటులోకి తెచ్చారు. కార్లలో తిరిగే ప్రయాణికులు కొంతమందైనా సొంత వాహనాలు వదిలి వీటిల్లో ప్రయాణించే అవకాశం ఉందని భావించారు. కానీ కారులో తిరిగే ప్రయాణికులు వీటి జోలికి రాలేదు.. సాధారణ ప్రయాణికులు ఏసీ ప్రయాణాన్ని ఇష్టపడుతున్నా.. టికెట్ ధర ఎక్కువగా ఉండడంతో పెద్దగా సానుకూలత వ్యక్తం చేయట్లేదు. దీంతో 30–40 శాతం ఆక్యుపెన్సీ రేషియోతో ఆర్టీసీకి గుదిబండగా మారాయి. ప్రతి కిలోమీటరుకు దాదాపు రూ.75కు పైగా వ్యయం అవుతుండగా, ఆదాయం మాత్రం



రూ.30ని మించట్లేదు. పోనీ వాటిని తొలగిద్దామంటే, వోల్వో కంపెనీ బస్సు 15 లక్షల కిలోమీటర్ల వరకు తిప్పేందుకు యోగ్యంగా ఉంటుంది. ఈ బస్సులు ఇప్పటికి మూడున్నర లక్షల కిలోమీటర్లు మాత్రమే తిరిగాయి. దీంతో వాటిని అలాగే నష్టాలతో కొనసాగిస్తూ వస్తున్నారు. ఇప్పుడు చార్జీలు తగ్గించటమే సమస్యకు విరుగుడుగా అధికారులు తేల్చారు.

**సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు అందుబాటులో..**

ఈ బస్సుల్లో ఆది నుంచి ఎక్కువగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ప్రయాణిస్తున్నారు. దూరం నుంచి వచ్చేవారు చల్లటి ప్రయాణం, స్టాపులు తక్కువగా ఉండటంతో సమయం కలిసి వచ్చే అవకాశం ఉండటంతో వీటిని ఆశ్రయిస్తున్నారు. కానీ ఇటీవల సమ్మె సమయంలో ఈ బస్సులు 52 రోజుల పాటు డిపోలకే పరిమితం కావటంతో వారు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకున్నారు. సమ్మె ముగిసిన తర్వాత కూడా ఆ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు అలాగే కొనసాగుతుండటంతో, ఇటీవల ఈ సర్వీసుల్లో ఆక్యుపెన్సీ రేషియో మరింత పడిపోయింది. ఇప్పుడు చార్జీలను తగ్గించి మళ్లీ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు అందుబాటులోకి తేవాలని అధికారులు భావిస్తున్నారు. సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఉన్న ప్రాంతాల్లో ఈ బస్సుల గురించి ప్రచారం చేయాలని నిర్ణయించారు. వారితో పాటు సాధారణ ప్రయాణికులు కూడా సానుకూలంగా స్పందించేలా ప్రకటనలు విడుదల చేయాలనుకుంటున్నారు.

## ఇంత తగ్గిస్తారా..?

**ఈ** బస్సుల్లో ప్రస్తుతం లింగంపల్లి నుంచి ఎల్‌బీనగర్‌కు టికెట్ చార్జీ రూ.110గా ఉంది. అదే లింగంపల్లి నుంచి దిల్‌సుఖ్‌నగర్‌కు రూ.80గా ఉంది. ఉప్పల్ నుంచి వేవ్‌రాక్‌కు కూడా అంతే వసూలు చేస్తున్నారు. మెట్రో రైలు కంటే ఇది చాలా ఎక్కువ. దీంతో బస్సులు ఖాళీగా తిరుగుతున్నాయి. ఇప్పుడు రూ.110గా ఉన్న టికెట్ ధరను రూ.75కు, రూ.80గా ఉన్న చార్జీని రూ.50కి తగ్గించబోతున్నట్లు సమాచారం. కనిష్ట టికెట్ ధర రూ.20ని అలాగే కొనసాగిస్తూ, మూడు స్టాప్‌ల తర్వాత చార్జీలను సవరించనున్నట్లు సమాచారం. దీంతో కొన్ని స్టాపులకు మెట్రో డీలక్స్ బస్సు సర్వీసు కంటే రూ.5 చార్జీ మాత్రమే ఎక్కువగా ఉండబోతోంది. దీంతో ప్రయాణికులు ఈ బస్సుల వైపు మళ్లే అవకాశం ఉంటుందనేది ఆర్టీసీ ఆలోచన. ఇటీవల కిలోమీటరుకు 20 పైసలు చొప్పున బస్సు చార్జీలను పెంచిన ఆర్టీసీ, దానికి విరుద్ధంగా ఏసీ మెట్రోలగ్జరీ బస్సుల చార్జీలను తగ్గించనుండటం విశేషం.




E-book today at www.marutisuzuki.com or visit your nearest Maruti Suzuki dealership | Maruti Suzuki vehicles now available under CSD & CPC* | For bulk order, mail at: nishant.vijayvergia@maruti.co.in

AUTHORISED DEALERS: TELANGANA STATE: SRI JAYARAMA: (MEHABUBNAGAR) CALL: 8096998841. WIN MOTORS: (WARANGAL) CALL: 8688828002. ADARSHA: (KARIMNAGAR) CALL: 9133308022, (WARANGAL) CALL: 0870- 26553319. VARUN: (NIZAMBAD) CALL: 8462236236, (KARIMNAGAR) CALL: 0878 – 2950555. PAVAN: (NALGONDA) CALL: 8790902131. E-OUTLETS: ADARSHA: (MANCHERIAL) CALL: 8886006633, (NIRMAL) CALL: 9133307720, (JAGITYAL) CALL: 8886776633, (GODAVARIKHANI) CALL: 8886556633, (ADILABAD) CALL: 7799784536, (JANGAON) CALL: 8886256633, (SIDDIPET) CALL: 9581656633. VARUN: (KAMAREDDY) CALL: 9966111132, (ARMUR) CALL: 9052022990, (KOTTAGUDEM) CALL: 9885260333. PAVAN: (MIRYALAGUDA) CALL: 8790902154, (KODADA) CALL: 8790902135. SRI JAYARAMA: (SHADNAGAR) CALL: 8096998841, (WANAPARTHY) CALL: 8096998841. MITHRA AUTO: (KHAMMAM) CALL: 8886063524. SAI SERVICE: (SANGAREDDY) CALL: 7331168888, (ZAHEERABAD) CALL: 7331168888.

*Offer includes consumer offer, retail support, ISL offer and exchange offer (Wherever Applicable). 2 years standard + 3 years extended warranty is applicable only on Swift Diesel (all variants), Vitara Brezza Diesel (all variants) and Dzire Diesel (all variants) and the above offers for the same are inclusive of the extended warranty offers. ^Additional gold coin offer upto 6 gram is valid on selected models and variants. Terms and conditions apply. The terms and conditions are subject to change without any prior notice. All offers are brought to you by Maruti Suzuki dealers only. Offers may vary from city to city and variant to variant for all models. Parts and accessories shown may not be a part of standard equipment. Colors shown may vary from actual body color due to printing on paper. Images used are for illustration purposes only. The article is released in Hindustan Times. Offers are valid till 31st December 2019.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.